# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

సంపుటి : 57 | సంచిక : 4 | ఏప్రిల్, 2024 | పేజీలు : 28 | వెల : రు. 10/-


### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు - 2024

## ఆంధ్రప్రదేశ్ నేటి దుస్థితికి కారణమైన బిజెపిని, ప్రత్యక్షంగా పరోక్షంగా బిజెపికి కొమ్ముగాస్తున్న పాలక పార్టీలను ఓడించండి!

### సిపిఐ(ఎం-ఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ పిలుపు

**సార్వత్రిక** ఎన్నికలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని పార్లమెంట్ స్థానాలతో పాటు, రాష్ట్ర శాసనసభకు కూడా మే 13వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి.

గత పది సంవత్సరాల కాలంగా కేంద్రంలో అధికారంలోనున్న బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్ర విభజన నుండి ఈనాటి వరకు ఆంధ్రప్రదేశ్‌ను మరింతగా దిగజార్చటానికి ప్రధాన కారణంగా ఉంది. దేశంలో మత మైనారిటీలపై దాడులకు తెగబడుతూ హిందూ మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ, మత విద్వేషాల నడుమ నుండి ప్రజా వ్యతిరేక రాజకీయ ఆర్థిక విధానాలన్నింటిని నిరాటంకంగా నడిపించుకుంటూ వెళ్తోంది. కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ రెండు విడతల ప్రభుత్వాలు ప్రారంభించి, అమలు చేసిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను వేగవంతం చేస్తున్న ఛాంపియన్‌గా దోపిడీ వర్గాల విశ్వసనీయ ప్రతినిధిగా ఎన్డీఏ పాలన సాగిస్తోంది.

అయితే పాలకవర్గాలలోని ఒక సెక్షన్‌కే, ప్రధానంగా అంబానీ అదానీల వంటి గుజరాతీ బడా పెట్టుబడిదారీవర్గాలకే దోపిడీ అవకాశాలలో సింహభాగం కట్టబెడుతూ ఉంది. దీనితో ఇతర పెట్టుబడిదారులకు, వీరికి మధ్య వాటాల కోసం సాగుతున్న కుమ్ములాట.... పాలకపార్టీలు ఎన్నికలలో హోరాహోరీగా తలపడటం రూపంలో మనకు వ్యక్తం అవుతోంది.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం.... రైతాంగం ఊపిరి తీసే మూడు సాగు చట్టాలను ముందుకు తెచ్చి, దీర్ఘకాల రైతాంగ ఆందోళన ఫలితంగా వెనక్కు తీసుకుంది. కార్మికుల కనీసపాటి హక్కులను కాలరాచే నాలుగు లేబర్ కోడ్‌లను వారిపై రుద్దింది. 'మానిటైజేషన్ పైప్ లైన్' (నగదీకరణ పథకం) పేరుతో, లాభాలతో నడుస్తున్న వానితో సహా, దేశంలోని పలు ప్రభుత్వరంగ, ప్రభుత్వ పరిశ్రమలను తెగ నమ్ముతోంది. విదేశీ బ్యాంకులలో మూలుగుతున్న నల్లధనాన్ని వెలికి తెచ్చి ప్రతి భారతీయ పౌరుని ఖాతాలో 15 లక్షల రూపాయలు జమ చేస్తానంటూ ఆర్భాటంగా ముందుకు తెచ్చిన 'పెద్ద నోట్ల రద్దు' (డీ మానిటైజేషన్) ప్రహసనంగా వెల్లడైంది. పౌరుల ఖాతాలలోకి నగదేమీ జమ కాకపోగా, బడా సంపన్న వర్గాలు తమ వద్దనున్న నల్లధనాన్నంతా బ్యాంకుల ద్వారా తెల్లధనంగా మార్చుకునేందుకు ఇది తోడ్పడిందని వెల్లడయింది. 'ఒకే దేశం, ఒకే పన్ను' పేరుతో ముందుకు తెచ్చిన 'వస్తు సేవల పన్ను' (జిఎస్టి).... దిగువ, మధ్యతరగతి వ్యాపార వర్గాలను కోలుకోలేని దెబ్బతీసింది. వారి వ్యాపారాలు, పరిశ్రమలన్నీ కార్పొరేట్ శక్తులు కబళించేందుకే అది తోడ్పడింది. కరోనా సాకుతో వృద్ధులు, వికలాంగులకు, రైలు ప్రయాణాల్లో కల్పించే అతి కొద్ది రాయితీలను కూడా రద్దుచేసి, తదనంతర కాలంలోనూ వాటిని పునరుద్ధరించకపోగా, సామాన్యులు ప్రయాణించే ప్యాసింజర్ సర్వీసులన్నింటినీ రద్దుచేస్తూ, 'వందేభారత్' రైళ్ళతో హోరెత్తిస్తూ సామాన్య, మధ్యతరగతి ప్రజల ప్రయాణ సౌకర్యాలను కుదించివేసింది. పరిశ్రమలు, గనులు, అంతరిక్ష పరిశోధనలు, రైల్వే రక్షణ ఉత్పత్తులు, వార్తా ప్రసార విభాగాల నుండి సౌందర్య సాధనాలు, కిరాణా వ్యాపారం వరకు.... సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలతో ముంచెత్తుతోంది. నిరుద్యోగం మున్నెన్నటికంటే తీవ్ర రూపం దాల్చింది. ఎలాంటి శిక్షణా లేకుండా ఇజ్రాయిల్, ఉక్రెయిన్‌లలోని యుద్ధరంగాలలో పనులకోసం యువత వెళ్ళడానికి తెగించడం – దేశంలో నిరుద్యోగ తీవ్రతను ఎత్తిచూపుతోంది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాసులు, నిత్యవసరాల ధరలు అనూహ్యంగా పెరిగిపోతూ సామాన్యుని జీవితం మరింత దుర్భరంగా మారుతోంది.

కోవిడ్ సమయంలో' ఆత్మ నిర్భర భారత్' పేరున, 'పిఎం కేర్స్' పేరున ప్రభుత్వం వద్ద పోగుపడిన లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ నిధులను, విరాళాలను కేంద్ర ప్రభుత్వం అప్పనంగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టింది. మరోవైపున కోట్లాదిమంది కార్మికులను 'లాక్ డౌన్ 'ప్రకటనతో ప్రయాణ సౌకర్యాలేమీ లేకుండాజేసి, హఠాత్తుగా వారిని రోడ్లపైకి నెట్టివేసింది. బడా పారిశ్రామిక వర్గాలకు ప్రతి ఏటా వేల కోట్ల రూపాయల పన్ను రాయితీలను కల్పిస్తోంది. బ్యాంకులలోని ప్రజాధనాన్ని కొల్లగొట్టి, అప్పులు ఎగవేసి, విదేశాలలో విహరిస్తున్న బడా బాబుల రుణాలు రాబట్టేందుకు సిద్ధంకావటంలేదు. మరోవైపున, కరోనా కష్ట సమయంలోనూ పంటలు పండించి దేశానికి తిండి పెట్టిన రైతన్నలు కష్టాలతో, రుణభారాలతో నానా యాతనలు పడుతూ, ఒక్క పర్యాయం రుణాల రద్దు చేయమంటే కూడా అంగీకరించడానికి నిరాకరించింది.

జనశక్తి
విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

వెబ్‌సైట్ :
www.janasakthionline.com
ఈ-మెయిల్ :
janasakthi1963@gmail.com

సంపుటి : 57
సంచిక : 4

**లోపలిపేజీల్లో....**

ప్రకటన :
2024 శాసనసభ ఎన్నికలు - సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి ప్రకటన 1
జెఎన్‌యు విద్యార్థులపై దాడి- ఆర్ఎస్ఎస్‌వైసె పిలుపు 17
అంతర్జాతీయం :
గాజాలో మానవహననం-పాలస్తీనా సంస్థల పిలుపు 28
రాజకీయార్థికం :
లడఖ్-ప్రజాస్వామిక ఆకాంక్షల అణచివేత 4
భారత నేర చట్ట సవరణ 6
ఎన్నికలకు మరో ఆయుధం సిఏఏ 7
లెనిన్ శతవర్ధంతి సంవత్సరం :
'లెనినిజం చిరస్థాయి అగుగాక' 9
అధ్యయనం కోసం :
బుద్ధుడు - కారల్ మార్క్స్ - డా॥బి.ఆర్.అంబేద్కర్ 18
రాష్ట్రీయం :
ప్రజాకర్షక పథకాలతో వంచనలు 14
సంస్మరించుకుందాం :
కా॥ మధు 13
కా॥ మండ్ల సుబ్బారెడ్డి 13
కామ్రేడ్స్ విశ్వమోహనరెడ్డి, మరియమ్మ 26
సంతాపం/జోహార్లు :
అడ్మిరల్ రాందాస్ 3
గంగుల నరసయ్య 17
రిపోర్టు :
కర్ణాటక - మిర్చియార్డుపై దాడి, వాస్తవ సేకరణరిపోర్టు 27

వెల : విడిప్రతి....................రూ.10/-
సంవత్సర చందా....రూ. 100/-

చిరునామా :
ఎస్.శేషమ్మ, ఎడిటర్
32-13-26/1, బి.ఎం.ఆర్. రోడ్,
ఎం.ఆర్.పురం, విజయవాడ-10.

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడానికి ససేమిరా సాధ్యం కాదంటోంది. కానీ, కేంద్రం ప్రతి ఏటా వేలకోట్ల రూపాయలను బడా పారిశ్రామికవేత్తల రుణబకాయిలను ఎన్ పి ఏ (నిరర్ధక ఆస్తుల) పేరున రద్దు చేస్తూ రావడం, వారి దోపిడీ వర్గ స్వభావాన్ని నానాటికీ బట్టబయలు చేస్తోంది. ప్రపంచ ఆకలి సూచీలో, 125 దేశాల జాబితాలో 111వ స్థానానికి దిగజారిన మన దేశం, 2019-23 మధ్యకాలంలో ప్రపంచ దేశాల జాబితాలో, ఆయుధాల దిగుమతిలో అగ్రభాగాన ఉండడం... దోపిడీ పాలకుల ప్రాధాన్యతలను తేటతెల్లం చేస్తోంది.

రాజ్యాంగంలోని 370, 35-ఏ అధికరణాలను అప్రజాస్వామికంగా రద్దుచేసి, జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం అణిచివేస్తోంది. ఈశాన్య రాష్ట్రాలలో, ప్రత్యేకించి మణిపూర్ కొండల్లో విలువైన ఖనిజ నిక్షేపాలను సామ్రాజ్యవాద, బడా కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం, ఆ ప్రాంత ఆదివాసీలైన నాగా, కుకీలపైకి, మతోన్మాదం తలకెక్కించిన మైతీలను ఎగద్రోలి, పోలీసు మిలటరీ బలగాల ప్రత్యక్ష పర్యవేక్షణలో, స్థానిక బిజెపి రాష్ట్ర పాలకుల అండదండలతో, మానవహననం, అత్యాచారాలు,అరాచకాలను అంతులేకుండా సాగిస్తోంది.

బాబ్రీ మసీదును కూల్చిన స్థలంలోనే వేలకోట్ల రూపాయల వ్యయంతో రామాలయం నిర్మించి, దానిని అట్టహాసంగా ప్రారంభించి, ప్రజల్లో భావోద్వేగాలను పెంచుతూ, మధుర-కాశి-జ్ఞానవాపిలలోనూ వివాదాలను రేపుతోంది. పాక్, చైనాలతో సరిహద్దు వివాదాలతో జాతీయోన్మాదాన్ని ప్రేరేపిస్తున్నది. సిబిఐ, ఈడి వంటి నిఘా, దర్యాప్తు సంస్థలన్నింటినీ తమ రాజకీయ ప్రయోజన సాధనాలుగా మలుచుకొని వ్యవహరిస్తోంది. ప్రత్యర్థి రాజకీయ పార్టీలపైనే కాక ప్రభుత్వ వ్యతిరేక, ప్రజాస్వామ్య గొంతుకలను, ఛానెళ్లను, ప్రజాస్వామిక వాదులను అణచివేస్తూ ఫాసిస్టు పాలన దిశగా వేగంగా కదులుతోంది.

సామ్రాజ్యవాదుల రాజకీయ ప్రయోజనాలలో భాగంగా జరిగిన ఆంధ్రప్రదేశ్ విభజన తదనంతరము కూడా, విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మరింత అధోగతి పాలు చేసింది.

విభజన హామీలైన ప్రత్యేక హెూదా, కడప స్టీలు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక అభివృద్ధికి నిధులు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం-నిర్వాసితుల పునరావాసం, రాజధానిఅంశం వంటి ఏ ఒక్కదానినీ నెరవేర్చక పోగా, ప్రజలు ప్రాణత్యాగాలతో సాధించుకున్న 'విశాఖ ఉక్కు'ను ప్రైవేటీకరించటానికి సిద్ధమవుతోంది.

ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో గత ఐదేళ్లుగా అధికారంలోనున్న వైసీపీ కానీ, నేడు బిజెపితో కలిసి కూటమిగా ముందుకు వస్తున్న టిడిపి జనసేనలు కానీ, విభజిత హామీల అమలు కోసం, కేంద్ర ప్రభుత్వం నుండి రాబట్టుకోవాల్సిన నిధుల కోసం, ఒకరిపై ఒకరు దిగజారుడు ప్రకటనలు.... బూటకపు హూంకరింపులు మినహా.. ఆచరణలో నిర్దిష్టంగా చేపట్టిన కార్యక్రమం ఒక్కటంటే ఒక్కటి లేకపోవడం శోచనీయం. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఇంతగా కాలరాస్తున్న బిజెపికి, ఈ రాష్ట్రంలో స్థానం కల్పించేందుకు అధికార వైసిపి, విపక్ష టిడిపి-జనసేనలు పూనుకోవటం సిగ్గుచేటైన విషయం.

ప్రజా వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా కానీ... సంవత్సర కాలం పైగా దేశవ్యాప్తంగా సాగిన రైతాంగ ఉద్యమానికి సంఘీభావంగా కానీ... ప్రజలపై అత్యధిక భారాలను మోపిన పెద్ద నోట్ల రద్దు, జిఎస్టిల అమలుకు వ్యతిరేకంగా కానీ... కార్మికుల కనీస హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ గానీ... రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, రాష్ట్రాల ఆర్థిక వనరులన్నింటిని కేంద్రం తన గుప్పెట పెట్టుకోవడాన్ని ఖండిస్తూ గాని... రాష్ట్రంలోని ఏకైక పెద్ద పరిశ్రమగా ఉన్న విశాఖ స్టీలు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరింప చేయడానికి కానీ... ప్రజల భావోద్వేగాలతో చెలగాటమాడుతూ రాజధాని అంశాన్ని రాజకీయం చేయడంపై గాని... రాష్ట్రానికి ప్రత్యేక హెూదా 10 కాదు 15 ఏళ్లు ఇవ్వాలని డిమాండ్‌చేసి కూడా, కేంద్రంలో అధికారంలో ఉంటూ... ప్రత్యేక హెూదా ఇచ్చేది లేదని అధికారికంగా తెగేసి చెప్పటాన్ని నిరసిస్తూ కానీ... పోలవరం నిర్మాణం-నిర్వాసితుల అంశంలో కేంద్ర ప్రభుత్వం నుండి రాబట్టుకోవాల్సిన నిధుల మంజూరు కోసం గానీ... ఆదివాసులను శాశ్వతంగా అడవుల నుండి గెంటివేసి, అడవులను, అడవులలోని ఖనిజ సంపదలను బడా కార్పొరేట్ సంస్థలకు కట్టపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు తెచ్చిన అటవీ సంరక్షణ (సవరణ) చట్టాన్ని, జీవవైవిధ్య, పర్యావరణ చట్టాల సవరణలను గాని... దేశవ్యాప్తంగా ప్రజలు ప్రజాస్వామికవాదులు మీడియా సంస్థలపైనే గాక ముఖ్యంగా మణిపూర్ ఆదివాసి మహిళలపై జరిగిన అత్యంత ఘోరమైన దాడులకు, అకృత్యాలకు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా గాని... దేశ ప్రజలలో ముస్లిం మైనారిటీల

పట్ల వివక్షత చూపుతూ పొరుగు దేశాల నుండి వచ్చిన వారిలో ముస్లిమేతరులకు మాత్రమే పౌరసత్వం ఇస్తామంటూ ఎన్నికల ముందు అమలుకు పూనుకున్న 'పౌరసత్వ సవరణ చట్టం' (సిఏఏ)కి వ్యతిరేకంగా కానీ... కనీసం పెదవి విప్పలేని, నోరు కదపలేనంతగా, బిజెపికి సాగిలపడిన వైసిపి, టిడిపి, జనసేనలు.... రాష్ట్ర ప్రయోజనాల కోసం అంటూ ఈనాడు గుండెలు బాదుకుంటున్నదంతా ప్రజలను వంచించేందుకు మినహా వేరు కాదు. ఆంధ్రుల ఆత్మగౌరవం, ఆత్మాభిమానం గురించి బడాయి మాటలు కాకుండా, విభజిత ఆంధ్రప్రదేశ్‌ను గత పదేళ్లలో మరింత అధోగతి పాలు చేసిన బిజెపిని నిలవేయలేక పోవడానికి ఈ పార్టీలన్నింటికీ పరస్పర ప్రయోజనాలు ముడిపడి వుండటం, అవకాశవాద లొంగుబాటు రాజకీయ విధానాలే కారణం. రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిన వీరు, ప్రజలను మాయజేసి వంచించేందుకు, ఒకరిని మించి ఒకరు ప్రజాకర్షక తాయిలాలను ప్రకటిస్తూ, ఓట్లను దండు కునేందుకు విచ్చలవిడిగా డబ్బు, మద్యాలను పారిస్తూ ప్రజలను లోబరచుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలన రాష్ట్రాన్ని మరింత అప్పులమయం చేసింది. కేంద్ర బిజెపి ప్రభుత్వ ఆదేశాలను తూచ తప్పక అమలుచేయడంలో ముందుంది. ఒక క్రమంలో రైతులకు అందించే కనీసపాటి ఉచిత విద్యుత్తుకు కూడా ఖరీదు కట్టి వసూలు చేసేందుకు వీలుగా, జగన్ ప్రభుత్వం సాగు మోటార్లకు మీటర్లు బిగించాలననే ప్రపంచ బ్యాంకు ఆదేశాలను అమలు చేయడంలో ముందు నిలిచింది. రాష్ట్రంలో మద్య నిషేధం దిశగా సాగుతామంటూ, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే, (బెల్టు షాపుల ద్వారా అదనం) మద్యం విక్రయాల ఆదాయాన్ని గతం కంటే పెంచి వేసింది. మద్యంపై వచ్చే ఆదాయాన్ని గ్యారెంటీగా చూపుతూ దానిపై రుణం తీసుకుని, సంక్షేమ కార్యక్రమాల అమలుకు అవసరమని చెబుతూ ప్రజలను దగా చేస్తోంది. ఇసుక, ఖనిజాలు, గ్రానైటువంటి సహజ వనరుల దోపిడీని ఇష్టారాజ్యంగా, చట్ట భీతి లేకుండా సాగించి, తమ అనుంగు రాజకీయ మాఫియా ముఠాలకు దోచిపెడుతోంది. గందరగోళపు అస్తవ్యస్త విధానాలతో విద్యారంగాన్ని, ముఖ్యంగా ప్రాథమిక విద్యారంగాన్ని దెబ్బతీసింది. విద్యా రంగంలో కీలకమైన ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకుండా ఉపాధ్యాయులపై కత్తి దూసింది. వైసీపీ వాగ్దానం చేసిన విధంగా పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్న డిమాండ్‌ను పరిష్కరించకుండా, దాని కొరకు సాగే ఆందోళనలను పోలీసు నిర్బంధంతో అణిచివేసింది. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామనే హామీని అటకెక్కించింది. కనీస పాటి నిరసనలు తెలిపేందుకు కూడా అవకాశం లేకుండా, 'జీవో నెంబర్ ఒకటి'తో ప్రజాస్వామిక హక్కులను హరించి వేసింది. ఏళ్ళ తరబడి, నెలల తరబడి ఆందోళనలు సాగిస్తున్న రాజధాని రైతులతో గాని, విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులతో గాని కనీసం చర్చించడానికి కూడా పూనుకోలేదు. ప్రతి ఏటా 'జాబ్ క్యాలెండర్'తో లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని తుంగలో తొక్కి, నిరుద్యోగుల ఆందోళనలపై లాఠీలతో విరుచుకు పడింది. రాష్ట్రంలో ఓడరేవులు, పరిశ్రమలను సామ్రాజ్యవాద బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడంలో, వేలాది ఎకరాల భూములను వారికి తేరగా పంపిణీ చేయడంలో ముందుంది. గ్రామీణ ప్రాంతాల్లో.... దళితులపై, మహిళలపై, భూస్వామ్య పెత్తందారుల దాడులు, హత్యాచారాలు గణనీయంగా పెరిగేందుకు ప్రోత్సహిస్తోంది.

విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా పాలన సాగించిన నాటి చంద్రబాబు నేతృత్వం లోని టిడిపి, బిజెపి, జనసేనల పాలన కూడా సారాంశంలో దీనికి భిన్నంగా ఏమీ లేదు.

ఈ నేపథ్యంలో జరుగుతున్న ప్రస్తుత రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో **బిజెపిని; బిజెపికి పరోక్షంగా తోడ్పడుతున్న అధికార వైసీపీని; బిజెపితో నేరుగా జతకట్టిన టిడిపి, జనసేనల కూటమిని తిరస్కరించవలసిందిగా సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది.** సామ్రాజ్యవాదులకు సేవ చేస్తున్న పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలను తిరస్కరించాలని, ఎండగట్టాలని, ఏ పాలకపార్టీ అధికారంలోకి వచ్చినా సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలు సాగించటం మినహా మరో దగ్గరి మార్గమేదీ లేదని గ్రహించాలని, మౌలిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విధానాలపై మన పోరాటాన్ని ఎక్కుపెట్టాలని పిలుపునిస్తోంది. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారం కోసం... నూతన ప్రజాస్వామిక వ్యవస్థ దిశగా ఉద్యమించాలని పిలుపునిస్తోంది. ✡

## అడ్మిరల్ రాందాస్ మరణానికి సంతాపం

భారతదేశపు రక్షణ శాఖకు మూడు మూలస్తంభాలలో ఒకటైన నౌకాదళానికి అత్యున్నత అధికారిగా (1990-93) పనిచేసిన 90 ఏళ్ళు పైబడిన అడ్మిరల్ లక్ష్మీ నారాయణ్ రాందాస్ మార్చి నెల 15వ తేదీన హైదరాబాదులో మరణించారు.

ఆయన సైనిక దుస్తుల్లో నిలిచిన లౌకిక జీవన అభిలాషి. తన హయాంలో రక్షణ శాఖలోని నౌకాదళంలోకి మహిళలను రిక్రూట్ చేయించిన అధికారి. తన ముగ్గురు కూతుళ్లను మూడు దేశాలకు, మూడు మతాలకు చెందిన వారిని వివాహమాడటాన్ని స్వాగతించినవారు. పొరుగు దేశాలతో యుద్ధాలను అధికార విధిగా నిర్వహించినప్పటికీ, శాంతి ప్రజాస్వామ్యాల కోసం భారత పాకిస్తాన్ ప్రజా వేదిక (PIPFPD) కార్యకలాపాలలో చురుకుగా నాయకత్వం వహించారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను, ప్రత్యేకించి గడచిన పది సంవత్సరాల కాలంపైన తీవ్ర విమర్శనాత్మకతను ప్రదర్శించారు. సాధారణ ప్రజల రోజువారీ జీవన సమస్యల పట్ల ఒక మానవతావాదిగా స్పందించి, అందుకు కారణమైన పరిస్థితులలో మార్పు రావాలని ఆశించారు.

అత్యున్నతాధికార వర్గాలలో కూడా అడ్మిరల్ రాందాస్ లాంటి మానవతావాదులు ఉండటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, వారి మరణానికి 'జనశక్తి' సంతాపం తెలుపుతోంది.


*Read !* *Subscribe!!*




Organ of Central Committee of CPI (ML)

*Read !* *Subscribe!!*




Hindi Organ of
Central Committee of CPI (ML)

# లడఖ్ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను అణచివేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**2019** ఆగస్టు 5వ తేదీన రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేసింది. అప్పటికే జమ్ముకాశ్మీర్ ప్రభుత్వ పాలనలో వివక్షకు గురౌతూ, తమను వేరుపరచాలని డిమాండ్ చేస్తూ వస్తున్న లడఖ్ ప్రజానీకం, ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. వీధుల్లోకి వచ్చి తమ ఆనందాన్ని ప్రకటించారు. భూసేకరణ చట్టం–2013లో వున్న 'పరిశ్రమల భూసేకరణకు గ్రామ సభల అంగీకారం అవసరం' అనే కనీసపాటి రక్షణ నిబంధనను బిజెపి అధికారంలోకి రాగానే తొలగించింది. కార్పోరేట్ల సేవలో తరించడమంటే యిదే. జమ్మూ కాశ్మీర్ పాలకుల నుండి విముక్తి లభించిందని, ఎన్నాళ్ళనుండో తాము కోరుకున్న డిమాండ్ నెరవేరిందని ఎగిరి గంతేసిన లడఖ్ ప్రజలకు రెండేళ్లు తిరక్కముందే అసలు విషయం అర్థమైంది.

370వ అధికరణం రద్దుతో అసెంబ్లీ కూడా లేని కేంద్రపాలిత ప్రాంతంగా లడఖ్ ఏర్పాటయింది. ఢిల్లీ పాలకులు నేరుగా లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా పరిపాలించడం మొదలు పెట్టారు. ప్రతిరోజు ఎవరెవరో తమ ప్రాంతానికి వస్తున్నారు. రోడ్లు వేస్తున్నారు. సోలార్ ప్రాజెక్టు నిర్మాణాలు అంటున్నారు. పర్యావరణరీత్యా సున్నితమైన ఈ ప్రాంతంలో కొత్త కొత్త సొరంగాలు తవ్వుతున్నారు. తమ ప్రాంత జనాభా స్వరూపం మారిపోతోంది. తమ కళ్ళ ముందే తమ సహజ వనరుల తవ్వకాలు జరుగుతున్నాయి. తమ అందమైన సున్నితమైన పర్యావరణం హిమశిఖరాలు, హిమానీ నదాలు రూపుమారిపోతున్నాయి.

వీటన్నిటినీ చూస్తున్న లడఖ్ ప్రజల్లో అశాంతి మొదలైంది. పాలక ప్రతిపక్ష పార్టీలు స్తబ్దుగా ఉన్నవేళ కొత్త ఉద్యమ నాయకులు పుట్టుకొచ్చారు. వారిలో ప్రధాన వ్యక్తి సోనం వాంగ్ చుక్. ఆయన ఒక పర్యావరణ పరిరక్షణ కార్యకర్త. ఇంజనీరు. కొత్త సాధనాల ఆవిష్కర్తగా అవార్డులు అందుకున్న వ్యక్తి. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ గ్రీన్ టీచర్‌గా పేరుగాంచిన యాక్టివిస్టు. తన ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని చూసి, హామీలు ఇచ్చి మోసగించిన పాలకుల తీరును చూసి సహించలేక ఉద్యమకారుడిగా మారాడు. 2023 జనవరిలో ఐదు రోజులు నిరాహార దీక్ష చేశాడు. 2024 ఫిబ్రవరి మూడవ తేదీన లడఖ్ రాజధాని లేలో పెద్ద ఎత్తున ర్యాలీ బహిరంగ సభ జరిగాయి. ఈ ర్యాలీలో లడఖ్‌లో ఉన్న మూడు లక్షల జనాభాలో 30వేల మంది పాల్గొన్నారు. అంటే 10 శాతం జనాభా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత రెండేళ్లుగా ప్రదర్శనలు, ఊరేగింపులు, బందులు, ఆందోళనలు, సభలు సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కూడా ఆందోళనలు జరిగాయి. కంటి తుడుపు చర్యగా కేంద్ర ప్రభుత్వం హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ అధ్యక్షతన కమిటీని ఏర్పరచింది. ఇప్పటికి 9 దఫాలు చర్చలు జరిగాయి; ఫలితం శూన్యం. ఇవన్నీ సాచివేతకు తప్ప, సమస్య పరిష్కారానికి కాదని లడఖ్ ప్రజలకు అర్థమైంది. 21రోజుల ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. వందలాది మంది ఆయనకు మద్దతుగా నిరాహార దీక్షలు, ప్రదర్శనలు చేస్తున్నారు.

## లడఖ్ ప్రజల డిమాండ్లు ఏమిటి?

లడఖ్ ప్రజలు కోరుతున్నవేమీ గొంతెమ్మ కోర్కెలు కావు. లడఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని కోరుతున్నారు. లడఖ్ 18,800 అడుగుల ఎత్తులో ఉన్న హిమాలయ పర్వత ప్రాంతం. లే, లడఖ్, కార్గిల్ ప్రధాన ప్రాంతాలు. లేలో బౌద్ధులు, కార్గిల్లో ముస్లింలు మెజార్టీగా ఉన్నారు. మొత్తం మీద లడఖ్‌లో నివసిస్తున్న వారిలో 97% మంది షెడ్యూల్ తెగల వారే. అందుకే వీరు తమ ప్రాంతానికి ఆరవ షెడ్యూల్లో స్థానం కల్పించమంటున్నారు. ఇది వీరి రెండో ప్రధాన డిమాండ్. లడఖ్‌కు ఆరవ షెడ్యూల్లో స్థానం కల్పించాలంటే దానికి రాష్ట్ర ప్రతిపత్తి కూడా కల్పించాల్సి ఉంటుంది. స్థానిక ప్రజలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానంతో పాటు రాజ్యసభ స్థానాన్ని కూడా కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఆరవ షెడ్యూల్ ప్రయోజనాలు

6వ షెడ్యూలులో చేర్చిన ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జోక్యం లేకుండా గిరిజన ప్రజలు స్వతంత్ర జిల్లా కౌన్సిల్(ADC), స్వతంత్ర ప్రాంతీయ కౌన్సిళ్ళు(ARC)ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. అడవుల నిర్వహణ, వ్యవసాయం, గ్రామాల పట్టణాల పరిపాలన, వారసత్వం, వివాహాలు, విడాకులు, సాంఘిక ఆచారాలు తదితర అంశాలు ఈ కౌన్సిళ్ళ పరిధిలోకి వస్తాయి. వీటిపై చట్టాలు చేయడానికి, వీటి అమలుకు అధికారులను నియమించుకునే అవకాశం కలుగుతుంది. ప్రజల మధ్య వచ్చే తగాదాల పరిష్కారానికి గ్రామ కౌన్సిళ్ళు లేక గ్రామ న్యాయస్థానాలను కూడా ఈ ADC, ARCలు ఏర్పాటు చేయవచ్చు. గిరిజన ప్రజల స్వయం పరిపాలన వ్యవస్థ కొరకు 371–ఏ ద్వారా నాగాలాండ్‌కు, 371–బి మరియు సి ద్వారా అస్సాం, మణిపూర్‌లకు; 371–జి ద్వారా మిజోలకు, 371–ఎఫ్ ద్వారా సిక్కింకు, 371–ఐ ద్వారా అరుణాచల్ ప్రదేశ్, 371– హెచ్ ద్వారా గోవాకు కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించబడ్డాయి. రాజ్యాంగం కల్పిస్తున్న ఈ ప్రత్యేక హక్కులు పొందడానికి ప్రస్తుతం లడఖ్ ప్రజలు తమను ఆరో షెడ్యూల్‌లోకి చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

గత రెండు ఎన్నికల సందర్భంగా బిజెపి లడఖ్‌ను ఆరో షెడ్యూల్లో చేరుస్తానని తన ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చింది. స్వయంగా హోం మంత్రి అమిత్ షా స్థానికులకు 371 అధికరణం వర్తింప చేస్తామని, స్థానిక ప్రజలకు 80% రిజర్వేషన్లు కల్పిస్తామని వాగ్దానం చేశాడు. ఆ హామీలు నమ్మి లడఖ్ ప్రజలు రెండుసార్లు బిజెపికి ఓట్లు కూడా వేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తమను మోసం చేసిందని లడఖ్ ప్రజలు భావిస్తున్నారు. వాస్తవానికి ఆరవ షెడ్యూలు కొన్ని హక్కులు కల్పించిన రాష్ట్రాల్లో సైతం, కుయుక్తుల ద్వారా, ప్రజలకు భ్రమలు కల్పించడం ద్వారా, స్థానిక నాయకులను తమ వైపు తిప్పుకోవడం ద్వారా చట్టాల్లో ఉండే లొసుగులను ఉపయోగించుకుంటూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆరో షెడ్యూల్ స్ఫూర్తిని దెబ్బతీసే విధానాలను అమలు చేయడం పరిపాటిగా మారింది. 1/70 చట్టాన్ని ఏ స్థాయిలో నిర్వీర్యపరిచి గిరిజన భూములను గిరిజనేతరులు కబ్జా చేస్తుంటే ప్రభుత్వాలు ఎంతటి ప్రేక్షకపాత్ర వహించాయో ఈ రాష్ట్రంలో మనందరం చూశాం; చూస్తున్నాం.

370వ అధికరణం వల్ల జమ్మూకాశ్మీర్లో భూమి రాష్ట్రేతరులకు, కార్పొరేట్లకు ఇటీవల వరకు అన్యాక్రాంతం కాలేదు; అభివృద్ధి పేరిట విధ్వంసం జరగలేదు. అదే సందర్భంలో

హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో అభివృద్ధి పేరిట నిర్మించిన ఆనకట్టలు, విద్యుత్ ప్రాజెక్టులు, నాలుగు వరుసల భారీ రహదార్లు -పర్యావరణాన్ని నాశనం చేసి వరదలు సంభవించటం, కొండ చరియలు విరిగిపడడం లాంటి ప్రకృతి వైపరీత్యాలకు దారితీశాయి. (ఉత్తరాఖండ్-సిల్క్యారాలో సొరంగం కూలి, 41 మంది కార్మికులు అందులో చిక్కుకుపోయిన ఘటన ఇటీవల కాలంలోనిదే) ఈ స్థాయిలో కార్పొరేట్లు జమ్ము కాశ్మీర్లో ప్రవేశించడానికి 370వ అధికరణం ఎంతో కొంత నిలువరించింది. దాన్ని తొలగించి మోడీ అమిత్ షాలు జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం - 2019 తెచ్చారు. ఈ చట్టం ద్వారా ఎలాంటి అడ్డంకులు లేకుండా జమ్మూ కాశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలలో కార్పొరేట్ల ప్రవేశానికి మార్గం సుగమం చేశారు. వాస్తవానికి జమ్ము కాశ్మీర్లో రాష్ట్రపతి పాలన విధించిన నాటి నుండే ఈ కార్యక్రమం మొదలైంది. జమ్మూ కాశ్మీర్, లడఖ్లను కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చిన తర్వాత ఈ క్రమం నిరాటంకంగా ఊపందుకుంది.

లడఖ్లో అనేక సహజ వనరులు ఉన్నాయి. పూగా లోయలో; లే, కార్గిల్లలో మంచి నాణ్యమైన చలువ రాయి, సిమెంట్ గ్రేడ్ సున్నపు రాయి, నాణ్యమైన గ్రానైట్, ఖనిజ సంపద ఈ కేంద్రపాలిత ప్రాంతంలో ఉంది. పాషమా శాలువాల తయారీకి కావలసిన ఉన్ని ఇచ్చే గొర్రెల పెంపకం ఈ ప్రాంతంలో ఎక్కువ.

ఇప్పటికే విద్యుత్ వాహన బ్యాటరీ తయారీలో అత్యావశ్యకమైన 'లిథియం' ఖనిజ నిక్షేపాలు, కాశ్మీర్లోని రియాసీజిల్లా సలాల్ హైమా ప్రాంతంలో ప్రభుత్వం గుర్తించింది. పర్యావరణరీత్యా సున్నితమైన ఈ ప్రాంతంలో విషపూరితమైన ఈ లిథియం గనులను వేలంవేసి, కేంద్రప్రభుత్వం బడాకార్పొరేట్లకు కట్టబెట్టనుంది.


480 కోట్లకు లే లేమ విమానాశ్రయ విస్తరణ, లక్షకోట్ల రూపాయల వ్యయంతో బిలాస్పూర్ రియు ఇతర రైలు మార్గాలు, 27 వేల కోట్ల రూపాయలతో లే అల్ట్రా మెగా సోలార్ ప్రాజెక్టు, 1680 కోట్ల రూపాయల వ్యయంతో లడఖ్ నుండి హిమాచలప్రదేశ్ను కలుపుతూ 4.1కిలోమీటర్ల సింకుల్లా టన్నెల్, బిలాస్పూర్ -మనాలిలే రైలు ప్రాజెక్టు లలో భాగంగా 62 టన్నెళ్ళ నిర్మాణాలు, 30 వేల మంది వీక్షించేందుకు వీలుగా ఫుట్బాల్ స్టేడియం, 45వేల కోట్ల ఖర్చుతో వివిధ సోలార్ ప్రాజెక్టులు, 1170 కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణం లాంటి ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో చేపట్టింది. వీటికి భూ కేటాయింపులు గాని, సహజ వనరుల తవ్వకాలకు గాని, పర్యావరణ అనుమతులకు గాని స్థానిక ప్రజల నుండి ఎలాంటి ప్రతిఘటన లేకుండా కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరిచింది. ఈ సౌలభ్యం కోసమే లడఖ్ను ఆరవ షెడ్యూల్లో చేర్చడం లేదనేది సుస్పష్టం.

ఇదంతా లడఖ్ అభివృద్ధి కోసం అని, పర్యాటకరంగ అభివృద్ధి కోసమని తద్వారా స్థానిక ప్రజల భవిష్యత్ తీర్చిదిద్దడానికి అనే మాయ మాటలు నమ్మే స్థితిని లడఖ్ ప్రజలు దాటిపోయారు. వాళ్ల కళ్ళముందే కనిపిస్తున్న వారి సాంస్కృతిక విధ్వంసం, పర్యావరణ విధ్వంసం,అక్కడ జరుగుతున్న ఆర్థిక రాజకీయ నిర్ణయాలలో స్థానిక నాయకత్వానికి జీరో ప్రమేయం, తదితర అంశాలు ఆ ప్రజలను అప్రమత్తం చేశాయి. లడఖ్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపీకే చెందిన ఏకైక పార్లమెంటు సభ్యుడు కూడా ప్రజానిరసనలకు తలొగ్గి, తమ భూములను, ఉపాధి అవకాశాలను, సాంస్కృతిక ప్రాముఖ్యతను సంరక్షించాలని కేంద్రాన్ని డిమాండ్ చేయక తప్పలేదు.

లడఖ్లో అడవులు లేకపోయినా అక్కడున్న గడ్డి మైదానాలు వ్యవసాయానికి, గొర్రెల పెంపకానికి అనువైనవి. అడ్డూ అదుపు లేని పారిశ్రామికీకరణ పేరిట జరుగుతున్న కార్పోరేట్ల విధ్వంసం, వారి పచ్చగడ్డి మైదానాలను హరిస్తున్నాయి. మన ప్రభుత్వం కూడా రక్షణ రంగ మౌలిక వసతుల పేరిట చేపడుతున్న నిర్మాణాల వల్ల గడ్డి భూములు హరించుకు పోతున్నాయి. 2019 తర్వాత ప్రభుత్వ రంగంలోని ఒక్క ఉన్నత ఉద్యోగం కూడా స్థానికులతో భర్తీ కాలేదు. వీటన్నిటిని బయట వ్యక్తులతోనే నింపుతారని లడఖ్ స్టూడెంట్స్ ఎన్విరాన్మెంటల్ యాక్షన్ ఫోరం (LSEAF) ఆందోళన వెలిబుచ్చుతోంది.

2019కి ముందు కార్గిల్ ప్రాంతంలో ఉన్న ముస్లింలు కార్గిల్ని జమ్మూకాశ్మీర్లో విలీనం చేయాలని డిమాండ్ చేసేవారు. లే, లడఖ్ ప్రాంతాలలోని బౌద్ధులు తమను కాశ్మీరుల పాలన నుండి విముక్తులను చేసి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసేవారు. కానీ ఇప్పుడు ఇరువురు ఏకమై లే ఎపెక్స్ బాడీ (ABL), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (KDA)ల ఆధ్వర్యంలో ఐక్యంగా ఉద్యమిస్తున్నాయి. 2024 మార్చి 6వ తేదీ నుండి మైనస్ డిగ్రీల చలిలో ఆరు బయట కేవలం ఉప్పు నీళ్లు మాత్రమే తీసుకుంటూ 25 రోజులు నిరాహార దీక్ష నిర్వహించారు. కార్గిల్ డెమొక్రటిక్ ఫ్రంట్ కూడా ప్రత్యేకంగా మూడు రోజుల నిరాహార దీక్ష చేపట్టింది. వేలాదిమంది ప్రజలు ఈ ఉద్యమాల్లో పాల్గొంటున్నారు.

ఇది దేశంలో ఒక్క లడఖ్ ప్రజల సమస్య మాత్రమే కాదు. ఛత్తీస్గడ్లోని 1,70,000 హెక్టార్ల హసియో ఆనంద్ అడవులను బొగ్గు క్షేత్రాల కోసం నిర్మూలించబోతున్నారు. వజ్రాల గనుల తవ్వకం కోసం మధ్యప్రదేశ్లోని బక్స్వాహ అడవులను నరికి వేయడానికి ప్రయత్నిస్తున్నారు. పర్యావరణాన్ని, ప్రత్యేకించి- వృక్ష సంపదను నిర్మూలించే దిశగా లక్షదీవుల గవర్నర్ ప్రఫుల్ల కోడాపటేల్ అప్రజాస్వామిక విధానాలను చేపడుతున్నారు. ఇవన్నీ కార్పొరేట్ల దాహాన్ని తీర్చడానికి బిజెపి అనుసరిస్తున్న విధానాల్లో భాగమే. ఈ విధానాలకు అడ్డొచ్చిన ఉద్యమ శక్తులను నిర్దాక్షిణ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేస్తున్నాయి. అయినా ఆయా ప్రాంతాల్లో ప్రజలు తమ నిరసన గళాన్ని వినిపిస్తూనే ఉన్నారు. ప్రధానస్రవంతి మీడియా ఆ ఉద్యమ వార్తలను బయట సమాజానికి తెలియకుండా మింగేస్తోంది. ఇలాంటి వాతావరణంలో వివిధ ప్రాంతాల్లో ఉద్యమిస్తున్న ప్రజలు ఐక్యమై దేశ స్థాయిలో ఆందోళనలు చేపట్టినపడు మాత్రమే కేంద్ర ప్రభుత్వ కార్పోరేట్ అనుకూల విధానాలను ధీటుగా అడ్డుకోగలుగుతారు. ★


**మతోన్మాదం - సామ్రాజ్యవాదం - భారత పాలకులు**

(వ్యాస సంకలనం)

**పేజీలు : 80** **వెల : రు. 30/-**

కాపీలకు :

**మైత్రీబుక్హౌస్**

**జలీల్ వీధి, కారల్మార్క్స్ రోడ్,**

**విజయవాడ-2**

# భారత నేర విచారణా చట్ట సవరణ

**బ్రిటిష్** వలసవాద పాలకులు రూపొందించిన బ్రిటిష్-ఇండియా చట్టంలోని అనేక విభాగాలను జొప్పించి 1947 తదనంతరం భారత నేరస్మృతిని రూపొందించారు. గత కాలపు నేరపూరిత వలసవాద పాలకులపై ఆరోపణలు చేస్తూ, ఈ నూతన చట్టాన్ని ముందుకు తెచ్చారు. ప్రస్తుత పాలకుల పూర్వీకుడైన సావర్కార్, బ్రిటిష్ వలసవాద పాలనకు మద్దతుగా వుండి, 'సంఘపరివారపు' శక్తిని బలహీనపరచకుండా వుండేందుకు మాత్రమే వారితో పోరాటం చేశాడు; అరెస్ట్ అయిన సమయంలో బ్రిటిష్ పాలకులకు క్షమాపణలు చెప్పి, 'వారు తనను క్షమించి, జైలునుండి విడుదల జేస్తే' తన మిగిలిన జీవితకాలమంతా బ్రిటిష్ వలసవాదానికి సేవజేస్తానని చెప్పాడు. ఆయన వారసులే ఈనాడు అధికారంలోనున్నారు. వారి 'దేశభక్తి'గా పేర్కొన బడేదీ ఈనాటికి ప్రజ్వరిల్లి, మన చట్టాలపై వలసవాద ప్రభావం వుందని 'అర్థం చేసుకున్నారు'!

76 సంవత్సరాల స్వతంత్రం తర్వాత, భారత నేరచట్టంపై వలసవాద ప్రభావాన్ని తొలగించటం అవసరమని ప్రభుత్వం గుర్తించిన కారణంగా నూతన చట్టాన్ని ప్రవేశపెట్టినట్లు చెబుతున్నారు. ఇది ఇలా వుండగా, ప్రస్తుతం వునికిలోవున్న చట్టంలో ఏ లోపముందనే అంశాన్ని ప్రభుత్వం పేర్కొనటం లేదు. కేవలం భారత నేర చట్టాన్ని సంస్కరించటంతో భారత న్యాయవ్యవస్థపై వలసవాద ప్రభావాన్ని తప్పించగలమా? భారత ప్రభుత్వ చట్టాలనుండి, బాలల పరిరక్షణ చట్టం వరకు బ్రిటిష్ ప్రభుత్వం రూపొందించిన చట్టాలనే భారతదేశం ఈనాటికీ అనుసరిస్తోంది. పారిశ్రామిక వివాదాల చట్టం, భారత రైల్వేల చట్టం, భారత రక్షణ బలగాల చట్టం, భారత రక్షణ చట్టం, భారత టెలికాం చట్టం, హిందూవారసత్వ చట్టం... మొదలగు దేశంలోని వివిధ విభాగాల చట్టాలను బ్రిటిష్ ప్రభుత్వమే ముందుకు తెచ్చింది. వాటన్నింటినీ ఈనాటికీ భారతదేశ రాజ్యవ్యవస్థే అదుపు చేస్తోంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా నిస్సిగ్గుగా ఈ చట్టాలను అనుసరించటాన్ని కొనసాగిస్తూనే, గత వలసకాలంనాటి చట్టాల పేర్లను మారుస్తూ, మరిన్ని క్రూరమైన మార్పులు చేస్తూ వీటినే అనుసరిస్తోంది. ప్రభుత్వ మోసకారీతనాన్ని గుర్తించేందుకు, ఈ చట్టాన్ని లోతుల్లోకి వెళ్ళి విశ్లేషించటం అవసరం.

భారత న్యాయవ్యవస్థ అనుసరిస్తూ వస్తోన్న భారత శిక్షాస్మృతి(ఐపిసి), భారత సాక్ష్యాధార చట్టం, భారత నేరవిచారణా చట్టం(సిఆర్‌పిసి)... వీటన్నింటినీ రద్దుచేసి, నూతనంగా, 'భారతీయం'గా రూపొందించి, న్యాయవ్యవస్థలో పునఃస్థాపించారు. దాదాపు 140 కోట్ల దేశ ప్రజానీకపు రోజువారీ జీవనాన్ని ప్రభావితం చేసే ఈ చట్టాల్ని పూర్తి అప్రజాస్వామిక పద్ధతిలో ముందుకు తెచ్చారు! ఏ దేశ నేరన్యాయవ్యవస్థ అయినా, ఆ దేశ పౌరులకు అది గంభీర విషయమే. నేర న్యాయ చట్టంలో ఏ మార్పునైనా చేసేందుకు, ఎన్నికైన సభాప్రతినిధుల గంభీర చర్చకు, విశ్లేషణకు గురికావాలి.

93 మంది ప్రతిపక్ష ఎం.పీ.లను సభ నుండి తాత్కాలికంగా తొలగించిన(సస్పెండ్ చేసిన) సందర్భంలో ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, చట్టంగా ముందుకు తెచ్చారు. కనీసపాటి చర్చ కూడా లేకుండానే ప్రభుత్వం ఈ చట్టం చేసిందని దీనిద్వారా స్పష్టమే! 2024 ఫిబ్రవరి నుండి ఈ నూతన చట్టం అమలులోకి వచ్చింది. ప్రజాస్వామ్య వ్యతిరేక పద్ధతుల్లో ముందుకు తేబడిన ఈ చట్టం ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసుకునేందుకు, ఈ నూతనచట్టం అమలయ్యేంతదాకా మనం వేచి చూడాలి. ఈ చట్టంలోని అనేక విభాగాలు, ఈ చట్టాన్ని అమలుజేసే అధికారులు తమ సౌలభ్యానికనుగుణంగా వ్యాఖ్యానించేందుకు అవకాశమిస్తున్నాయి.

1860 నాటి భారత శిక్షాస్మృతి(ఐపిసి) స్థానంలో 'భారతీయ న్యాయసంహిత' (బిఎన్ఎస్)ను ముందుకు తెచ్చారు.

1872 నాటి భారతీయ సాక్ష్యాల చట్టం స్థానంలో భారతీయ సాక్ష్య చట్టం(బిఎస్)ను, 1973 నాటి నేరవిచారణచట్టం(బిఎన్ఎస్ఎస్)లను ముందుకు తెచ్చారు.

అన్ని దేశాలు తమతమ న్యాయవ్యవస్థలలో మార్పులు, సవరణలు చేసుకుంటూ వుంటాయి. రాజరిక నియంతృత్వంలో రాజు మాటే చట్టం! మత పరచట్టాలు మతపరమైనవే. ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థను కూలద్రోసి ఇస్లామ్ మతావలంబకులు అధికారంలోకి వచ్చినపుడు, ఆయా దేశాలలో ఇస్లామ్ చట్టాలనే అమలు చేశారు. కొన్ని దేశాలలో తిరుగుబాట్లు, లేదా విప్లవకర ప్రభుత్వ మార్పు జరిగినపుడు, నేర విచారణ చట్టాలలో మార్పులు చేయటం చాలా సహజం. పరిస్థితులు కల్పించే అవసరమే, ఎల్లవేళలా చట్టాన్ని సృష్టిస్తుంది. పాలక ప్రభుత్వ సైద్ధాంతిక లక్ష్యాలను నెరవేర్చుకోవటంలో, ఉనికిలో వున్న చట్టం ఆటంకంగా వుంటే, ఆ చట్టాన్ని తొలగించి, అవసరమైన కొత్త విభాగాలను జోడించటం జరిగి తీరుతుంది. ప్రస్తుత పాలక ప్రభుత్వ సిద్ధాంతం - హిందూమతతత్వం. ఇండియాను 'భారత్'గాను, 'భారత్'ను హిందూ రాజ్యాంగానూ మలచటంలో ప్రస్తుతం ఉనికిలోవున్న చట్టంలో వివిధ సెక్షన్లు అడ్డంకులు సృష్టిస్తున్నాయని పాలకపార్టీ అభిప్రాయపడితే, ఆ సెక్షన్లను తొలగించటం, అవసరమైన విభాగాలను జోడించటం సహజమే. అయితే, ప్రజలకు వాస్తవం చెప్పే ధైర్యం పాలకపార్టీకి లేదు. భారతదేశం భారత స్వాతంత్ర్యోద్యమం ద్వారా అభివృద్ధిచెందిన దృఢమైన ప్రజాస్వామ్య, లౌకికవాద పునాదిపై, దానిని రక్షించే ఒక రాజ్యాంగంపై ఆధారపడి వుంది.

న్యాయవ్యవస్థలోని వలసవాద లక్షణాలను రద్దుచేసి భారతీయీకరించటమన్నది వారి లక్ష్య సాధనకు తగిన నినాదంగా వుంది. లేకుంటే, ప్రస్తుత న్యాయవ్యవస్థలోని ఇబ్బందులు తప్పనిసరిగా ఎత్తిచూపవలసి వుంటుంది. అయితే, ప్రస్తుతం ఉనికిలోవున్న న్యాయవ్యవస్థలో లోటుపాట్లేమిటో ఎత్తిచూపటం జరగలేదు. ప్రస్తుతం వున్న చట్టాలకు కొన్ని చేర్పులను చేశారు; వాటిని మాత్రమే విస్తరించారు.

నూతన చేర్పులలో, నిరాహారదీక్షలు, ధర్నాలు కూడా నేరాలే. అలాగే, పోలీసులకు అమిత అధికారాలను ఇచ్చారు. మాటలోగానీ, రాతలోగానీ, వార్తలోగానీ లేదా చర్యలోగానీ రాజ్యానికి అంగీకారం కాని చర్య ఏదైనా నేరంగా పరిగణించబడుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే, ఇది అసమ్మతుల, నిరసనల, అభ్యంతరాల నోరు మూయిస్తుంది.

భారత నేరచట్టాలను సంస్కరించాల్సి వుందనే దాంట్లో సందేహమేమీలేదు. అనేక చట్టాలకు కాలం చెల్లింది. కాలపరిమితి దాటిపోయిన సమస్యను అనేక చట్టాలలో ఎత్తి చూపారు. ఉదాహరణకు-ఆహార పదార్థాలలో కల్తీ నిరోధకానికి ఒక ప్రత్యేక చట్టం వుంది. అలాగే కాలుష్య నివారణకు కూడా. అయితే, పాత నేరచట్టాలలోని అవే అంశాలను నూతన నేర చట్టంలో ఎత్తిరాయటమే జరిగింది.

**(తరువాయి 8వ పేజీలో)**

# ఎన్నికలకు మరో ఆయుధంగా సిఏఏ

**2019లో** పార్లమెంటు ఆమోదం పొందిన పౌరసత్వ సవరణ చట్టాన్ని (CAA) ఐదు సంవత్సరాలపాటు దాచిపెట్టి 2024 పార్లమెంటు ఎన్నికలకు కొద్ది రోజుల ముందు (మార్చి 11)న అకస్మాత్తుగా సవరించిన చట్టాన్ని అమలు జరపబోతున్నామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ఇందులో అనేక అవకతవకలు ఉండటంతో పాటు మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని కల్పించడం అనే అప్రజాస్వామిక లక్షణాన్ని భారతీయ జనతా పార్టీ పాలకులు నిస్సిగ్గుగా బయట పెట్టుకున్నారు. ఈ చట్టం ప్రకారం పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల నుండి (మాత్రమే) వేధింపులకు గురైన కారణంగా భారతదేశానికి వలస వచ్చిన హిందువులు, బౌద్ధులు, సిక్కులు, జైనులు, పార్సీలు, క్రిస్టియన్లు (మాత్రమే) కొన్ని షరతులతో భారత పౌరసత్వాన్ని పొందవచ్చు. కానీ ఆ మూడు దేశాల నుండి భారతదేశానికి వచ్చిన, లేక తిరిగి వచ్చిన ముస్లింలకు అలాంటి అవకాశాలు లేకుండటమే ఈ సవరణ చట్టం యొక్క విశేషం.

రాజ్యాంగంలోని షెడ్యూల్ VIలో ఉన్న ఈశాన్య రాష్ట్రాలకు ఇది యథాతథంగా వర్తించదు.

బ్రిటీష్ వలస పాలనలో ఉండిన విశాల భారతదేశంలో 1935 వరకు భాగంగా ఉండి, నేడు సరిహద్దు దేశాలుగా ఉంటున్న శ్రీలంక, బర్మా (మయన్మార్)ల నుండి వలస రూపంలో గాని, కాందిశీకులుగా గాని భారతదేశం వచ్చి నివసించే వారికి ఈ పౌరసత్వ సవరణ చట్టం వర్తించదు. పార్సి మతస్తులు ప్రధానంగా ఇరాన్ దేశ మూలవాసులై ఉంటారు. ఆ దేశం నుండి వలస వచ్చిన పార్శీలకు ఈ చట్టం వర్తించదు. కానీ, ఆఫ్ఘనిస్తాన్‌లో వేధింపులకు గురై భారతదేశం వచ్చేసిన పార్శీలకు ఈ సవరణ చట్టం వర్తిస్తుంది. శ్రీలంకలో సంభవించిన రాజకీయ కల్లోలాల నుండి తప్పించుకోవడానికి భారతదేశం పారిపోయి వచ్చిన హిందువులైనా, బౌద్ధులైనా వారికి భారతీయ పౌరసత్వం ఈ చట్టం ద్వారా లభించదు. ఇక వారిలో ముస్లింలు కూడా ఉంటే చెప్పే పనేముంది!

పాకిస్తాన్, బంగ్లాదేశాలతో తరతరాలుగా ఉంటున్న ఉమ్మడి సాంస్కృతిక సంబంధాల రీత్యా, అలాగే బ్రిటీష్ పాలకుల దుష్ట పథకంలో భాగంగా మత ప్రాతిపదికన జరిగిన దేశ విభజన తాలూకు భావోద్వేగాల కారణంగా, మతం పేరిట లభించే పౌరసత్వ సమస్యకు చాలా సున్నితమైన కోణాలు, అంశాలు అదనంగా ఉంటాయి. సున్నితమైన మత సమస్యను అతి సున్నితంగా పరిష్కరించవలసినది పోయి, మతోన్మాద పూరిత విద్వేషాలను పెంచే విభజన రాజకీయాల ద్వారా రాజకీయ ప్రయోజనాలను భాజపా పాలకులు పొందదల్చుకున్నారు. అసంబద్ధమూ, అప్రజాస్వామికమూ అయిన పౌరసత్వ సవరణ చట్టాన్ని ఐదేళ్ల తర్వాత ఎన్నికల సమయానికి ప్రవేశపెట్టి, కార్పొరేట్ శక్తుల ఆర్థిక ప్రయోజనాలకూ, తమ మతతత్వ రాజకీయాలకూ వినియోగ పెట్టదలుచుకున్నారు.

## దేశాన్ని కుదిపివేసిన పౌరసత్వ చట్టాల వ్యతిరేక ఉద్యమం!

1955లో ఒక పౌరసత్వ చట్టం ఉండేది. ఇతర దేశాలలో పుట్టి 11 సంవత్సరాల పాటు భారతదేశంలో జీవించిన వారికి కొన్ని మినహాయింపులతో పౌరసత్వం పొందే అర్హత ఒకప్పుడు లభించేది. దానికి 2016లో కొన్ని సవరణలు చేశారు. 2019 డిసెంబర్‌లో మరొక కొత్త సవరణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టాన్ని పైన పేర్కొన్న కొన్ని ఇస్లామిక్ దేశాల నుండి వచ్చేసిన వారికే పరిమితం చేసి, పౌరసత్వపు అర్హతకు మతాల ప్రాతిపదికను (ప్రత్యేకంగా ముస్లింలను మినహాయించి) నిర్ణయించారు. ఇటీవల కాలంలో ఒక సంవత్సరం పాటుగా నివసిస్తూ, గతంలో ఐదు సంవత్సరాలు భారతదేశంలో ఉంటే చాలుననే నిబంధన ఒకటి మార్చారు.

దానిపై ఆనాడు తీవ్రమైన నిరసన వచ్చింది. ఆరంభంలో అది విద్యార్థుల ఉద్యమంగా ఉండినా చాలా వేగంగా అది ఒక ప్రజా ఉద్యమ స్వభావాన్ని సంతరించుకుంది. అది షహీన్ బాగ్ ఉద్యమంగా పేరుపొందింది. సాధారణంగా బహిరంగ ప్రదేశాలలో సంచరించడానికి సంకోచించే ముస్లిం మహిళలు, బాలికల నుండి వృద్ధుల దాకా చాలా ఉధృతంగా ఐదేళ్ల నాడు దేశవ్యాపిత ఉద్యమాన్ని నడిపారు. దానికి ముస్లిమేతర సమాజం నుండి మత సామరస్యాన్ని కోరుకునేవారు, భారత రాజ్యాంగంలోని కుల మతాలకు అతీతంగా ప్రజలందరి సౌభ్రాతృత్వాన్ని కోరుకున్నవారు, ఇంకా ఇతర ప్రజాతంత్ర వాదులు పై ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రారంభమైన షహీన్ బాగ్ ఉద్యమం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు విస్తరించి, 1905లో బెంగాల్ రాష్ట్రాన్ని మతం ప్రాతిపదికన విడగొట్టిన బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా నడిచిన వందేమాతరం ఉద్యమాన్ని తలపించే విధంగా సాగింది.

తెలుగు రాష్ట్రాలలో కూడా దాదాపు ప్రతి పట్టణంలో ఉద్యమ శిబిరాలు వెలిసి, అపూర్వమైన సంఘీభావాన్ని పొందగలిగింది. ఆ సందర్భంగా భాజపా పాలకుల క్రూర నిర్బంధం కూడా బ్రిటీష్ పాలకులను మించి పోయింది. ముఖ్యంగా ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంపై, ఆలీగర్ ముస్లిం యూనివర్సిటీ విద్యార్థులపై, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యమకారులపై తీవ్ర నిర్బంధం అమలు జరిగింది. అనేకమంది కాల్పులలో మరణించారు. వేలాదిమంది జైళ్ళ పాలయ్యారు.

ఉద్యమకారులపై ఊపా లాంటి క్రూర నిర్బంధ చట్టాలను ప్రయోగించారు. అయినప్పటికీ ఉద్యమాన్ని అణచ లేకపోయారు. ఈ సందర్భంగా భాజపా అనుచర బృందాలు ముస్లిం వ్యతిరేక మతోన్మాదతత్వాన్ని విపరీతంగా పెంచడానికి ప్రయత్నం చేశాయి. సుమారు 100 రోజులపాటు ఉధృతంగా సాగిన షహీన్ బాగ్ ఉద్యమం కోవిడ్ మహమ్మారి వ్యాపించిన ఫలితంగా నిలిచిపోయింది. ఈ పరిస్థితులలో ఆనాటి పౌరసత్వ సవరణ చట్టాన్ని మోడీ ప్రభుత్వం అమలులోకి తేలేకపోయింది. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ఈ చట్టంపై వచ్చే నిరసనను ముస్లిం ద్వేష మతోన్మాదం పెంచే విధంగా రెచ్చగొట్టి, తద్వారా ఎన్నికలలో ప్రజల ఎజెండాను తప్పించి, మత ఉద్వేగాల చుట్టూ ప్రచారాన్ని నిర్వహించి, ఓట్లు సీట్లు గడించడానికి వేసిన పచ్చి అభివృద్ధి నిరోధక దుష్ట పథకమిది. తిరిగి దానిని 2024 మార్చ్ నెలలో అకస్మాత్తుగా ప్రవేశపెట్టారు. ఈ పౌరసత్వ సవరణ చట్టం చెల్లదని ప్రకటించ వలసిందిగా సుప్రీంకోర్టుకు వెళ్లిన అనేక అభ్యర్థనల ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తాఖీదు ఇచ్చి ఏప్రిల్ 9వ తేదీ నాటికి కేసును వాయిదా వేసింది.

## సిఏఏను విమర్శిస్తూ...

మతం ప్రాతిపదికన పౌరసత్వాన్ని ఇవ్వటం భారత రాజ్యాంగ చట్టాన్ని ఉల్లంఘించటమేనని దేశంలోని అనేకమంది మేధావులు తీవ్రంగా విమర్శించారు. ప్రపంచ మానవహక్కుల సంస్థలు,

ఐక్యరాజ్యసమితి కూడా దీన్ని ఆమోదించ లేకపోతుందని ఇంటర్నేషనల్ యామ్నెస్టీ ప్రతినిధి ఆకార్ పటేల్ వ్యాఖ్యానించారు.

ముంబై హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న, సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైవి చంద్రచూడ్ కుమారుడైన అభినవ్ చంద్రచూడ్, ఈ సవరణ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా, వైరుధ్యాల మయంగా, అహేతుకంగా ఉందని బహిరంగంగా విమర్శించారు. ఇతర దేశాలలో వేధింపులకు గురవటమే ప్రాతిపదిక అయినట్లయితే, పాకిస్తాన్లో అహమ్మదీయాలు, ఆఫ్ఘనిస్తాన్ లోని హజారా షియాలు, బర్మా దేశంలోని రోహింగ్యాలు (వీరంతా ముస్లిము తెగలకు చెందినవారు) కూడా భారత దేశంలో పౌరసత్వం పొందడానికి అర్హత కలవారై ఉండేవారు. కానీ భాజపా పాలకుల దురుద్దేశాలు వేరు కదా!

2002లో గుజరాత్ ఘోర దురంతాల తర్వాత, నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీకి అమెరికా వీసాను నిరాకరించిన అమెరికా దేశపు ప్రపంచవ్యాపిత మత స్వేచ్ఛల కమిషన్ (USCIRF) దాదాపు స్వయం నిర్ణయాధికారం (Atonomous) గలది. మత స్వేచ్ఛలకు సంబంధించి అమెరికా ప్రభుత్వ విధానాలను కూడా విమర్శించగల అధికారాలు దానికి ఉన్నాయి. అలాంటి యు.ఎస్. సి. ఐ ఆర్ ఎఫ్. భారత ప్రభుత్వపు పౌరసత్వ సవరణ చట్టాన్ని తీవ్రంగా విమర్శించింది. మత వివక్షతతో ప్రత్యేకంగా ముస్లింలకు భారత ప్రభుత్వం పౌరసత్వాన్ని నిరాకరించటాన్ని తీవ్రంగా విమర్శిస్తూ 25 మార్చి నాడు ఒక ప్రకటన విడుదల చేసింది. ఎలాంటి సందర్భంలోనైనా భారత పాలకులతో చర్చించే సమయంలో ముస్లింలపట్ల వివక్షను ప్రదర్శిస్తున్న అంశాన్ని తప్పనిసరిగా ప్రస్తావించవలసిందిగా అమెరికా ప్రభుత్వానికి అది సలహా కూడా ఇచ్చింది.

## హిందువుల పౌరసత్వం పట్ల కూడా తగిన శ్రద్ధ లేని భాజపా పాలకులు!

బంగ్లాదేశ్ నుంచి దశాబ్దాల క్రితం పశ్చిమ బెంగాల్లోకి వచ్చి నివసిస్తున్న 'మతువ' అనే హిందూ తెగల వారు పౌరసత్వాన్ని పొందడానికి కఠిన నిబంధనలు ఎలా అడ్డు వస్తున్నాయో 31 మార్చ్ ఆదివారం నాటి 'ది హిందూ' దిన పత్రిక ప్రధాన శీర్షిక వార్తను ఇచ్చింది. బంగ్లాదేశీ హిందూ ప్రవాసితురాలు, ప్రస్తుత భారత పార్లమెంటు రాజ్యసభ సభ్యురాలు అయిన మమతా బాల ఠాకూర్, నేటి పౌరసత్వ సవరణ చట్టం లోని కఠిన నిబంధనల గురించి తీవ్రంగా విమర్శించారు.

1971 నాటి కల్లోల కాలంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన లక్షలాదిమంది హిందూ తెగలవారు భారతదేశంలోకి కట్టుబట్టలతో వలస వచ్చి, ఇక్కడ నివాసయోగ్యమైన పత్రాలు అనేకం పొందినప్పటికీ, బంగ్లాదేశ్ పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వాలు ఇచ్చిన తొమ్మిది రకాల గుర్తింపు పత్రాలలో ఏదో ఒకటి జోడించమని అడుగుతున్నారు.

"ఒకసారి పరిశీలన కమిటీ ప్రవాసితుల దరఖాస్తును తిరస్కరిస్తే ఇక నిర్బంధ కేంద్రాలే గతి" అని మమతా బాల ఠాకూర్ సిఏఏ నిబంధనల పట్ల ఆందోళన వెలిబుచ్చారు. ఇవి ప్రవాసితులను బానిసలుగా మారుస్తాయని, అందుకే భాజపాకు చెందిన కేంద్ర మంత్రి సంతాను ఠాకూర్తో సహా ఎవరము దరఖాస్తులే చేయలేదని చెప్పారు. పాకిస్తాన్ నుండి భారత దేశానికి వలస వచ్చిన హిందువుల పౌరసత్వ సమస్యలపై పనిచేసే విక్రమసింగు రాజ పురోహిత్ అనే రాజస్థాన్కు చెందిన న్యాయవాది కూడా ఈ అంశంలో అనేక చిక్కులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు.

## ముగింపు:

వలస కాలము కంటే దేశ సంపదలను తీవ్రంగా కొల్లగొట్టే నేటి కాలపు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు సంఘటిత ప్రజా నిరసన పెల్లుబకకుండా వేసిన రాజకీయ పథకంలో భాగంగా మతోన్మాద ఎత్తుగడలు అమలు జరుగుతున్నాయి.

ఈ కర్తవ్యాన్ని నెరవేర్చటంలో, దళారీ శక్తులకు ఊతం అందించడంలో భాజపాది దేశభక్తి ముసుగులో కొనసాగుతున్న విద్రోహ పాత్ర. దుష్ట పథకాలను ప్రజలు అర్థం చేసుకున్నకొద్దీ రోజుకొక విధమైన సరికొత్త జిత్తులకు పాల్పడుతున్నారు. అందులో భాగంగా మతం ప్రాతిపదికన పౌరసత్వాన్ని అందించే విధానానికి తెరలేపిన భాజపా పాలకులకు అనేక కారణాల వల్ల వలస వచ్చిన సాధారణ ప్రజల నిత్య జీవన ఈతి బాధల పట్ల ఇసుమంత సానుభూతి కూడా లేదు. సామాజిక కల్లోలాలు సృష్టించి, వాటిని మతోన్మాద రాజకీయాలుగా పెంపొందించి, మత విభజన గండిని సాధ్యమైనంత పెద్దది చేసి, ఎన్నికల యుద్ధానికి సామాన్యులను బలి పశువులుగా మార్చడం వారి రాజకీయ విధానం.

సాధారణ హిందువులతో సహా దేశ ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక జీవన సమస్యలకు పరిష్కారం సూచించకుండా, వాటిని పక్కదారి పట్టిస్తూ, ఉన్మాద ప్రచారాలతో ఊదరగొట్టడం వారి పద్ధతి. దోపిడీ వ్యవస్థ సృష్టిస్తున్న సమస్యల వైపుకు ప్రజల ఆలోచనలను మరలనివ్వకుండా చేసి, కళ్ళుగప్పి, ఆత్మవంచనా పూరిత భ్రమలకు గురిచేయడం, తద్వారా ఓట్లను సీట్లను గడించడం వారి రాజకీయ ఎత్తుగడ.

ప్రపంచంలో యుద్ధం అనేది లేకుండా పోయి శాంతి ఏర్పడితే, అమెరికా ఆర్థిక వ్యవస్థ ఎలా కుప్పకూలి పోతుందో, దేశ ప్రజల నడుమ మతసామరస్యం ఏర్పడితే భాజపా ప్రభుత్వం కూడా అలాగే కూలిపోతుంది. గాలి బుడగ లాంటి ఈ పరవంచన రాజకీయాలకు ప్రజలు తప్పక అడ్డుకట్ట వేస్తారు. ✸

---

**(6వ పేజీ తరువాయి)**


దీని ఫలితంగా ఒకే నేరానికి రెండు విధాలైన శిక్షలు వుండటానికి అవకాశముంది. బ్యాంకులను, ప్రభుత్వాన్ని మోసగించి భారతదేశం నుండి విదేశాలకు వెళ్ళిన వారిని భారత న్యాయవ్యవస్థ వెనక్కు తీసుకురాలేదు. వారి గైర్హాజరిలోనూ కేసులను చేపట్టి విచారించే ప్రయత్నం చేయవచ్చు. కానీ, నూతన చట్టంలో అలాంటి దానికి అవకాశమే లేదు.

ఇంతేగాక, భారత దేశంలోని నేర చట్టం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్య ఏమంటే, న్యాయస్థానాలలో నిలిచిపోతున్న కేసులు! 2020 సం॥లో విడుదలయిన న్యాయశాఖ సమాచారం ప్రకారం, 44.84 మిలియన్ల(4 కోట్ల 48 లక్షల 40 వేల) కేసులు భారత న్యాయస్థానాల్లో పెండింగ్లో వున్నాయి. వీటిలో అధికంగా అంటే 75 శాతం కేసులు క్రిమినల్ కేసులే. ఎంతమంది అమాయకులు ఈ కారణంగా జైళ్ళలోనే చంపబడుతున్నారో!? నూతన చట్టం, దీనికి ఎలాంటి పరిష్కారాన్నీ ప్రతిపాదించలేదు. 2022 నాటి నేర నమోదు బ్యూరో అంచనా ప్రకారం, 5,73,220 మంది భారత జైళ్ళలో మగ్గుతున్నారు. 1,33,415 మంది శిక్షలు విధించబడి జైళ్ళలో వున్నారు. దీని అర్థం 75 శాతం పైగా జైళ్ళలోని వారంతా విచారణ ఖైదీలే. ఖైదీలు తప్పుచేసి వుంటే, వారిని శిక్షించవచ్చు. అయితే, విచారణ ఖైదీలుగా సంవత్సరాల తరబడి వారిని జైళ్ళలో నిర్బంధించటం ప్రజాస్వామ్య వ్యతిరేకం, మానవహక్కుల ఉల్లంఘన కూడా. నేర చట్ట సంస్కరణ నుండి ఏమైతే వారు ఆశించారో. దానిని వారు పొందలేరు. క్లుప్తంలో, చట్ట సంస్కరణ, పాలక పార్టీ సిద్ధాంతాచరణకు మాత్రమే ప్రయోజనం చేకూరుస్తుంది.

(2024 మార్చి 'క్లాస్ స్ట్రగుల్' నుండి అనువాదం) ✸

కామ్రేడ్ లెనిన్ శతవర్ధంతి సందర్భంగా...

# లెనినిజం చిరస్థాయి అగుగాక!



**("లెనినిజం చిరస్థాయి అగుగాక" అనేది, కామ్రేడ్ లెనిన్ 90వ జయంతి సందర్భంగా, నాటి ప్రపంచ కమ్యునిస్ట్ ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళ నేపథ్యంలో 'పెకింగ్ రివ్యూ' సంపాదక వర్గం1960లో ప్రచురించిన పత్రం.**

**ఒకవైపున లెనినిజం యొక్క విశిష్టతను పొగుడుతూ, దాని విప్లవ చేవని పల్చన చేసి, వర్గ పోరాట పంథాను దిగజార్చి, కార్మికవర్గ చైతన్యాన్ని పక్కదారి పట్టించే అవకాశవాద రివిజనిస్టు అవగాహనలను ఎత్తిచూపే పత్రం "పెకింగ్ రివ్యూ" పత్రికలో (1960 ఏప్రిల్ 26న) వెలువడింది. దీని రూపకర్తలు చైనా కమ్యూనిస్టు పార్టీ పత్రిక 'రెడ్ ఫ్లాగ్' సంపాదకవర్గం. ఇది 1960లోనే, అంటే 63 సంవత్సరాల క్రితమే, తెలుగు భాషలోకి అనువాదమై కమ్యూనిస్టు శ్రేణులలో మౌలికమైన సైద్ధాంతిక ఆలోచనలను రేకెత్తించింది.**

**కామ్రేడ్ లెనిన్ శతవర్ధంతి (21 జనవరి 2024) సందర్భంగా 6 భాగాలుగా ఉన్న ఈ చారిత్రక పత్రాన్ని, కమ్యూనిస్టు ఉద్యమ శ్రేణులు అర్థం చేసుకుని నేటి పరిస్థితులకు అన్వయించుకుంటారని ఆశిస్తూ 'లెనినిజం చిరస్థాయి అగుగాక!' పత్రంలోని నాల్గవ భాగాన్ని ఇపుడు అందిస్తున్నాం. చివరి రెండుభాగాలు వచ్చే సంచికలో ప్రచురితమౌతాయి. – సంపాదకులు)**

## 4

**విదేశ** వ్యవహారాల్లో సోషలిస్టు దేశాలు అవలంబించే శాంతి విధానాన్నీ, పెట్టుబడిదారీ దేశాల్లో శ్రామికవర్గమవలంబించే ఆంతరంగిక విధానాల్నీ ఆధునిక రివిజనిస్టులు గందరగోళ పరుస్తూ ఉంటారు. విభిన్న సామాజిక వ్యవస్థలకు చెందిన దేశాలమధ్య శాంతియుత సహజీవన మంటే అర్థం... పెట్టుబడిదారీ విధానం శాంతి యుతంగా సోషలిజంలోకి మారేందుకవకాశ ముందనీ, బూర్జువావర్గం అధికారంలో ఉన్న దేశాల్లో శ్రామికులు వర్గ పోరాటాన్ని పరిత్యజించి బూర్జువా వర్గంతోను, సామ్రాజ్యవాదంతోను "శాంతియుతంగా సహకరించ" గల్గుతారనీ, శ్రామికవర్గం తదితర పీడితవర్గాలు తాము వర్గసమాజంలో జీవిస్తున్నామనే వాస్తవాన్ని మరచిపోవాలనీ – యీ విధంగా అర్థాలు చెబుతున్నారు. ఈ అభిప్రాయాలు మార్క్సిజం లెనినిజానికి పూర్తిగా భిన్నమైనట్టివి. సామ్రాజ్యవాదుల పెత్తనాన్ని కాపాడేందుకు, శ్రామికవర్గాన్నీ, యితర కష్టజీవుల్నీ శాశ్వతంగా పెట్టుబడిదారీ సంకెళ్ళలో బంధించి యుంచేందుకు మాత్రమే వారీ అభిప్రాయాలను వ్యక్తంచేస్తున్నారు.

వివిధ దేశాల మధ్య ఉండే శాంతియుత సహజీవనం వేరు; వివిధ దేశాల్లో సాగే ప్రజావిప్లవాలు వేరు. ఈ రెండూ ఒకటికాదు; భిన్నమైన రెండుభావాలు, ఒకే విధమైన సమస్య కాదిది; రెండు విధాలైన సమస్య.

శాంతియుత సహజీవనం వివిధ దేశాల మధ్య సంబంధాలను తెలియజేస్తుంది. విప్లవమంటే, ఒక దేశంలో పీడింపబడే ప్రజలు పీడించే ఒక వర్గాన్ని కూలద్రోయడం: వలస, అర్థవలస దేశాల్లో అది విదేశీ దోపిడీదార్లను అనగా సామ్రాజ్యవాదులను కూలద్రోసే సమస్య. అక్టోబరు విప్లవానికి పూర్వం సోషలిస్టు, పెట్టుబడిదారీ దేశాల మధ్య శాంతియుత సహజీవన సమస్య ఉత్పన్నం కాలేదు. కారణ మేమంటే, అప్పటికింకా సోషలిస్టు రాజ్యా లేర్పడలేదు. అయితే అప్పటికి శ్రామిక విప్లవానికి సంబంధించిన, జాతీయ విప్లవానికి సంబంధించిన సమస్యలున్నాయి. కారణమేమంటే, అనేక దేశాల ప్రజలు చాలకాలం క్రిందటే తమ పరిస్థితుల కనుగుణ్యంగా, తమ భవిష్యత్తును తాము నిర్మించుకొనేందుకు ఏదో ఒక తరహాకు చెందిన విప్లవాన్ని అభిమానిస్తూ వచ్చారు.

మనం మార్క్సిస్టు – లెనినిస్టులం. ఏ దేశంలో జరిగే విప్లవం ఆదేశం యొక్క సొంత విషయమని మన మెల్లప్పుడూ నమ్ముతాం. కార్మికవర్గం తన శక్తిమీదనే పూర్తిగా ఆధారపడి విముక్తిని సాధించుకోవాలనీ, ప్రతి దేశంలోని ప్రజలు తమ చైతన్యంమీద, తమ దేశంలోని విప్లవ పరిస్థితుల పరిపక్వతమీద ఆధారపడి తమ విముక్తిని సాధించుకోవాలనీ మనం మొదటినుంచీ అభిప్రాయపడుతున్నాం. విప్లవ మనేది ఎగుమతి చేయబడే లేదా దిగుమతి చేయబడే సరకు కాదు. ఎవరూ కూడ ఇంకొక దేశంలో జరిగే ప్రజా విప్లవాన్ని ఆపలేరు: అలాగే "ధాన్యపు మొక్కలను పీకివేయడంద్వారా వాటి పెంపుదలను (ప్రోత్సహించడ"మెలా సాధ్యం కాదో, అలాగే యింకొక దేశంలో విప్లవాన్ని తీసుకురావడం ఎవరికీ సాధ్యంకాదు.

1918 జూన్ మాసంలో లెనిన్ యిలా తెలియజేశారు :

"ఉత్తరువుల ద్వారా, ఒప్పందం ద్వారా ఇంకొక దేశంలో విప్లవాన్ని తీసుకురావచ్చునని అభిప్రాయపడేవారు కొందరున్నారు. వారు పిచ్చివారైనా అయివుండాలి, కవ్వించి రెచ్చగొట్టే శత్రు ఏజంట్లయినా అయియుండాలి. గత 12 సంవత్సరాల్లో మనం రెండు విప్లవాలను చూచాం. విప్లవాలను ఉత్తరువులద్వారాగాని, ఒప్పందాల ద్వారాగాని తీసుకురాలేమని మనకు తెలుసు. లక్షలాది ప్రజలు పాత పద్ధతుల్లో యిక జీవించడం సాధ్యంకాదని ఒక నిర్ధారణకు వచ్చినప్పుడే విప్లవాలు జరుగుతాయి." ("మాస్కో ట్రేడ్ యూనియన్ల ఫ్యాక్టరీ కమిటిల నాల్గవ సమావేశం". సెలక్టెడ్ వర్క్స్ – ఇంటర్నేషనల్ పబ్లిషర్స్. న్యూయార్క్, 7వ సంపుటి, 414వ పేజీ).

రష్యా విప్లవ అనుభవమేకాక, చైనా విప్లవ అనుభవంకూడ యిందుకు తార్కాణం. చైనా ప్రజలు, చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన అనేక విప్లవాలు జరిపారు. అవన్నీ విదేశాల ఉత్తర్వులవల్ల, ఒప్పందాలవల్ల జరిగాయని సామ్రాజ్యవాదులు, అభివృద్ధి నిరోధకులు పిచ్చెత్తినవాళ్ళ మాదిరిగా కేకలు వేశారు. కానీ, మన విప్లవాలు విదేశాల నుంచి దిగుమతి కాలేదని, మన ప్రజలు పాతచైనా సమాజంలో జీవించడం ఇక అసాధ్యమని తెలుసుకోవడం వల్లనే, తాము కోరిన నూతన జీవితాన్ని నిర్మించు కోవాలన్న సంకల్పం వారిలో కలగడంవల్లనే విప్లవాలు వచ్చాయనీ ప్రపంచంలోని ప్రజలందరికీ తెలుసు.

ఒక సోషలిస్టు దేశంమీద సామ్రాజ్యవాదులు దురాక్రమణకు పూనుకొన్నప్పుడు ఆత్మరక్షణకై ఆ దేశం యుద్ధానికి దిగవలసి వస్తుంది. ఒక్కొక్కప్పుడు విదేశాల్లోని శత్రువును రూపు మాపడానికి తన సరిహద్దుల్ని కూడా దాటవలసి వస్తుంది. హిట్లరుకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో సోవియట్ యూనియన్ యిలాగే చేసింది. అది న్యాయసమ్మతమేనా ? తప్పకుండా

న్యాయసమ్మతమే: అలా చేయటం చాలా అవసరం, అనివార్యమూను. కమ్యూనిస్టులు ఈ విషయంలో కొన్ని ఖచ్చితమైన సూత్రాలకు బద్ధులై యుంటారు. సామ్రాజ్యవాదులు దురాక్రమణ యుద్ధానికి దిగినప్పుడే సోషలిస్టు దేశాలిట్టి చర్యలకు పూనుకోవాలి. విదేశీ శత్రువు దురాక్రమణకు దిగనిపక్షంలో, సోషలిస్టు దేశాలు సరిహద్దుల ఆవలకు తమ సేనల్ని పంపవు; పంపడాని కనుమతించవు. సోషలిస్టు దేశాల సేనలు న్యాయం కొరకే పోరాడుతాయి. అందుచేత అవి విదేశీ శత్రువుపై ఎదురుదాడి చేయడానికి తమ సరిహద్దులను దాటి ఎక్కడికి వెళ్తే అక్కడ, ప్రజలమీద కొంత ప్రభావం సహజంగా పడుతుంది. అయినప్పటికీ, అట్టి ప్రాంతాల్లోను, దేశాల్లోను ప్రజావిప్లవాల ప్రాదుర్భావం, సోషలిజం స్థాపన అక్కడి ప్రజల నిశ్చయంమీదే ఆధారపడియుంటుంది.

విప్లవభావాల వ్యాప్తికి జాతుల సరిహద్దులు అడ్డంరావు. అయితే, ఆ భావాలు విప్లవకర ఫలితాలకు దారితీసేదీ, తీయనిదీ ఆ దేశ పరిస్థితుల పైన, ప్రజల కార్యాచరణమీద ఆధారపడియుంటుంది. ఈ విధంగా శ్రామిక విప్లవదశలోనే కాక, బూర్జువా విప్లవదశలో కూడా జరుగుతుంది. వివిధ దేశాల్లో బూర్జువా విప్లవాలు జరిగినప్పుడు ఆ వర్గం, రూసో వ్రాసిన "సోషల్ కాంట్రాక్టు"ను పవిత్ర గ్రంథంగా స్వీకరించింది. అదే విధంగా, అనేక దేశాల్లో విప్లవశ్రామికవర్గం మార్క్స్ వ్రాసిన "కమ్యూనిస్టు ప్రణాళిక," "పెట్టుబడి" అను గ్రంథాలనూ, లెనిన్ వ్రాసిన "సామ్రాజ్యవాదం – పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ," "రాజ్యాంగ యంత్రం: విప్లవం" అను గ్రంథాలనూ పవిత్ర గ్రంథాలుగా పరిగణించారు. కాలం మారుతూ ఉంటుంది; వర్గాలు కూడ మారుతూ ఉంటాయి; భావవృత్తులు, విప్లవాల స్వభావం కూడ మారుతూ ఉంటాయి. అయితే, ఒక దేశంలోని ప్రజల్లో విప్లవ వాంఛ కలిగినట్లయితే, విప్లవ సంక్షోభం ఆ దేశంలో పరిపక్వమయితే, ఆ దేశంలో విప్లవం జరక్కుండా ఎవరూ ఆపలేరు. చివరకు పెట్టుబడిదారీ విధానం స్థానే సోషలిస్టు విధానం ఆవిర్భవిస్తుంది. ఇది మనుష్యుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేని ఒక భౌతిక నియమం. చరిత్ర గతిని నిరోధించేందుకు అభివృద్ధి నిరోధకులెన్ని ప్రయత్నాలు చేసినా, విప్లవం యీ వేళ కాకపోతే రేపైనా జరిగి తీరుతుంది; దాని విజయాన్నెవరూ అడ్డుకోలేరు. ఈ నియమం ప్రకారమే చరిత్రలో ఒక సమాజంస్థానే మరొక సమాజం ఆవిర్భవిస్తుంది. బానిస వ్యవస్థపోయి ఫ్యూడల్ వ్యవస్థ వచ్చింది; దాని స్థానంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పెంపొందింది. ఈ మార్పులు కూడ మనుష్యుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా జరిగినవే. ఈ మార్పులన్నీ విప్లవాలద్వారా జరిగాయి.

బెర్న్ స్టీన్ అను పేరుగాంచిన రివిజనిస్టు ఒకసారి యిలా చెప్పాడు : "ప్రాచీన రోమును మరవకండి. అక్కడి పాలకవర్గం చిన్నమెత్తు పని చేయకుండా భోగభాగ్యాలతో విలాసజీవితం గడిపేది. అందువల్ల ఆ వర్గం బలహీనపడింది. అట్టి వర్గాలు తమ అధికారాన్ని క్రమంగా వదులుకోవలసి వస్తుంది." బానిస యజమానులు బలహీనమయ్యారనేది చారిత్రక సత్యం. అమెరికన్ సామ్రాజ్యవాదులు క్రమంగా తాము బలహీనపడుతున్నామనే విషయాన్నెలా కప్పి పెట్టుకోలేకపోతున్నారో, అలాగే పై సత్యాన్ని కప్పిపెట్టుకోవడం బెర్న్ స్టీన్‌కు సాధ్యంకాలేదు. అయినప్పటికీ, సిగ్గులేని ఆ స్వయంనియమిత "చారిత్రక వేత్త", రోమ్ చరిత్రకు సంబంధించిన కొన్ని మౌలిక సత్యాలను మరుగుపరచడానికి ప్రయత్నించాడు. ఉదా : బానిస యజమానులు తమంతట తాము "అధికారాన్ని వదులుకో" లేదు; పదేపదే నిర్విరామంగా దీర్ఘకాలం జరిగిన బానిసల – విప్లవాలు ఆ ప్రభుత్వాలను కూల ద్రోశాయి.

విప్లవమంటే అర్థం, పీడితవర్గం ప్రయోగించే బలప్రయోగం; విప్లవ సమరమని దానికి అర్థం. ఇది బానిస విప్లవానికీ వర్తిస్తుంది; బూర్జువా విప్లవానికీ వర్తిస్తుంది. లెనిన్ యిలా తెలియజేశారు :

"పీడింపబడే ఏ వర్గమూ నియంతృత్వదశ గడపకుండా అధికారాన్ని స్వాధీనం చేసుకోలేదని, చేసుకోజాలదని చరిత్ర రుజువుచేసింది. అంటే, పీడించే వర్గాలెల్లప్పుడూ చేసే అతి తీవ్రమైన, ఉన్మత్తతతోకూడిన ప్రతిఘటనను బలప్రయోగం ద్వారా అణచివేయనిదే అధికారాన్ని స్వాధీనం చేసుకోజాలదన్న మాట... అభివృద్ధిచెందిన దేశాల్లో బూర్జువావర్గం అనేక తిరుగుబాట్ల ద్వారా, అంతర్యుద్ధాలద్వారా, రాజుల్నీ, ఫ్యూడల్ ప్రభువుల్నీ, బానిస యజమానుల్నీ అణచివేసి అధికారంలోకి" వచ్చింది.

("అంతర్జాతీయ కమ్యూనిస్టు సమాఖ్య ప్రథమ మహాసభకు 'బూర్జువా ప్రజాస్వామ్యం –శ్రామిక నియంతృత్వం' అను సమస్యపై సమర్పింపబడిన థీసిసు;" రివిజనిజంపై లెనిన్ పోరాటం' అను గ్రంథం – మాస్కో ప్రచురణ : 1959: 488 వ పేజీ).

## ఇలా ఎందుకు జరుగుతుంది ?

మొదటి విషయంగా లెనిన్, "ప్రపంచంలో ఏ పాలకవర్గమూ పోరాటం జరపకుండా లొంగిపోయిన ఉదంతంలేదు" అని వ్రాశారు. ("ప్రెస్నియా జిల్లా కార్మికుల సమావేశంలో యిచ్చిన ఉపన్యాసం" : కలెక్టెడ్ వర్క్స్ – 4 వ రష్యన్ కూర్పు. 28 వ సంపుటి. 338 వ పేజీ).

రెండవ విషయమేమంటే : "సాధారణంగా అభివృద్ధి నిరోధక వర్గాలే మొట్టమొదట బల ప్రయోగానికి, అంతర్యుద్ధానికి పూనుకుంటాయి; తుపాకి కార్యక్రమాన్ని మొదట వారే ప్రారంభిస్తారు." ("ప్రజాస్వామ్య విప్లవంలో సోషల్ డెమాక్రట్ల రెండు ఎత్తుగడలు") సెలక్టెడ్ వర్క్స్: మాస్కో ప్రచురణ–మొదటి సంపుటి. 2వ భాగం, 142 వ పేజీ),

ఈ దృష్ట్యా మనం శ్రామిక సోషలిస్టు విప్లవాన్నెలా అర్థం చేసుకోవాలి?

లెనిన్ వ్రాసిన యీ క్రింది వాక్యాలు చదువుదాం:

"ప్రపంచంలో ఏ పెద్ద విప్లవమూ అంతర్యుద్ధం లేకుండా జరగలేదు; అంతర్యుద్ధం లేకుండా పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజానికి పరివర్తన సాధ్యమని వివేకంగల ఏ మార్క్సిస్టూ భావించదు" ("జోస్యం" : కలెక్టెడ్ వర్క్స్ 4వ రష్యన్ కూర్పు: 27వ సంపుటి, 457వ పేజీ.)

పై వాక్యాలు యీ సమస్యను స్పష్టం చేస్తున్నాయి.

లెనిన్ ఇంకా యిలా అన్నారు:

"సోషలిజం శాంతియుతంగా సిద్ధించి యుంటే పెట్టుబడిదారీ పెద్దమనుష్యులు ఇందు కంగీకరించలేదనుకోండి – యుద్ధ మనేది జరక్కపోయినా పెట్టుబడిదారీ పెద్దనుష్యులు అట్టి శాంతియుత పరివర్తనను నిరోధించ డానికెన్ని చేయాలో అన్నీ చేసియుండేవారు. ఫ్రెంచి విప్లవం వంటి మహావిప్లవాలు శాంతియుతంగా ప్రారంభమైనప్పటికీ చాలా తీవ్రమైన యుద్ధాల్లో సమాప్తమయ్యాయి. ఆ యుద్ధాలను తీసుకొచ్చింది విప్లవద్రోహులైన అభివృద్ధినిరోధక బూర్జువా వర్గం" ("సామాజిక విద్య అను సమస్యపై జరిగిన మొదటి అఖిల రష్యామహాసభ" కలెక్టెడ్ వర్క్స్: 4వ రష్యన్ కూర్పు; 29వ సంపుటి, 334వ పేజీ.)

లెనిన్ సూత్రీకరణలు సరియైనవనడానికి అక్టోబరు విప్లవమే తార్కాణం.

చైనా విప్లవం మరొక తార్కాణం. చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం క్రింద 22 సంవత్సరాలు చైనా ప్రజలు, కార్మికవర్గం చాలా తీవ్రమైన అంతర్యుద్ధం జరిపిన తర్వాతనే దేశవ్యాపితంగా విజయం సాధించి అధికారాన్ని స్వాధీనం చేసుకోగలిగారు.

మొదటి ప్రపంచయుద్ధం తర్వాత పశ్చిమ రాజ్యాల్లో జరిగిన శ్రామిక విప్లవం మనకు

బోధించే విషయమేమంటే: పెట్టుబడిదారీ పెద్ద మనుష్యులు – ప్రత్యక్షంగా, బాహాటంగా అధికారం చెలాయించకుండా తమ తాబేదార్ల ద్వారా పరిపాలన సాగిస్తున్నప్పటికీ – యీ సోషలిస్టు ద్రోహులు, యీ తుచ్ఛులు ఏ సమయంలోనైనా సరే బూర్జువావర్గం యొక్క ఆదేశాల ప్రకారం, ఆ వర్గం అవలంబించే హింసాకాండను కప్పి పుచ్చేటందుకు, "శ్రామికవర్గ విప్లవాన్ని రక్తపాతంలో ముంచేందుకు సిద్ధపడతారు. జర్మనీలో సరిగ్గా యిలాగే జరిగింది. ఓడింపబడ్డ జర్మన్ బడా బూర్జువావర్గం, మితవాద సోషలిస్టులకు అధికారాన్ని అప్పజెప్పింది. వారు అధికారంలోకి వచ్చినవెంటనే 1919 జనవరిలో జర్మన్ కార్మికవర్గాన్ని క్రూరమైన హింసాకాండ ద్వారా అణచివేయడం ప్రారంభించింది. ఆనాటి సోషలిస్టు ప్రభుత్వం యొక్క రక్తపిపాసకు కారల్ లీబ్ నెక్, రోజా లగ్జెంబర్గ్ అను కార్మిక వీరులు బలిఅయ్యారు. వారిని లెనిన్ "ప్రపంచ శ్రామికవర్గపు అత్యుత్తమ ప్రపంచ ప్రతినిధులు" అనీ, "ప్రపంచ సోషలిస్టు విప్లవానికి అమర నాయకుల"నీ కొనియాడారు. "ఈ హత్యలు తుచ్ఛమైనవీ, సిగ్గుమాలినవీను." అని వర్ణించారు ("యూరపు, అమెరికాల కార్మికులకు లేఖ: 1954 మాస్కో ప్రచురణ: 16వ పేజీ)

"సోషలిస్టులు" అని పిలువబడిన యీ ద్రోహులు పెట్టుబడిదారీ వ్యవస్థను, పెట్టుబడిదారీవర్గ ప్రయోజనాలను కాపాడ్డానికే యీ దారుణానికి ఒడి గట్టారు. చరిత్రకు సంబంధించిన వాస్తవ విషయాలను, ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలో జరిగే పరిణామాలను దృష్టిలో ఉంచుకొని "పెట్టుబడిదారీవిధానం, శాంతియుతంగా సోషలిజంలోకి మారుతుంద"నే పాత రివిజనిస్టుల ధోరణినీ, వారి అడుగుజాడల్లో నడిచే ఆధునిక రివిజనిస్టుల ధోరణినీ పరిశీలిద్దాం.

అయితే, మార్క్సిస్టు–లెనినిస్టులమైన మనం శాంతియుత పరివర్తనకు అవకాశాలు వున్నప్పుడు కూడ అట్టి విధాన మవలంబించడానికి నిరాకరిస్తామా?

ఎన్నటికీ అలా నిరాకరించం, శాస్త్రీయ కమ్యూనిజం స్థాపకుల్లో ఒకరైన ఎంగెల్స్ "సొంత ఆస్తి విధానాన్ని శాంతియుత పద్ధతులద్వారా నిర్మూలించవచ్చునా?" అను ప్రశ్నకు "కమ్యూనిస్టు మూలసూత్రాలు" అను గ్రంథంలో యిలా జవాబిచ్చారు :

"అలా జరిగితే బాగుండుననడంలో ఎట్టి సందేహం లేదు. అందుకు కమ్యూనిస్టు లెన్నటికీ అభ్యంతరపెట్టరు. సకల కుట్రలు విఫలమయ్యేవే కాక, విషతుల్యమైనవని కూడానని కమ్యూనిస్టు లెరుగుదురు. విప్లవాలనేవి ఎవరో కొందరు ముందుగా ఆలోచించి తీసుకొచ్చేవి కావనీ, కొన్ని నిర్దిష్టమైన పరిస్థితుల్లోనే అవి అనివార్యంగా వస్తాయనీ, వాటికి కారణం కొన్ని పార్టీల లేదా వర్గాల కోరిక లేదా నాయకత్వం కాదనీ వారికి తెలుసు. అదే సమయంలో, యించు మించు అన్ని నాగరిక దేశాల్లో శ్రామికవర్గం అభివృద్ధి కాకుండా అణచివేయబడుతోందనీ, యీ విధంగా కమ్యూనిస్టులకు శత్రువులైనవారే విప్లవంకొరకు చాల తీవ్రంగా కృషిచేస్తున్నారనీ వారు గ్రహిస్తారు...." ("కమ్యూనిస్టు మూల సూత్రాలు" : మార్క్స్ – ఎంగెల్స్‌ల కలెక్టడ్ వర్క్స్ – రెండవ రష్యన్ కూర్పు : 4వ సంపుటి, 331వ పేజీ).

ఈ వాక్యాలు 100 సంవత్సరాల క్రిందట వ్రాయబడ్డాయి. అయినా యిప్పుడు వ్రాసినట్లున్నాయి :

రష్యాలో ఫిబ్రవరి విప్లవం తర్వాత ఏర్పడ్డ ప్రత్యేక పరిస్థితుల్లో లెనిన్ కొంతకాలంవరకు విప్లవాన్ని శాంతియుతంగా అభివృద్ధిచేసే విధానం అవలంబించారని మనకు తెలుసు. దాన్ని ఆయన "విప్లవాల చరిత్రలో అపురూపమైన, అసాధారణమైన అవకాశం" గా పరిగణించారు. ("కలెక్టడ్ వర్క్స్": 4వ రష్యన్ కూర్పు; 28వ సంపుటి, 45వ పేజీ). ఆ అవకాశాన్నాయన జారిపోకుండా గట్టిగా పట్టుకున్నారు. కానీ బూర్జువా తాత్కాలిక ప్రభుత్వం, బూర్జువా సేనలు ఆ అవకాశాన్ని నాశనం చేశాయి. పెట్రోగ్రాడ్ నగరంలో శాంతియుతంగా ఊరేగింపు జరుపుతున్న కార్మికుల్నీ, సైనికుల్ని కాల్చిచంపారు; పెట్రోగ్రాడ్ వీధుల్లో రక్తపుటేర్లు ప్రవహించాయి. లెనిన్ యిలా అన్నారు :

"శాంతియుత పరివర్తన అసాధ్య మయ్యేటట్లు చేయబడింది. తద్భిన్నమైన, బాధాకరమైన మార్గం ప్రారంభమైంది." ("నినాదాలను గురించి" సెలక్టెడ్ వర్క్స్ – రెండవ సంపుటి, మొదటిభాగం– 89వ పేజీ).

జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా జరిగిన చైనా ప్రతిఘటన యుద్ధం సమాప్తమైనప్పుడు దేశంలో విస్తృతమైన, తీవ్రమైన శాంతి వాంఛ ద్యోతకమైంది. అప్పుడు మన పార్టీ కొమింటాంగ్‌తో శాంతి సంభాషణలు ప్రారంభించింది. శాంతియుత పద్ధతులద్వారా సాంఘిక, రాజకీయ సంస్కరణలను ప్రవేశ పెట్టాలని కోరింది. 1946లో దేశవ్యాపితంగా శాంతిని స్థాపించేందుకు కొమింటాంగ్‌తో ఒక ఒడంబడిక కూడా జరిగింది. కానీ కొమింటాంగ్ అభివృద్ధినిరోధక ముఠా ప్రజల కోర్కెను కాలదన్ని, ఒడంబడికను ధిక్కరించి, అమెరికన్ సామ్రాజ్యవాదుల అండతో దేశవ్యాపితంగా అంతర్యుద్ధాన్ని రెచ్చగొట్టారు. దాన్ని విప్లవ సమరం ద్వారా ప్రతిఘటించడం తప్ప మరో మార్గం ప్రజలకు లేకపోయింది. మన మెల్లప్పుడూ అప్రమత్తతతో మెలగడంవల్ల, సంస్కరణలకై శాంతియుతంగా కృషి చేస్తున్నప్పుడు కూడ ప్రజావిముక్తి దళాలను యథాప్రకారంగా కొనసాగించినందునల్ల ప్రజలా యుద్ధంలో లొంగలేదు. దాన్ని ప్రారంభించిన వారే పరాభవం పొందారు.

శ్రామికవర్గం శాంతియుత పద్ధతుల ద్వారా అధికారంలోకి రాగలిగి సోషలిజాన్ని స్థాపించగలిగితే, ప్రజలకు చాల మేలు జరిగేమాట వాస్తవమే. అట్టి అవకాశమేర్పడి నప్పుడు దాన్ని ఉపయోగించుకోకపోవడం పొరబాటు. "విప్లవం శాంతియుతంగా అభివృద్ధి చెందడానికి" అవకాశ మేర్పడినప్పుడల్లా కమ్యూనిస్టులు దాన్ని గట్టిగా పట్టుకొని, సోషలిస్టు విప్లవం యొక్క లక్ష్యాన్ని సాధించాలి. అయితే, లెనిన్ చెప్పినట్లు యీ విధమైన అవకాశం "విప్లవాల చరిత్రలో అపురూపమైన, అసాధారణమైన" విషయం. ఒక దేశంలో రాజకీయాధికారం విప్లవశక్తులచే చుట్టుముట్ట బడినప్పుడు లేదా ప్రపంచంలో ఒక పెట్టుబడిదారీ దేశం, సోషలిస్టు దేశాలచే చుట్టుముట్టబడినప్పుడు, విప్లవం శాంతి యుతంగా అభివృద్ధిచెందడానికి ఎక్కువ అవకాశాలేర్పడతాయి. అప్పుడు కూడా, విప్లవం శాంతియుతంగా మాత్రమే అభివృద్ధిచెందే అవకాశం ఉంటుందనుకోవడం పొరబాటు; రెండోవిధమైన అవకాశానికి కూడా సిద్ధపడాలి. ఉదాహరణకు చైనా భూభాగం విముక్తి చేయబడిన తర్వాత బానిస యజమానుల, ఫ్యూధల్ ప్రభువుల పరిపాలన క్రిందనున్న కొన్ని ప్రాంతాలు సంపూర్ణ ప్రాబల్యంగల విప్లవ శక్తులచే చుట్టుముట్టబడినప్పటికీ, "మూలకు నెట్టబడిన జంతువు సైతం పోరాడుతుంది' అనే చైనా సామెత ప్రకారం, కొద్దిమంది అత్యంత అభివృద్ధినిరోధకులైన బానిస యజమానులు, ఫ్యూడల్ ప్రభువులు చిట్టచివరి తాపు తన్నకుండా ఊరుకోలేదు. శాంతియుతంగా సంస్కరణలను ప్రవేశపెట్టే మార్గాన్ని వారు తిరస్కరించి, సాయుధ తిరుగుబాట్లను ప్రారంభించారు. ఆ తిరుగుబాట్లను అణచివేసిన తర్వాతనే, సామాజిక వ్యవస్థలో సంస్కరణలను ప్రవేశ పెట్టడం సాధ్యమైంది.

సామ్రాజ్యవాదులు, వారి ప్రభుత్వాలు తమ నరభక్షణ వ్యవస్థను కాపాడుకొనేందుకు కనీవినీ యెరుగనంత స్థాయిలో మారణాయుధాలను తయారుచేస్తున్నప్పుడు, సామ్రాజ్యవాదులు తమ దేశంలోని ప్రజల యెడల, విదేశాల్లోని పీడిత జాతుల యెడల ఆధునిక రివిజనిస్టులు చెబుతున్నట్లు "శాంతియుతంగా" మెలగుతున్నారని చెప్పగలమా? ఫిబ్రవరి విప్లవం తర్వాత లెనిన్ పేర్కొన్న "అపురూపమైన, అసాధారణమైన అవకాశం" ప్రపంచ శ్రామికులకు, పీడిత ప్రజలందరికీ లభించిందని భావించగలమా? ఈ అభిప్రాయాలు పూర్తిగా ఆధారరహితమైనవి.

మార్క్సిస్టు - లెనినిస్టులు ఒక విషయాన్ని మరచిపోకూడదు. అది ఏమంటే : పాలకవర్గాల క్రిందనున్న సాయుధసేనలు ప్రధానంగా తమ దేశంలోని ప్రజల్ని అణచియుంచేందుకు ఉపయోగింపబడతాయి. తమ దేశంలోని ప్రజల్ని అణచియుంచే ప్రాతిపదికపైనే సామ్రాజ్య వాదులు యితర దేశాల్ని దోచుకోగల్గుతారు: దురాక్రమణకు పూనుకోగల్గుతారు; అధర్మ యుద్ధాలను తీసుకురాగల్గుతారు. తమ ప్రజల్ని పీడించేందుకు వారు అభివృద్ధినిరోధక సాయుధ బలాలను పెంచిపోషిస్తూ పటిష్టంచేసుకొంటూ ఉంటారు. 1905లో రష్యాలో విప్లవం జరుగుతూన్నప్పుడు లెనిన్ యిలా వ్రాశారు :

"స్థాయి సైన్యం బయటి శత్రువుమీద కన్నా ఆంతరంగిక శత్రువుమీదనే ఎక్కువగా ఉపయోగింపబడుతుంది." (కలెక్టెడ్ వర్క్స్; 4వ రష్యన్ కూర్పు: 10వ సంపుటి. 38వ పేజీ).

ఈ నిర్ధారణ దోపిడీవర్గాలు పెత్తనం చేసే దేశాలన్నిటికీ, పెట్టుబడిదారీ దేశాలన్నిటికీ వర్తిస్తుందా? ఆ రోజుల్లో యిది వాస్తవమనీ, యిప్పుడది వర్తించదనీ చెప్పగలమా? ఇది తిరుగులేని వాస్తమని మా అభిప్రాయం. ఈ విషయాన్ని వాస్తవ ఘటనలు రోజురోజుకు రుజువు చేస్తున్నాయి. నిజం చెప్పాలంటే, ఏ దేశంలోనైనా శ్రామికవర్గం యీ వాస్తవాన్ని గుర్తించకపోతే, తన విముక్తికి మార్గం తెలుసుకోలేకుండా పోతుంది.

లెనిన్ "రాజ్యాంగయంత్రం : విప్లవం" అను గ్రంథంలో, విప్లవం యొక్క కీలక సమస్య బూర్జువా రాజ్యాంగ యంత్రాన్ని కూలద్రోయ దమని తెలియజేశారు. "ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం" అను మార్క్స్ గ్రంథంనుంచి అత్యంత ప్రధానమైన భాగాలను పేర్కొంటూ, ఆయనిలా వ్రాశారు :

"1848-49 విప్లవం తర్వాత రాజ్యాంగ యంత్రం కార్మికులకు వ్యతిరేకంగా పెట్టుబడిదారులు సాగించే 'జాతీయ యుద్ధ ఇంజను'గా తయారైంది." (లెనిన్ సెలెక్టెడ్ వర్క్స్ : మాస్కో ప్రచురణ 1942, రెండవ సంపుటి, మొదటిభాగం, 240వ పేజీ).

బూర్జువా రాజ్యాంగయంత్రం కార్మికవర్గం మీద సాగించే యుద్ధంలో స్థాయి సైన్యం, ప్రధాన సాధనం. కనుకనే "పారిస్ కమ్యూన్ జారీచేసిన మొట్టమొదటి ఉత్తరువు, స్థాయి సైన్యాన్ని రద్దుచేసి, దాని స్థానంలో ప్రజా సైన్యాన్ని స్థాపించడం గురించి." (అదే గ్రంథం; రెండవ సంపుటి మొదటిభాగం; 241వ పేజీ).

కాబట్టి, అంత్య పరిశీలనలో, యీ సమస్యను పారిస్ కమ్యూన్ మూలసూత్రాల కనుగుణంగా వీక్షించవలసియుంటుంది. అవి శాశ్వతమైనవీ, నశింపులేనివేనని మార్క్స్ తెలియజేశారు.

అయితే, 1870 ప్రాంతంలో మార్క్స్-బ్రిటన్, అమెరికాలను మినహాయింపులుగా పేర్కొన్నారు. ఈ రెండు దేశాలకు సంబంధించి నంతవరకు "శాంతియుతంగా" సోషలిజం స్థాపింపబడే అవకాశమున్నదని ఆయన తెలియజేశారు. కారణమేమంటే, యీ రెండు దేశాల్లో సైనిక వ్యవస్థ, అధికారవర్గ దొరతనం ప్రాథమిక దశలో ఉన్నాయన్నారు. కానీ సామ్రాజ్యవాద శకంలో, లెనిన్ చెప్పినట్లు "మార్క్స్ పేర్కొన్న మినహాయింపు వర్తించదు." కారణమేమంటే యీ రెండు దేశాలు "యీ రోజున అధికారవర్గ దొరతనం, సైనికవ్యవస్థ అనే నీచమయిన, రక్తప్లావితమైన ఊబిలో కూరుకుపోయియున్నాయి; అవి ప్రతి దాన్నీ తమ కాలిక్రింద నలిపి పారవేస్తాయి." ("రాజ్యాంగ యంత్రం : విప్లవం" : సెలెక్టెడ్ వర్క్స్, మాస్కో ప్రచురణ - 1952, రెండవ సంపుటి, మొదటిభాగం, 237వ పేజీ). ఆనాడు లెనిన్ అవకాశవాదులతో జరిపిన చర్చలో యిదొక కీలక సమస్య, "ఈనాడిది వర్తించదు" అన్న మార్క్స్ నిర్ధారణను కాట్స్కీ మొదలైన అవకాశవాదులు వక్రంగా చిత్రించి, శ్రామిక విప్లవాన్నీ, శ్రామిక నియంతృత్వాన్నీ వ్యతిరేకించడానికి ప్రయత్నించారు. అంటే, శ్రామికవర్గ విముక్తికి అత్యంతావసరమైన సాయుధ విప్లవదళాల్ని, సాయుధ విప్లవాన్నీ వ్యతిరేకించ యత్నించారన్నమాట. లెనిన్ కాట్స్కీకి యిలా సమాధానమిచ్చారు:

"శ్రామికవర్గం యొక్క విప్లవ నియంతృత్వం బూర్జువా వర్గంమీద జరిపే బలప్రయోగమే. మార్క్స్, ఎంగెల్స్ పదేపదే వివరంగా తెలియజేసినట్లు సైనిక వ్యవస్థ, అధికారివర్గ దొరతనం ఉన్నప్పుడే అట్టి బలప్రయోగం యొక్క ఆవశ్యకత ప్రత్యేకంగా ఏర్పడుతుంది. ఈ వ్యవస్థలు 1870 ప్రాంతంలో ఇంగ్లండ్‌లోను, అమెరికాలోను లేవు. కానీ యీ రోజున అవి ఇంగ్లండ్‌లోను అమెరికాలోను ఖచ్చితంగా ఉన్నాయి." ("శ్రామిక విప్లవం, ద్రోహికాట్స్కీ, "ఇంటర్నేషనల్" పబ్లిషర్సు: 7వ సంపుటి, 125వ పేజీ),

కాబట్టి శ్రామికవర్గం సాయుధ విప్లవానికి పూనుకోక తప్పనిసరి స్థితి ఏర్పడుతుంది. మార్క్సిస్టు లెల్లప్పుడూ శాంతియుత పద్ధతుల ద్వారానే సోషలిజాన్ని స్థాపించగోరుతారు. శాంతియుత పద్ధతులకు అవకాశం ఉన్నప్పుడు వాటిని మార్క్సిస్టు - లెనినిస్టులెన్నటికీ విడిచి పెట్టరు. అయితే బూర్జువా వర్గం బలీయమైన సైనిక వ్యవస్థను, అధికారివర్గ దొరతనాన్ని కలిగియున్నప్పుడు యీ పద్ధతిని భగ్నం చేయడానికే ప్రయత్నిస్తూ ఉంటుంది.

లెనిన్ పై వాక్యాలను 1918లో వ్రాశారు. ఈ రోజున పరిస్థితులెలా ఉన్నాయి? లెనిన్ మాటలు చారిత్రకంగా యిప్పటికీ వర్తిస్తాయా? లేక ఆధునిక రివిజనిస్టులు చెబుతున్నట్లు, ప్రస్తుత పరిస్థితుల్లో అవి పనికి రావా? ఇంచుమించు అన్ని పెట్టుబడిదారీ దేశాలు, ముఖ్యంగా అమెరికా నాయకత్వాన ఉన్న సామ్రాజ్యవాద దేశాలు తమ సైనిక వ్యవస్థల్నీ, అధికారివర్గ దొరతనాల్నీ - ముఖ్యంగా సైనికయంత్రాన్ని - పటిష్ఠం చేసుకోడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి.

1967 నవంబరులో సోషలిస్టు దేశాలకు చెందిన కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల ప్రతినిధులు తమ సంయుక్త ప్రకటనలో యిలా తెలియజేశారు:

"పాలకవర్గాలెన్నటికీ తమంత తాము అధికారాన్ని వదులుకోవని లెనినిజం బోధిస్తుంది; అనుభవం కూడ దీన్నే రుజువు చేస్తుంది. ఈ సందర్భంలో వర్గ పోరాటం యొక్క తీవ్రత, దాని రూపాలు శ్రామికవర్గంమీద అంతగా ఆధారపడి యుండవు. ప్రజల్లో అత్యధిక సంఖ్యాకుల అభిప్రాయానికి వ్యతిరేకంగా అభివృద్ధి నిరోధక వర్గాలు చేసే ప్రతిఘటనమీద, సోషలిజంకొరకు జరిగే పోరాటంలో ఏదో ఒక దశలో బలప్రయోగం మీద ఆధారపడియుంటాయి."

లెనిన్ చనిపోయిన తర్వాత గడచిన కొద్ది దశాబ్దాల్లో ప్రపంచ శ్రామికవర్గం అనేక పోరాటాల ద్వారా సంపాదించిన అనుభవం యిదే.

శ్రామికవర్గానికి శాంతియుత పరివర్తన అంటే యిష్టమా, అయిష్టమా అనేది సమస్య కాదు; అట్టి మార్గాన్ని బూర్జువావర్గం అంగీకరిస్తుందా, అంగీకరించదా అనేది సమస్య. లెనిన్ అనుచరులు ఈ సమస్యను పరిశీలించడంలో అనుసరించవలసిన మార్గ మిదొక్కటే.

**(తరువాయి 17వ పేజీలో)**

సంస్మరించుకుందాం

# కామ్రేడ్ మధుకు అరుణారుణ జోహార్లు



**సిపిఐ (ఎం-ఎల్)** కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు, 'క్లాస్ స్ట్రగుల్ 'పత్రిక సంపాదకులు కామ్రేడ్ మధు 2021 ఏప్రిల్ 16న మరణించారు. మూడవ వర్ధంతి సందర్భంగా ఆ కామ్రేడ్‌కు విప్లవ జోహార్లు అర్పిస్తూ సంస్మరించుకుందాం.

మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనా విధాన పతాకాన్ని దృఢంగా ఎత్తి పట్టిన కామ్రేడ్ మధు, మితవాద, అతివాద, అరాచకవాద ధోరణులకు తొణకకుండా, పార్టీ మౌలిక అవగాహన దృక్పథానికి అనుగుణంగా సంఘర్షణ సాగించారు. ఆంతరంగికంగా ఉద్యమ క్రమంలో తలెత్తిన అనేక ఒడిదుడుకులలో, అనివార్యమైన బాహ్య, ఆంతరంగిక సిద్ధాంత, రాజకీయ సంఘర్షణలో కామ్రేడ్ మధు దృఢంగా నిలిచారు. అవకాశవాద రాజకీయాలను రాజీలేకుండా వ్యతిరేకించారు.

కామ్రేడ్ మధు నిత్య అధ్యయనశీలి. సిద్ధాంత గ్రంథాలను, పార్టీ కార్యక్రమాన్ని కార్యకర్తలకు వివరించడంలో తనదంటూ ప్రత్యేకమైన శైలితో ఆకర్షించేవారు. మన రాష్ట్రంలో జరిగిన కార్యకర్తల రాజకీయ అధ్యయన తరగతుల్లో, కామ్రేడ్ మధు ముఖ్యమైన భూమికను పోషించారు.

కామ్రేడ్ మధు అత్యవసర పరిస్థితి కాలంలో పార్టీ ఆంతరంగిక పత్రిక 'జ్వాల' బాధ్యతలు నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీష్ భాషలలో పార్టీ పత్రికల ప్రచురణలో, ముఖ్యంగా 'జనశక్తి' నిర్వహణలో కామ్రేడ్ మధు ముఖ్యమైన పాత్ర పోషించారు. కామ్రేడ్ జస్వంత్ అమరులైన తర్వాత పార్టీ కేంద్ర పత్రిక 'క్లాస్ స్ట్రగుల్' సంపాదకత్వ బాధ్యతలు చేపట్టారు. రాజకీయ నివేదికలను రూపొందించడంలో, సిద్ధాంత సమస్యల పైన పార్టీ సమీక్షల తయారీలో కామ్రేడ్ మధు ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. దేశీయ, అంతర్జాతీయ పరిస్థితులను విశ్లేషించడంలోనూ, వాటి పట్ల అవగాహన అందించడంలోనూ కామ్రేడ్ మధు సాగించిన రాజకీయ సిద్ధాంత కృషి ప్రత్యేకించి పేర్కొనదగింది.

తెలుగు సాహిత్య ఉద్యమంలో పరిణామాలను నిశితంగా పరిశీలించిన కామ్రేడ్ మధు, నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమ అవగాహన - సాంస్కృతికోద్యమ దృక్పథాన్ని సూత్రీకరించి అందించారు.

తిరుగులేని నిబద్ధత, నిమగ్నతలతో దాదాపు ఆరున్నర దశాబ్దాల సుదీర్ఘకాలం విప్లవానికి, విప్లవ రాజకీయాలకు ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. విప్లవకారులుగా విడివడిన నాటి నుండి విప్లవోద్యమంలోని ప్రతి మలుపులో కామ్రేడ్ మధు ఒక ప్రముఖమైన పాత్ర నిర్వహించారు. ఆయన తన జీవితకాలమంతా విప్లవ బాధ్యతలను, కర్తవ్యాలను చేపట్టి నిర్వహిస్తూ వచ్చారు. కామ్రేడ్ మధు త్యాగగుణం, నిష్టతో సాగించిన తీవ్ర కృషి ఎంతో స్ఫూర్తిదాయకం. నేటితరం కార్యకర్తలకు ఆదర్శప్రాయం.

ఈ కృషిని ముందుకు కొనసాగించడమే మన ముందున్న కర్తవ్యం. కామ్రేడ్ మధుకు జోహార్లు. ✸

# కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డికి జోహార్లు



**1920లో** కర్నూలు జిల్లా వెలుగోడు గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి జన్మించారు. చిన్నవయస్సులో, వ్యవసాయదారునిగా వున్నప్పుడే రైతాంగ పోరాటాలతోను, జాతీయోద్యమంతోను ప్రభావితులయ్యారు. 1936 నాటికి రైతు వృత్తిని వదిలి రైతుసంఘ కార్యకర్త జీవితాన్ని ఎంచుకున్నారు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట కాలంలో ఆ పోరాట విస్తరణ కోసం నల్లమల ఫారెస్టులో 3 సం॥ల పాటు గెరిల్లా దళానికి బాధ్యత వహించారు. యావదాస్తిని తృణప్రాయంగా అమ్మివేసి ఉద్యమ నాయకత్వానికి అప్పగించారు. హంతక రాజకీయాలున్న కర్నూలు జిల్లాలో రైతు ఉద్యమ నిర్మాణానికి మూడు దశాబ్దాలపాటు కృషిచేశారు. ఆ కాలంలో ఉద్యమ నిర్మాణ కృషి సాగించారు. భూముల సాధనకోసం, జలవనరుల సాధనకోసం ఆందోళనోద్యమాలు నిర్మించారు. రాయలసీమ కరువుకు వ్యతిరేకంగానూ, రాయలసీమ అభివృద్ధి కొరకు సాగిన సమైక్య ఆందోళనలో ఆయన పాల్గొన్న తీరు ఇతర రాజకీయ శ్రేణులకు కూడా స్ఫూర్తి నిచ్చింది. దళిత, గిరిజనోద్యమాలకు ఆయన కొండంత అండగా నిలిచారు. విజయనగరం, ఉభయగోదావరిజిల్లా గిరిజనుల మనస్సుల్లో శాశ్వత స్థానాన్ని పొందారు. కామ్రేడ్ ఎమ్మెస్ తుదిశ్వాస విడిచేవరకు, పీడిత ప్రజల విముక్తి కొరకు : ప్రత్యేకంగా రైతుకూలీల విముక్తి కొరకు అహర్నిశలు శ్రమించిన ఆందోళనకారుడు. రైతాంగ విప్లవయోధుడూ, మార్క్సిస్టు-లెనినిస్టూ.

1969 నుంచి కుట్రకేసులు ఎదుర్కొన్నారు. ఆయన 6 సం॥ల జైలు జీవితం, 14 సం॥ల అజ్ఞాత జీవితం గడిపారు. కోర్టులలో కేసులను ఆయన స్వయంగా వాదించుకున్న తీరూ, 1971లో నందికొట్కూరు కోర్టులో "నరహంతక జలగం వెంగళరావును ఉరితీయాల"ని ఆయన చేసిన ప్రకటనా ఎమ్మెస్ వర్గ పోరాటతత్వానికి, వర్గ శత్రువుపట్ల కరకుదనానికి నిదర్శనం.

1986లో రైతుకూలీ పేదల సంఘం సంస్థాపక కార్యదర్శిగా, 1991లో రైతుకూలీ సంఘంగా ఐక్యమైన నాటి నుండి చనిపోయేవరకు రాష్ట్ర అధ్యక్షులుగా సంస్థకు నేతృత్వం వహించారు. 2001 ఏప్రిల్ 24న 10 రోజులపాటు మృత్యువుతో పోరాడి కా॥ ఎం.ఎస్. అమరులయ్యారు.

కా॥ ఎమ్మెస్ మరణం పీడిత ప్రజా వుద్యమాలకు, ప్రత్యేకించి రైతాంగ ఉద్యమానికి తీరనిలోటు. అయినా విప్లవ విజయం పట్ల కార్మిక-కర్షక రాజ్యస్థాపనపట్ల కామ్రేడ్ ఎమ్మెస్ ఎంత అచంచల విశ్వాసంతో కృషిచేశారో అంతే విశ్వాసంతో కన్నీరు వత్తుకుంటూనే విప్లవ విజయం కోసం మొక్కవోని దీక్షతో ముందుకు సాగుదామని ప్రతినబూనుదాం. ✸

# ఉచితాలు, ప్రజాకర్షక పథకాల పేరుతో వంచనకు పాల్పడుతున్న పాలక పార్టీలు

**ఎన్నికలు** సమీపిస్తున్న తరుణంలో అధికార, విపక్ష పాలక పార్టీలన్నీ రానున్న ఐదు సంవత్సరాల కాలంలో ప్రజలకు తాము అందించబోయే సంక్షేమ పథకాలు, రాయితీలు, ఉచితాలు, సబ్సిడీల గురించి ఒకదానిని మించి మరొకటి పోటీలు పడి మరీ హోరెత్తిస్తున్నాయి. కేంద్రంలో, రాష్ట్రాలలో పాలక పార్టీలన్నీ ఈ పథకాలన్నింటితో కూడిన తమ తమ ఎన్నికల ప్రణాళికలను అట్టహాసంగా విడుదల చేస్తున్నాయి. తమకు అధికార పీఠం కట్టబెడితే రానున్న ఐదేళ్లలో ప్రజల జీవితాలను బంగారుమయం చేస్తామని పూదరగొడుతున్నాయి.

వాస్తవానికి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికల సందర్భంగా ప్రతిసారీ జరిగే తంతే ఇది. పాలక పార్టీలు అమలు చేస్తున్న ఈ సంక్షేమ, అభివృద్ధి విధానాలతో ప్రజల వాస్తవ జీవన ప్రమాణాలు ఎంతవరకు మెరుగయ్యాయనే ప్రశ్నకు జవాబు ఇవ్వటానికి ఎవ్వరూ సిద్ధంగా లేరు. ఈ విధంగా సంక్షేమ పథకాలను ఎన్ని దశాబ్దాల కాలం అమలు చేసినా, ప్రజల వాస్తవ జీవనస్థితి గతులలో పురోగతి ఉండదనే విషయం పాలక పార్టీలన్నింటికీ స్పష్టత ఉన్నా, ఎవరూ దాని గురించి పెదవి విప్పరు. ప్రజలను ఈ పథకాల మాయాజాలంలో శాశ్వతంగా బంధించి, తమ దోపిడీ యజమానుల ప్రయోజనాలను నిరాటంకంగా నడుపుకెళ్లడమే వారందరికీ కావలసింది!

1960లలో ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక మాంద్యం, దేశ ప్రజలలో వెల్లువెత్తిన అసంతృప్తి, దేశవ్యాప్తంగా ప్రత్యేకించి నక్సల్‌బరి, శ్రీకాకుళం తదితర ప్రాంతాలలో పెల్లుబికిన ఉద్యమాల నేపథ్యంలో - పాలకులు, భూ సంస్కరణలు, పేదరిక నిర్మూలన వంటి కార్యక్రమాలతో ముందుకు వచ్చారు. 'పంచ పాండవులు అంటే మంచం కోళ్లలాగా ముచ్చటగా ఇద్దరు అని చెప్పి, ఒక వేలు చూపించబోయి, సున్నా చుట్టిన చందంగా...' భూ సంస్కరణలు, మిగులు భూముల పంపిణీ కార్యక్రమం డొల్లగా రుజువైంది. భూమిలేని నిరుపేదలకు మిగులు భూములను పంచక పోగా,వారు ఆనాటికే సాగు చేసుకుంటున్న దేవాలయ, పోరంబోకు, ఫారెస్ట్, బంజరు తదితర భూములపై సైతం... ఆ సాగుదారులైన నిరుపేదలకు హక్కు కల్పించకపోవడమే భూ సంస్కరణల బూటకత్వాన్ని వెల్లడి చేసింది. అయితే తదనంతర కాలంలో పాలకులు మాటవరసకు కూడా భూ సంస్కరణలు, భూ పంపిణీల గురించిన ఊసెత్తుకోవడం మానివేశారు.

1980లలో ప్రజలను ఆకర్షించే కొత్త రూపాలతో పాలకులు ముందుకు వచ్చారు. కాలే కడుపుతో ఉన్నవానికి తక్షణం ఆహారం అందించాలంటే 'రెండు రూపాయలకు కిలో బియ్యం', ఉచిత విద్యుత్తు వంటి హామీలతో ప్రజలను ఆకర్షించారు.

1990ల నాటికి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలులో భాగంగా ప్రజలకు అందే కొద్దిపాటి రాయితీలను, సంక్షేమాన్ని, సబ్సిడీలను క్రమంగా తగ్గించుకుంటూ, ఎత్తివేస్తూ వచ్చారు. ఆర్థిక మీటలతో రైతాంగాన్ని భూముల నుండి తొలగించి కార్పొరేట్లపరం చేస్తూ, కాంట్రాక్ట్ వ్యవసాయం భారీగా కొనసాగించే విధానాలను చేపట్టారు.

రైతాంగ సంక్షోభం ఈ కాలంలో తీవ్ర రూపం దాల్చింది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు వంటి వ్యవసాయ ఉత్పాదకాలు, బహుళజాతి కంపెనీల చేతులలో ఉండి, వాటి ధరలు అనూహ్యంగా పెరిగిపోవడం, పండిన పంటకు సరైన మార్కెట్ సౌకర్యం, కనీస మద్దతు ధరలు లేకపోవడంతో పాటు, అతివృష్టి-అనావృష్టి పరిస్థితులు, సంస్థాగత రుణ సౌకర్యం కొరవడటం, స్థానిక వడ్డీ వ్యాపారులపై ఆధార పడాల్సిరావటం, సాగునీటి సౌకర్యాలు లేకపోవడం వంటి అనేకానేక కారణాలతో రైతాంగం, ప్రత్యేకించి కౌలు రైతాంగం పీకల లోతు రుణభారంలో కూరుకపోయారు. ముఖ్యంగా సస్య విప్లవం అమలైన ప్రాంతాల్లో అధిక సంఖ్యలో రైతాంగం బలవన్మరణాలకు పాల్పడ్డారు. వ్యవసాయాన్ని గిట్టుబాటు కానీయకుండా చేసి, భూమి నుండి రైతులను పరాయీకరించారు. ఇక, వ్యవసాయంపై ఆధారపడిన రైతుకూలీలు, గ్రామీణ పేదలు పొట్ట చేత పట్టుకొని కారుచౌక కార్మికులుగా నిరంతరాయంగా వలసలు పోవడం గ్రామీణ ముఖచిత్రంగా మారింది.

నూతన ఆర్థిక విధానాలతో పారిశ్రామిక రంగం మరింత కుదేలైంది. ప్రభుత్వరంగ పరిశ్రమల మూసివేత, వ్యవసాయధారిత పరిశ్రమలను మరింత కునారిల్లచేయడం, కార్మికులపై పని భారం పెంపు, హక్కులను కాలరాయడం, కాంట్రాక్టు - క్యాజువల్ - ఔట్ సోర్సింగ్-ఫిక్స్‌డ్ టైం కార్మికులను యజమానులు తమకు అవసరమైనప్పుడు నియమించుకుని తర్వాత తమ చిత్తానుసారం తొలగించి వేసే 'హైర్ అండ్ ఫైర్' విధానాలతో కార్మికలోకం తీవ్ర అసంతృప్తితో అట్టుడికిపోతోంది. వివిధ రూపాల్లో వారి నిరసనాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ నేపథ్యంలో కార్మిక రైతాంగంతో పాటుగా ఇతర సెక్షన్ల ప్రజలందరినీ మోసగించడానికి పాలకులు పాత విధానాలనే సరికొత్త రూపాలలో ముందుకు తెచ్చారు. ప్రజలను ప్రాణాలతో ఉంచి, కారుచౌక కార్మికులుగా వారిని మిగుల్చుకునేందుకు వీలుగా పథకాలను ప్రవేశపెడుతూ వచ్చారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ఈ కోవలేదే! ఈ పథకానికి ప్రతి ఏటా కేటాయించే వేలకోట్ల రూ॥ల బడ్జెట్‌ను దిగువస్థాయి పాలకశ్రేణుల 'ఫలహార' పథకంగా మార్చివేశారు.

అవినీతిలో నిండా మునిగిన పాలకులే, అవినీతిని నిర్మూలించే పేరిట, పేదలకు అందవలసిన లబ్ధిని నేరుగా పేదలకే నగదు రూపంలో అందిస్తామంటూ ముందుకు వచ్చారు. దేశంలో ఏదో మేరకు వ్యాప్తి చెందిన డిజిటల్ సాంకేతికత సహాయంతో లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదును బదిలీచేసే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్(డి బి టి )విధానాన్ని చేపట్టారు. లాటిన్ అమెరికాతో సహా వివిధ వెనుకబడిన దేశాలలో అమలుపరచి, దోపిడీశక్తుల ప్రయోజనాలకు దోహదపడిన ఈ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసిపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలుచేసింది.

గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అధికారంలోనున్న వైఎస్ఆర్ సిపి తాము ఎన్నికలకు ముందు ప్రకటించిన 'నవరత్నాల 'పథకాలను 98% పైగా అమలు చేశామని, కనుక రానున్న ఎన్నికల్లో భారీ విజయం తమదేనని ధీమా వ్యక్తం చేస్తుండగా,' సూపర్ సిక్స్' పేరున తెలుగుదేశం, జనసేనలు బిజెపితో కలిసి ప్రజలకు మరిన్ని వాగ్దానాలు చేస్తున్నాయి. జగన్ పాలన అవినీతి పూరితమైందని, అప్పుల మయమైందని, తాము అధికారంలోకి వస్తే 'సంపదను సృష్టిస్తామ'ని వారు గంభీరంగా మాట్లాడుతున్నారు మినహా,

పథకాల పేర్లను అటూ ఇటుగా మార్పులు, చేర్పులు చేసి ప్రకటించడమే జరుగుతోంది. అప్పులమయమైన రాష్ట్రాన్ని తాము అధికారంలోకి వస్తే ఎలా గాడిన పెడతామనే అంశాన్ని వారేమీ వివరించడం లేదు. జగన్ తీరున తాము ప్రకటిస్తున్న పథకాలకు అయ్యే వ్యయాన్ని లెక్క వేస్తే మరింత ఎక్కువ బడ్జెట్‌నే కేటాయించాల్సి ఉంటుందనే అంశాన్ని దాటవేస్తూ, ప్రజలను వంచనకు గురి చేస్తున్నారు.

వ్యవసాయం, విద్య, వైద్యం, పెన్షన్లు వంటి కొన్ని అంశాలలో రాష్ట్ర పాలకులు చేపట్టిన విధానాలను పరిశీలిద్దాం

వ్యవసాయ రంగంలో జగన్ ప్రభుత్వం... రైతు భరోసా-పిఎం కిసాన్ పథకం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం, ఉచిత పంటల భీమా పథకం, సున్నా వడ్డీ పంట రుణాలు, యంత్ర సేవాపథకం, ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం... మొదలైనవి అమలు చేశాం అంటున్నారు. రైతులకు అడుగడుగునా నగదు సహాయ మందిస్తున్నాం అంటున్న ఈ పాలకులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వంటి పంట ఉత్పాదకాల ధరలను కట్టడి చేయగలుగుతున్నారా? అకాల వర్షం బారినపడి, పంట తడిసి పోతుంటే, దానిపై కప్పటానికి టార్పాలియన్లను, కళ్లాల్లో ధాన్యాన్ని ఎత్తడానికి గోతాలను కూడా సరఫరా చేయని పాలకులు...రైతాంగ సంక్షేమం గురించి మాట్లాడేందుకు అర్హులేనా? చచ్చీ చెడి రైతు పంట పండిస్తే,ఆ పంటకు మద్దతు ధరను అందించి కొనుగోలు చేయకుండా మార్కెట్ శక్తుల, దళారీల దయాదాక్షిణ్యాలకు వదిలేయడం.. ప్రతి వ్యవసాయ సీజన్లోనూ జరుగుతూ వస్తున్నదే కదా?! కౌలు భారం అదనంగా మోస్తున్న కౌలు రైతులకు, బేషరతుగా కనీసపాటి ఉపశమనాల్ని కూడా అందజేయని పాలకులు.. రైతాంగ ప్రయోజనాలను పరిరక్షిస్తారా?!

వైద్యరంగంలో... ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ పథకం, ఈ-సంజీవిని, ఉచిత టెలి మెడిసిన్,108 అంబులెన్సులు, కంటి వెలుగు తదితర ఎన్నో పథకాలు అమలు చేశా మంటున్నారు. అయినా ప్రజల ఆరోగ్యానికి వెచ్చించే ఖర్చు ఏమైనా తగ్గిందా? తమ సంపాదనలో అత్యధిక భాగాన్ని పేద, మధ్య తరగతి ప్రజానీకం వైద్యానికి ఖర్చు చేస్తున్న పరిస్థితి మన అనుభవంలోనిదే కదా?! వైయస్ రాజశేఖర్‌రెడ్డి మొదలుకొని, ఈనాటి వైసిపి పాలకుల వరకు ఆరోగ్యశ్రీ పద్దు కింద బడా కార్పొరేట్ ఆసుపత్రులకు కట్టబెట్టిన లక్షల కోట్ల రూపాయలను, ప్రభుత్వ ఆసుపత్రుల కోసం వెచ్చిస్తే,ప్రజలకు ఉచిత వైద్యం...ఎంతో మెరుగ్గా లభించి ఉండేది కాదా?!

విద్యారంగంలో రాష్ట్ర పాలకులు... మధ్యాహ్న భోజనపథకం, గోరుముద్ద, అక్షయ పాత్ర, అమ్మ ఒడి, మనబడి నాడు -నేడు, విద్యా కానుక (స్కూల్ కిట్), విద్యా దీవెన (రీ యంబర్స్‌మెంట్), వసతి దీవెన (హాస్టల్ వ్యయం), విదేశీ దీవెన...మొదలైన పథకాలను అమలు చేశామంటున్నారు. దీనిలో ఫీజు రియంబర్స్మెంట్ల పేరున, పుట్టగొడుగుల్లా పుట్టు కొచ్చిన వందలాది బడా, కార్పొరేట్ కాలేజీలకు కట్టబెట్టిన ప్రజాధనంతో, ప్రభుత్వ రంగంలోనే, ఎన్నివందల కళాశాలలు నిర్మించి, నిర్వహించటం సాధ్యమయ్యేదో కదా?! అంతేగాక, ఈ పథకాల అమలులో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, (విద్యార్థులకు ట్యాబ్‌ల కొనుగోళ్ళ పేరుతో బహుళజాతి కంపెనీలకు మార్కెట్‌గా ఆంధ్రప్రదేశ్‌ను మార్చటంలో అవినీతి పార్శ్వాన్ని అలా వుంచినా) ఆంగ్ల భాషలో విద్యా బోధన, పాఠశాలల విలీనం పేరుతో అనేక పాఠశాలల మూసివేత వంటి అనేకానేక అస్తవ్యస్త విధానాలతో, విద్యారంగాన్ని మరింత దిగజార్చారు. విద్యారంగంలో కీలకమైన ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం పక్కనపెట్టారు. ఉపాధ్యాయులపై ఏకపక్ష దాడి చేస్తూ విద్యారంగంలో సంక్షోభాన్ని సృష్టించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు సాంవత్సరిక బడ్జెట్, లక్ష కోట్ల రూపాయలు కాగా.. విడివడిన తర్వాత నుండి, రెండు రాష్ట్రాలూ లక్షకోట్ల రూపాయల చొప్పున బడ్జెట్ ప్రవేశ పెట్టగలిగాయి! ఈ బడ్జెట్‌ను ప్రతి సంవత్సరం పెంచుతూపోతూ, ఏపీ రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రెండు లక్షల 80 వేల కోట్ల రూపాయలను గత సంవత్సరం బడ్జెట్‌గా ప్రవేశపెట్టింది. కాగా, బటన్ నొక్కి ఈ ఐదు సంవత్సరాలలో నేరుగా వివిధ విభాగాల లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసిన మొత్తం 2 లక్షల 65 వేల కోట్ల రూపాయలు అని లెక్కలు వేస్తున్నారు.

వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు కునారిల్లుతుండడంతో, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ముఖ్యంగా కరోనా విపత్తులోనూ, తదనంతర కాలంలోనూ అత్యధిక ప్రజల కొనుగోలు శక్తి కనీస స్థాయి కంటే దిగువకు పడిపోయిన నేపథ్యంలో, పెట్టుబడిదారుల మార్కెట్ సరుకుల అమ్మకాలలో ప్రతిష్టంభన ఏర్పడి, తిరిగి అది మాంద్యానికి దోవతీసే పరిస్థితి ఏర్పడుతుంది. అందువలన వారి సరుకుల అమ్మకాలు కనీస స్థాయిలో జరిగేటందుకైనా ద్రవ్య చలామణి అవసర మవుతుంది. కనుక, వివిధ పథకాల పేర్లతో లబ్ధిదారులకు నేరుగా నగదు చెల్లించటం, వారి వ్యవస్థ మాంద్యంలో చిక్కుబడకుండా వుండేందుకనేది కూడా రూఢీ అవుతోంది.

ప్రభుత్వం, వ్యవసాయ పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దన్నుగా నిలిచి, అవసరమైన పెట్టుబడినందించి, గ్రామీణ పట్టణ ప్రాంత ప్రజానీకానికి విస్తృతంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించాలి. అప్పుడే ప్రజలకు స్థిరమైన ఆదాయం లభిస్తుంది, వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది. మరోవైపున వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులు గణనీయంగా పెరగడంతో, అది రాష్ట్ర ఆదాయాన్ని పెంచటానికి, తద్వారా వాస్తవికంగా రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల ఆత్మగౌరవ జీవనానికి తోడ్పడుతుంది.

ఈ విధంగా ప్రజలు తమ స్వశక్తితో స్వతంత్రంగా జీవించేందుకు ఇష్టపడని పాలకులు, వారిని నిరంతరం తమను దేబిరించే వారుగా ఉంచాలనే చూస్తున్నారు. అందువలన పైన పేర్కొన్న వివిధ రకాల పథకాలకు (దీనిలో అవినీతి సరే సరి!) లక్షల కోట్లు ఖర్చుపెట్టగలుగు తున్నారు గాని, ఉత్పత్తిని పెంపు చేయడానికి ఆ నిధులను మళ్లించరని స్పష్టమవుతోంది.

వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, చర్మకారులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, హెచ్ఐవి బాధితులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్, డప్పు కళాకారులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు... ఇలా పెన్షన్లను ఒక 'సామాజిక బాధ్యత' అంటూ వేలకోట్ల రూ॥లు ఈ పథకానికి వెచ్చిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంటోంది. పేదల సంక్షేమం, అభివృద్ధిపై ఇంతకాలంగా లక్షల కోట్లు వెచ్చించిన తర్వాత కూడా, 'అమృతకాలం'లోనూ తలకు ఐదు కిలోల చొప్పున అంత్యోదయ పథకం ద్వారా, దేశవ్యాపితంగా 80 కోట్ల మందికి పైగా ప్రజలు ఆహార ధాన్యాలకోసం వేచిచూడాల్సిన దుస్థితిలో ఎందుకు ఉన్నారన్న ప్రశ్నకు వీరి వద్ద సమాధానం లేదు.

మరోవైపున జీవితకాలం ప్రభుత్వ ఉద్యోగంలో సేవలందించి, ఉద్యోగ విరమణ అనంతరం, మిగిలిన జీవితకాలమంతా తమకు, తమ కుటుంబపు జరుగుబాటుకు అవసరమైన, న్యాయమైన, ఎన్నో పోరాటాల ద్వారా ఉద్యోగులు - కార్మికులు సాధించుకున్న, పాత పెన్షన్ విధానాన్ని మాత్రం అమలు చేయబోమని భీష్మించడంలోనే ప్రభుత్వ దురుద్దేశం అర్థమవుతోంది. ఒక హక్కుగా డిమాండ్ చేస్తే ఎవరికీ ఏమీ ఇవ్వబోమని, తమ దయాదాక్షిణ్యాల కనుగుణంగా మాత్రమే వ్యవహరిస్తామనటం కాదా ఇది?!

సంక్షేమ పథకాల రూపంలో ప్రభుత్వం ఖర్చు చేసే మొత్తం వల్లనే దేశాభివృద్ధి కుంటుపడుతోందని, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు వెచ్చించలేకపోతున్నారని, కొందరు మేధావులు వాపోతున్నారు. ఇది సరైన వాదన కానే కాదు.

ఆహార, వస్తు ఉత్పత్తి పెరగటానికి దోహద పడకుండా లబ్ధిదారులకు నగదు చెల్లింపులను 'ఉచితాలు' (freebies)గా చెప్పుకుంటున్నప్పటికీ ఈ ఉచితాలను రద్దు చేయాలా, ఉచితాలతో పేదలంతా సోమరులుగా తయారవుతున్నారా, ఉచితాల కారణంగానే ఆర్థికవ్యవస్థ కుప్పకూలు తోందా?! ఇవన్నీ... తరచి చూడాల్సిన అంశాలు.

ఈనాడు ప్రభుత్వాలు లబ్ధిదారుల పేరిట ప్రజలను తమ చుట్టూ తిప్పుకుంటూ, డిజిటలీకరణతో ముడిపడిన ఆటంకాలన్నింటినీ వారు అధిగమించిన తర్వాత, అనేక గీటురాళ్లతో వడబోసిన తర్వాత, ప్రభుత్వం విధించిన 300 యూనిట్ల లోపు విద్యుత్తు వాడకం,75% బడికి హాజరు వంటి ఎన్నో నిబంధనలను సంతృప్తి పరచిన తరువాత... అర్హులు ఎంతమంది ఉన్నా, కుటుంబంలో ఒక్కరికి మాత్రమే, వారు అందించే ఆ కొద్దిపాటి నగదు.. ప్రజల అవసరాలతో పోల్చుకున్నపుడు ఏ మూలకూ రాని మాట వాస్తవం. పెరిగిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, కూరగాయలు ఇతర నిత్యావసరాల ధరలు, రవాణా ఛార్జీల పెరుగుదల, విద్యుత్ ఛార్జీల పెరుగుదల, చెత్త పన్నుతో సహా వివిధ రకాల పన్ను భారాల పెంపుల నడుమ... ప్రభుత్వం అందించే నగదు ఎందుకూ కొరగాదు. దీనికి తోడు, అనేక పేదల కుటుంబాలలో చేతికి వచ్చిన ఆ డబ్బు కాస్తా తిరిగి ప్రభుత్వ మద్యం దుకాణాలకే చేరుతుండడం వాస్తవం కాదా?! ప్రభుత్వాలు ఇచ్చే ఒకటో, రెండో ఉచితాలతోనే పేదల బ్రతుకులు తెల్లారటం లేదు. పొద్దస్తమానం రెక్కలు ముక్కలు చేసుకొని వారు భవన నిర్మాణ కార్మికులుగానూ, ప్రమాదకర పరిశ్రమలలోను, ఇంకా పలురకాల కారుచౌక కూలీలుగా పని చేయకుంటే, నాలుగు వేళ్ళు నోట్లోకి వెళ్ళవనేది నిజం కాదా?! అందువలన... ఈ పథకాలతో ప్రజలు సోమరులవుతారనే వాదన అర్థం లేనిది.

ఇక ఈ ఉచితాల కారణంగా ఆర్థిక వ్యవస్థకు నష్టమనే వాదన హాస్యాస్పదమైనది. కరోనా విపత్తుతో దేశం యావత్తు విలవిల్లాడుతున్న విపత్కరకాలంలో ఆదాని, అంబానీలు ప్రపంచ కుబేరులలోకి ఎగబాక గలగటం... దేనిని సూచిస్తుంది?! లక్షలకోట్ల ఆత్మ నిర్భరభారత్, పిఎం కేర్స్ నిధులలో సింహ భాగాన్ని దిగమింగినది ఎవరు? అలాగే, దేశంలో బడా పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుండి తీసుకొని ఎగవేసిన లక్షల కోట్లతో పోలిస్తే; బడా, బహుళ జాతి పారిశ్రామికవేత్తలకు కల్పించే వేలకోట్ల పన్ను రాయితీలు, నిరర్థక ఆస్తులపేరిట (ఎన్‌పిఏ)వారి లక్షల కోట్ల బకాయిల రద్దులతో పోలిస్తే... పేదలకు ఇస్తున్నాం అంటున్న సంక్షేమం, ఉచితల కేటాయింపు... సముద్రంలో నీటి చుక్కే కదా!

దీనితోపాటుగా ఈ సందర్భంలోనే స్పష్టం చేసుకోవలసిన అంశం మరొకటి ఉంది. ప్రజలపై విధించే వివిధ రకాల పన్నుల రూపంలో ప్రభుత్వం వద్దకు పోగైన డబ్బుని బడ్జెట్ రూపంలో ప్రభుత్వం తిరిగి ఖర్చు పెడుతూ రావడం అందరకూ తెలిసిందే.అయితే ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో 70% పైగా పేద, మధ్యతరగతి ప్రజానీకం నుండే లభిస్తుండగా, సంపన్నుల పన్నుల చెల్లింపులు తక్కువగాను, లబ్ధి పొందటంలో ప్రథములుగాను ఉండడం... వాస్తవం కాదా?! బడ్జెట్‌ను మొత్తంగా కొల్లగొడుతున్న వీరు, సంక్షేమ పథకాలతోనే అభివృద్ధి కుంటుపడుతుందని, తాము చెల్లించిన పన్నులతో పేదలకు ఉచితాలు అందిస్తున్నారని పేర్కొనడం... వాస్తవాలను తలకిందులుగా చూపటమే అవుతుంది మినహా, వేరు కాదు.

నిర్బంధం, సంస్కరణలనేవి ఒకే నాణానికి బొమ్మ-బొరుసు లాంటివి. భూమి, ఉద్యోగం, ఉపాధి, గృహవసతి, విద్యా, వైద్యం... వంటి ప్రజల మౌలిక సమస్యలకు దోపిడీ పాలకులు ఒక శాశ్వత పరిష్కారాన్ని చూపలేరు. ఈ డిమాండ్లపై ప్రజలు వివిధ రూపాల్లో సాగించే ఆందోళనోద్యమాలు తీవ్ర రూపం దాల్చినప్పుడు, ఆ ఉద్యమాలను రక్తపుటేరుల్లో ముంచటానికి కూడా వారు వెనుకాడరని అనేక సందర్భాలలో రుజువైన వాస్తవం. అయితే ఆయుధాలతో, నిర్బంధాలతో, ప్రజలను ఎల్లకాలం అణిచి ఉంచలేమని కూడా వారికి స్పష్టమే. కనుక, ఏకకాలంలో ఒకవైపున నిర్బంధాన్ని, అణిచివేతను ప్రయోగిస్తూనే, మరోవైపున ప్రజలను బుజ్జగించే, మభ్యపుచ్చే అనేక విధానాలను అమలు చేస్తూ వస్తున్నారు. నిర్బంధం, అణచివేతల ద్వారా మాత్రమే గాక(కుల, మత, ప్రాంతీయ, భాషా ద్వేషాలతో ప్రజలను విభజించి పాలించే... గంజాయి, మద్యం, మత్తు మందులతో ముంచెత్తే విధానాలతో పాటుగా) సంస్కరణలు, సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను ఎక్కువ కాలం భ్రమల్లో ఉంచి, తమ పాలన సజావుగా సాగించుకోగలమననే ధీమాతో వారు వ్యవహరిస్తున్నారు.

ఈ పథకాలన్నింటినీ పాలక పార్టీలు తమ రాజకీయ అధికారాన్ని కైవసం చేసుకునేందుకు ముందుకు తేవటంతో పాటు, ప్రజలను వీటి చుట్టూ పరిభ్రమింప చేస్తూ వంచనకు పాల్పడు తున్నాయి. ప్రజలను శ్రమించే తత్వం, సంఘటిత తత్వం, ఆందోళనామార్గాల నుండి దూరం చేసి... ఈ పథకాలనే ఎండమావుల వెంట పరుగులు తీయించేందుకు, తాము విసిరే ఎంగిలి మెతుకుల కోసం ఎల్లకాలం వెంపర్లాడే వారిగా మలుచుకునేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. ప్రజలు స్వయం పోషకం కాకూడదు, ఆత్మగౌరవంతో ఎదగకూడదు అన్నది పాలకుల అంతరంగం. సంక్షేమం పేరుతో సాగించే ఈ విధానాలు ప్రజలను భ్రమల్లో ముంచి, వారి వర్గ చైతన్యాన్ని మసకబార్చడం, పాలకుల లక్ష్యం.

కనుక, ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం పేరిట ప్రారంభించిన 'సంస్కరణల' నుండి,సామూహిక ప్రయోజనాలకు ఉద్దేశించిన 'సంక్షేమ పథకాల' నుండి, ఈనాటికి విడివిడిగా వ్యక్తులకు లబ్ధి చేకూర్చే, వారి వారి ఖాతాలలో ఎంతో కొంత నగదు జమచేసే ప్రజాకర్షక, తాయిలాల పథకాలుగా, రానున్న ఎన్నికల్లో నెగ్గేందుకు ముందుస్తుగా, చట్టబద్ధంగా ప్రజాధనంతో ఓట్లను కొనుగోలు చేసే పథకాలుగా దిగజారాయని అర్థమవుతుంది.

1871 సంవత్సరంలో కారల్ మార్క్స్ అమెరికా కార్మిక సంఘ నాయకునికి రాసిన లేఖలో ఇలా పేర్కొన్నారు: "పాలకవర్గాల రాజకీయ అధికారానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడేలా, కార్మిక వర్గానికి శిక్షణ ఇచ్చి తీరాలి. పాలకవర్గాల విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడేలా కార్మిక వర్గానికి శిక్షణ ఇచ్చి తీరాలి. పాలకవర్గ విధానాలకు వ్యతిరేకంగా శత్రుపూరితంగా ఉండేలా నేర్పాలి. లేకపోతే కార్మిక వర్గం పాలకవర్గాల చేతిలో ఆట వస్తువుగా మారిపోతుంది" కనుక, ఉచితాలు ప్రజాకర్షక పథకాల ముసుగులో ప్రజా వంచనకు పాల్పడుతున్న పాలక పాలక పార్టీల మోసపూరిత విధానాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, మౌలిక సమస్యల పరిష్కార దిశగా తమ పోరాటాలను ఎక్కుపెట్టాలి. ★


చదవండి చదివించండి

**కార్మిక నగారా**

**పీడిత ప్రజల పక్షపత్రిక**

వెల: 5 రూ॥

కాపీలకు : **మైత్రీబుక్‌హౌస్**

**జలీల్‌వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2**



## తెలంగాణా రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు
# కామ్రేడ్ గంగుల నర్సయ్యకు జోహార్లు

సిపిఐ (ఎంఎల్) తెలంగాణ రాష్ట్ర నాయకులు, తెలంగాణ రైతు కూలీ సంఘం (ఏఐకేఎంకేఎస్ అనుబంధం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు... కామ్రేడ్ గంగుల నరసయ్య (56 సంవత్సరాలు) 14-3-2024న మరణించాడు.

వ్యవసాయ వృత్తిదారులైన కష్టజీవుల కుటుంబంలో నిజామాబాద్ జిల్లా డోన్ పాల్ గ్రామంలో కామ్రేడ్ నరసయ్య జన్మించాడు. అంతరాలు లేని సమాజం కోసం పీడిత వర్గాలు పోరాట బాటన సాగాలనే లక్ష్యాన్ని చేబూని,1990- 96 కాలంలో ప్రజల మధ్య కార్యకలాపాలు సాగిస్తూ 'రహస్య జీవనం' గడిపాడు.

తదనంతరం రైతు కూలీ ఉద్యమ నిర్మాణ కార్యక్రమాలలో భాగస్వామి అయ్యాడు. ప్రజా సమస్యలపై కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నాడు. నిజామాబాద్ పట్టణ పరిసరాలలో మాధవ నగర్‌ను నెలకొల్పి శ్రమజీవుల కుటుంబాలకు నిలువ నీడ కోసం నిరంతరాయంగా సమిష్టి కృషి సాగించి కాలనీ నిలబెట్టుకున్నారు. కామ్రేడ్ నరసయ్య మృతి పట్ల రైతు కూలీ సంఘం (ఆంధ్ర) తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ ఆ కామ్రేడ్‌కు జోహార్లు అర్పిస్తున్నది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది.

**ఎస్. ఝాన్సీ, అధ్యక్షులు - రైతు కూలీ సంఘం(ఆం.ప్ర)**

# జెఎన్‌యు విద్యార్థులపై ఫాశిస్టు ఏబివిపి చేసిన దాడిని తీవ్రంగా ఖండించండి
## - రివల్యూషనరీ స్టూడెంట్స్ యూత్ క్యాంపైన్ (ఆర్ఎస్‌వైసి) పిలుపు

**జెఎన్‌యులో** విద్యార్థి యూనియన్ ఎన్నికలను డిమాండ్ చేస్తూ, ఈ డిమాండ్‌పై ఆర్ఎస్ఎస్-జెఎన్‌యు పాలనా యంత్రాంగపు దుష్టకూటమికి వ్యతిరేకంగా పోరాడుతున్న జెఎన్‌యు విద్యార్థులపై ఫాశిస్టు గూండాలు దాడులు సాగించారు. 29-2-2024 రాత్రి జెఎన్‌యు విద్యార్థి యూనియన్ ఎన్నికల అంశంపై విద్యార్థులు జనరల్‌బాడీ సమావేశం జరుపుకుంటుండగా, ఏబివిపి గూండాలు ఈ దాడికి పాల్పడ్డారు. విద్యార్థులను కర్రలతో తీవ్రంగా బాదుతూ, పలువురు విద్యార్థులను తీవ్రంగా గాయపరిచారు. అనేకమంది విద్యార్థులు ఆసుపత్రులలో, అత్యవసర చికిత్సా విభాగాల్లో చేరారు. మిగిలిన అనేకమందితోపాటు ఆర్ఎస్‌వైసి కార్యకర్త కా॥శౌర్య తీవ్రంగా గాయాలపాలైంది.

జెఎన్‌యు విద్యార్థులపై సాగించిన ఈ ఫాశిస్టు దాడిని ఆర్ఎస్‌వైసి తీవ్రంగా ఖండిస్తోంది. విద్యార్థి యూనియన్‌ను ఏర్పరచుకోవటం, విద్యార్థుల ప్రాథమిక హక్కు. గతంలో కూడా ఎన్నికలు నిర్వహించాలనే విద్యార్థుల డిమాండ్‌ను ప్రక్కనుంచి, ఫాశిస్టుశక్తుల పనిముట్టుగా మారిన జెఎన్‌యు పాలనా యంత్రాంగం, ద్రోహపూరితంగా ఈ క్రమ మంతటికి అడ్డుపడుతోంది. అలాగే ఏబివిపి గూండాలు కూడా విద్యార్థుల జనరల్ బాడీ సమావేశాలను వరుసగా విచ్ఛిన్నం చేస్తున్నారు.

జెఎన్‌యులోని విద్యార్థుల యూనియన్‌కు ఎన్నికలు నిర్వహించాలనే విద్యార్థుల డిమాండ్‌ను ఆర్ఎస్‌వైసి మద్దతుగా నిలుస్తూనే, అన్ని కళాశాలలు, యూనివర్శిటీలలో విద్యార్థి యూనియన్‌లకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది.

విద్యాసంస్థల ప్రాంగణాలలో విద్యార్థుల ఏ రకపు అసమ్మతినైనా తొక్కిపట్టటానికి ఫాశిస్టు శక్తులు ప్రయత్నిస్తున్నాయి. (అదేవిధంగా దేశంలో శ్రామిక విభాగాలను కూడా) సిద్ధాంతపరమైన ఏవిధమైన వ్యతిరేకతను కూడా వారు సహించేందుకు సిద్ధంగా లేరు. అది జెఎన్‌యు, డియు లేదా ఏఎమ్‌యు, అలహాబాద్ యూనివర్శిటీ, జామియా మిల్లా జాదవ్‌పూర్ యూనివర్శిటీ మొదలైన వాటన్నింటిలోనూ ఇటీవలి కాలంలో అసమ్మతితోనున్న విద్యార్థులపై పదేపదే దుర్మార్గమైన దాడులకు పాల్పడుతూ వస్తున్నారు. విద్యారంగాన్ని వేగంగా ప్రైవేటీ కరించేందుకు (ఇతర రంగాలతోపాటు) ఆతురతతోనున్న పెట్టుబడిదారీ వర్గానికి ఇవన్నీ అనివార్యంగా దోహదపడతాయి. అలాగే వీరంతా బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నవారే. విద్యార్థి సమూహాలపై ఫాశిస్టు, నయాఉదారవాద కార్పొరేట్ దాడులను ఆర్ఎస్‌వైసి వ్యతిరేకిస్తూ ముందు పేర్కొన్న వానికి వ్యతిరేకంగా విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణం చేపట్టాలని; న్యాయమైన విద్యావ్యవస్థ, న్యాయమైన సమాజవ్యవస్థ దిశగా పోరాటాన్ని ముందుకు సాగించాలని పిలుపునిస్తోంది. విద్యాసంస్థల్లో ఫాశిస్టుల దాడులను ప్రతిఘటించండి.

**1-3-24**

**రివల్యూషనరీ స్టూడెంట్స్ యూత్ క్యాంపైన్ (ఆర్ఎస్‌వైసి)లో ఏఐపిఎస్ఎఫ్, ఏఐఆర్ఎస్ఓ, బిఎస్ఎఫ్, కలెక్టివ్, డివైఎస్ఏ, ఐఎస్‌యు, పచ్చాస్, పిడిఎస్ఎఫ్, పిడిఎస్‌యు, పిడిఎస్ఓ, పిడివైఎఫ్, పిఎస్‌వైఏ సభ్య సంస్థలుగా వున్నాయి**

**(12వ పేజీ నుండి)**

కాబట్టి, శాంతియుత పరివర్తన అంటూ కబుర్లు చెప్పడం ద్వారా ఆధునిక రివిజనిస్టులు ప్రజల విప్లవ సంకల్పాన్ని స్తంభింపచేయ జూస్తూంటే, మార్క్సిస్టు-లెనినిస్టులు దేశ కాల పరిస్థితుల్నిబట్టి మాత్రమే శాంతియుతంగా సోషలిజాన్ని స్థాపించే సమస్యను ప్రస్తావించవలసి యుంటుందని చెబుతారు. బూర్జువావర్గం శాంతియుత పరివర్తనకు అంగీ కరిస్తుందనే అంచనామీద శ్రామికవర్గం ఆధారపడి తన ఆలోచనను, పాలసీని, కార్యకలాపాలను రూపొందించుకోకూడదు; ప్రత్యామ్నాయ మార్గాలు అవలంబించడానికెప్పుడూ అది సిద్ధంగా ఉండాలి. ఒకే సమయంలో శాంతియుత మార్గానికీ, తద్భిన్నమైన మార్గానికీ కూడా సిద్ధంగా ఉండాలి. సోషలిజానికి పరివర్తన సాయుధ విప్లవం ద్వారా జరగాలా లేక శాంతియుతంగానా అను సమస్యకూ, సోషలిస్టు పెట్టుబడిదారీ దేశాల మధ్య శాంతియుత సహజీవన సమస్యకూ మౌలికమైన వ్యత్యాస ముంది. సోషలిజానికి పరివర్తన ఒక్కొక్క దేశం యొక్క ఆంతరంగికసమస్య; ఆ దేశంలోని వర్గ సంబంధాలచే అది నిర్ణయింపబడుతుంది; ఆ దేశంలోని కమ్యూనిస్టులు నిర్ణయించుకోవలసిన సమస్య అది.

(చివరి రెండు భాగాలు వచ్చే సంచికలో) ✱

అధ్యయనం కోసం..

# బుద్ధుడు-కార్ల్ మార్క్స్

(మన ప్రగతిశీల మిత్రులలో కొందరు అంబేద్కర్, కారల్‌మార్క్స్ ఇరువురి ఆరాధకులున్నారు. మార్క్సిజం ఎర్రజెండా, అంబేద్కరిజం నీలిజెండా కలగలిసి భారత సామాజిక వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పును తీసుకువస్తుందని వారు విశ్వసిస్తారు. వారి ఆలోచనలు, సూచనలను దృష్టిలో వుంచుకొని డా॥బి.ఆర్.అంబేద్కర్ వ్రాసిన 'బుద్ధుడు-కారల్‌మార్క్స్' వ్యాసాన్ని 'డా॥బాబాసాహెబ్ అంబేద్కర్: రైటింగ్స్ అండ్ స్పీచెస్' వాల్యూమ్ 3, నుండి సేకరించి ప్రచురిస్తున్నాం. – సంపాదకులు)

డా॥బి.ఆర్.అంబేద్కర్

కార్ల్‌మార్క్స్‌ను బుద్ధుని పోల్చిచూడడం జోక్‌గా అనిపించవచ్చు. ఇందులో ఆశ్చర్యపడ వలసింది లేదు. మార్క్స్‌కీ, బుద్ధునికీ 2381 ఏళ్ళ కాలవ్యవధి ఉంది. బుద్ధుడు క్రీ.పూ. 563లో జన్మిస్తే మార్క్స్ క్రీ.శ. 1818లో జన్మించాడు. కార్ల్‌మార్క్స్ ఒక కొత్త భావజాలానికీ రాజనీతికి, కొత్త ఆర్థిక వ్యవస్థకు రూపకల్పన చేసినవాడు. ఇందుకు భిన్నంగా, బుద్ధుడు కేవలం ఒక మత స్థాపకుడుగా – అదీ ఆర్థిక రాజకీయ విషయాలకు ఏమాత్రం సంబంధం లేని మత స్థాపకుడుగా విశ్వసింపబడ్డాడు. ఈ వ్యాస శీర్షిక "బుద్ధుడు – కార్ల్ మార్క్స్". విభిన్నమైన ఆలోచనలకు చెందినవాళ్ళను, సుదీర్ఘ కాల దూరం గల వ్యక్తులను పోల్చిచూడడం లేక వాళ్ళ మధ్యగల భేదాలను చెప్పడం అని ఈ శీర్షికను అర్థం చేసుకోవచ్చు. ఇది ఎబ్బెట్టుగా కూడా కనిపిస్తుంది. దీనిని చూసి మార్క్సిస్టులు నవ్వవచ్చు. లేదా ఈ యిద్దరినీ సమానస్థాయిలో చూడడాన్ని చూసి వాళ్ళు ఎగతాళి చెయ్యవచ్చు. మార్క్స్ అత్యంత ఆధునికుడు, బుద్ధుడు అత్యంత ప్రాచీనుడు! తమ గురువుతో పోల్చిచూచినప్పుడు బుద్ధుడు చాలా ఆదిమ దశలో ఉంటాడని మార్క్సిస్టులు చెప్పవచ్చు. ఈ ఇద్దరి మధ్య ఎలాంటి పోలిక తీసుకురాగలం? ఒక మార్క్సిస్టు బుద్ధుని నుండి ఏమి నేర్చుకోగలడు? బుద్ధుడు ఒక మార్క్సిస్టుకు ఏమి నేర్పగలడు? ఏమైనపటికీ ఈ యిద్దరినీ పోల్చిచూడడం ఆకర్షణీయంగానూ, జ్ఞానదాయకంగాను ఉంటుంది. ఇద్దరినీ చదివి, ఇద్దరి భావజాలాల పట్ల ఆసక్తిగల నన్ను ఈ యిద్దరినీ పోల్చిచూడాలనే తపన వత్తిడి చేస్తుంది. మార్క్సిస్టులు వాళ్ళ దురభిమానాలను పక్కనబెట్టి, బుద్ధుని చదివి ఆయన వేటికోసం నిలబడ్డాడో అర్థం చేసుకుంటే, తప్పకుండా తమ వైఖరిని మార్చుకుంటారనుకుంటాను. బుద్ధుని పట్ల తిరస్కార భావంగల మార్క్సిస్టులు ఆయనని ఆరాధించగలరని ఆశించడం అత్యాశే. అయితే, బుద్ధుని బోధనలలో వాళ్ళు గుర్తించవలసిందేదో ఉందని తెలుసుకోగలరని మాత్రం చెప్పవచ్చు.

## I. బుద్ధుని సిద్ధాంతం

బుద్ధుడనగానే అహింసా సిద్ధాంతంతో జోడించి చూడడం సాధారణం. అదే బుద్ధుని బోధనల సర్వస్వంగా భావించబడింది. అయితే బుద్ధుని బోధన అహింసా సిద్ధాంతం కన్నా విశాలమైందని ఎవరికీ తెలియదు. అందువల్ల ఆయన బోధనల్ని వివరంగా పేర్కొనడం మంచిది. నేను త్రిపిటకాలను చదివి అర్థం చేసుకున్న రీతిలో వాటిని పేర్కొంటాను:

1. స్వేచ్ఛా సమాజానికి మతం అవసరం.
2. ప్రతి మతమూ ఆచరించదగింది కాదు.
3. మతం జీవిత వాస్తవాలతో సంబంధం కలిగుండాలి. అంతేతప్ప దేవుని ఆత్మ, స్వర్గం, భూమిని గురించిన సిద్ధాంతాలతో, ఊహా గానాలతో కాదు.
4. మతానికి దేవుని కేంద్రంగా చెయ్యడం తప్పు
5. ఆత్మ విముక్తిని (మోక్షాన్ని) మతానికి కేంద్రంగా చెయ్యడం తప్పు
6. మతానికి పశుబలులను కేంద్రంగా చెయ్యడం తప్పు
7. అసలైన మతం మనిషి హృదయంలో ఉంటుంది, శాస్త్రాలలో ఉండదు.
8. మనిషి, నైతికత మతానికి కేంద్రం కావాలి. అలా కానప్పుడు మతం క్రూరమైన మూఢ నమ్మకం.
9. నైతికత జీవితాశయం అయితే చాలదు. భగవంతుడు లేడు గనక అది జీవిత నియమం, ధర్మం కావాలి.
10. మతం కర్తవ్యం, ప్రపంచాన్ని పునర్నిర్మించడం, దానిని ఆనందమయం చెయ్యడం తప్ప దాని ఆద్యంతాలను వివరించడం కాదు.
11. మానవుల్లో ఆనందం లేకపోవడానికి కారణం, భిన్న ప్రయోజనాల సంఘర్షణ. దానికి పరిష్కార మార్గం అష్టాంగ మార్గాన్ని అనుసరించడం.
12. సంపద మీద వ్యక్తిగత ఆధిపత్యం, ఒక వర్గానికి శక్తిని మరోవర్గానికి దుఃఖాన్ని కలిగిస్తుంది.
13. ఈ దుఃఖానికిగల కారణాన్ని నిర్మూలించడం ద్వారా దుఃఖాన్ని పోగొట్టడం సంఘ శ్రేయస్సు దృష్ట్యా అవసరం.
14. మనుషులందరూ సమానులే.
15. మనిషిని కొలవడానికి ప్రతిభ తప్ప పుట్టుక ప్రమాణం కాదు.
16. ముఖ్యమైంది ఉన్నత ఆదర్శాలు తప్ప ఉత్తమ కులంలో పుట్టుక కాదు.
17. అందరిపట్ల స్నేహభావాన్ని ఎపుడూ విస్మరించరాదు. శత్రువు పట్ల కూడా ఈ భావాన్ని కలిగుండాలి.
18. చదువు అందరికీ గల హక్కు. మనిషి బతకడానికి ఆహారం అవసరమైనట్లే విద్యకూడా అవసరం.
19. శీలం లేని విద్య అపాయకరం.
20. ఏదీ లోపరహితం కాదు. ప్రతిదీ విచారణకూ, పరీక్షకు నిలవాలి.
21. ఏదీ అంతిమం కాదు.
22. ప్రతిదీ కార్యకారణ సిద్ధాంతానికి నిలవాలి.
23. ఏదీ శాశ్వతమూ, సనాతనమూ కాదు. ప్రతిదీ మార్పుకు లోనౌతుంది. స్థితి ఎల్లపుడూ పరిమాణాత్మకం.
24. సత్యం కోసం, న్యాయం కోసం కాకపోతే యుద్ధం చెయ్యడం తప్పు
25. విజేతకు ఓడిపోయిన వానిపట్ల బాధ్యత లున్నాయి.

సంక్షిప్తంగా బుద్ధుని సిద్ధాంతం ఇది. ఇది ఎంత ప్రాచీనం, అయినా ఎంత నవీనం! ఆయన బోధనలు ఎంత విశాలమైనవి, ఎంత లోతైనవి!

## II. కార్ల్ మార్క్స్ మౌలిక సిద్ధాంతం

కార్ల్ మార్క్స్ బోధించిన సిద్ధాంతం చూద్దాం.

కార్ల్ మార్క్స్ ఆధునిక సోషలిజానికి లేక కమ్యూనిజానికి పితామహుడనడంలో సందేహం లేదు. అయితే సోషలిజం సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం వరకే ఆయన ఆసక్తిని పరిమితం చేసుకోలేదు. అది అతనికి ముందే అనేకులు చేశారు. ఆయన తన సోషలిజం శాస్త్రీయ మైందని నిరూపించడానికి ఎక్కువ ఆసక్తి

చూపాడు. ఆయన పెట్టుబడిదారుల మీద ఎలా దాడి చేశాడో ఉటోపియన్ (స్వాప్నిక) సోషలిస్టుల మీద కూడా అంత దాడి చేశాడు. ఆయన వాళ్ళిద్దరినీ వ్యతిరేకించాడు. ఈ అంశాన్ని గుర్తించడం చాలా అవసరం. ఎందుకంటే మార్క్స్ తన సోషలిజం యొక్క శాస్త్రీయ స్వభావానికి చాలా ప్రాముఖ్యమిచ్చాడు. మార్క్స్ చేసిన ప్రతిపాదనలన్నీ ఆయన సోషలిజం శాస్త్రీయమైంది, స్వాప్నికం కాదు అని నిరూపించడానికే ఉపయోగించబడ్డాయి.

కార్ల్‌మార్క్స్ దృష్టిలో శాస్త్రీయ సోషలిజం అంటే అనివార్యమైంది, తప్పించుకోలేనిది అని అర్థం. సమాజం దానికి అనుకూలంగా పయనిస్తున్నదని, దానిని ఎవరూ ఆపలేరని అర్థం. ఈ భావనను నిరూపించడానికే మార్క్స్ ప్రధానంగా కృషిచేశాడు.

మార్క్స్ భావన ఈ క్రింది సిద్ధాంతాలపై ఆధారపడింది. అవి:

i. తత్వశాస్త్రం ప్రయోజనం ప్రపంచాన్ని పునర్నిర్మించడం తప్ప, దాని మూలాన్ని వివరించడం కాదు.
ii. చరిత్ర గతిని నిర్ణయించేది ప్రధానంగా ఆర్థిక శక్తులే.
iii. సమాజం – యజమాని, శ్రామికులు అని రెండు వర్గాలుగా విభజింపబడింది.
iv. రెండు వర్గాల మధ్య నిరంతరం సంఘర్షణ జరుగుతూ ఉంది.
v. యజమానులు శ్రామికులను దోపిడి చేస్తున్నారు. శ్రామికుల శ్రమ ఫలితమైన అదనపు విలువను దోచుకుంటున్నారు.
vi. ఉత్పత్తి సాధనాలను జాతీయం చేయడం ద్వారా అంటే వ్యక్తిగత ఆస్తిని నిర్మూలించడం ద్వారా ఈ దోపిడీని ఆపవచ్చు.
vii. ఈ దోపిడి, శ్రామికులు మరింత, మరింత బీదవాళ్ళుగా మారడానికి దారి తీస్తుంది.
viii. పెరుగుతున్న శ్రామికుల దారిద్ర్యం, శ్రామికులలో విప్లవ స్ఫూర్తిని తెస్తుంది. వర్గ సంఘర్షణ, వర్గ పోరాటానికి దారి తీస్తుంది.
ix. యజమానుల కన్నా శ్రామికులు అధిక సంఖ్యాకులు కాబట్టి, శ్రామికులు రాజ్యాన్ని స్వాధీనం చేసుకొని అధికారాన్ని స్థాపిస్తారు. దీనిని మార్క్స్ శ్రామిక నియంతృత్వం అన్నాడు.
x. ఈ వాస్తవాలు ఎదుర్కోవడానికి వీలులేనివి కనుక, సోషలిజం నివారించలేనిది.

మార్క్సియన్ సోషలిజానికి పునాది అయిన ప్రతిపాదనల్ని నేను సరిగ్గానే నివేదించానను కుంటున్నాను.

## III. మార్క్సియన్ సిద్ధాంతంలో

బుద్ధుని భావజాలాన్ని, కారల్ మార్క్స్ భావజాలాన్ని పోల్చి చూసేముందు మార్క్సియన్ సిద్ధాంతం యొక్క మూలం ఎంతవరకు నిలిచిందో చూడటం అవసరం. ఆయన సిద్ధాంతాన్ని చరిత్ర ఎంత పూర్వపక్షం చేసిందో, ఆయన వ్యతిరేకులు ఎంత పడగొట్టారో గుర్తించాల్సి ఉంది.

మార్క్సియన్ సిద్ధాంతం 19వ శతాబ్దం మధ్యలో ప్రతిపాదించబడింది. అప్పటి నుంచి అది ఎంతో విమర్శకు గురయింది. ఈ విమర్శ ఫలితంగా "కారల్ మార్క్స్" చాలా వరకు ముక్కచెక్కలయింది. మార్క్సియన్ సోషలిజం అనివార్యం అన్నది పూర్తిగా పూర్వపక్షం చేయబడింది అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. 'దాస్ క్యాపిటల్' ప్రచురింపబడిన 70 ఏళ్ళ తరువాత 1917లో ఒక దేశంలో మొదటి సారిగా శ్రామిక నియంతృత్వం స్థాపించబడింది. రష్యాలో వచ్చిన 'కమ్యూనిజం'– శ్రామిక నియంతృత్వానికి మరోపేరు కమ్యూనిజం కూడా – ఎటువంటి మానవ ప్రయత్నం లేకుండా అనివార్యంగా రాలేదు. అది రష్యాలోకి అడుగుపెట్టే ముందు విప్లవం జరిగింది. రక్తపాతం హింసలతో కూడిన ప్రయత్నపూర్వక వ్యూహం వుంది. మిగతా ప్రపంచం శ్రామిక నియంతృత్వం రాకకోసం ఇంకా ఎదురు చూస్తూ ఉంది. ఇలా సోషలిజం అనివార్యం అనే మార్క్సియన్ సిద్ధాంతం అబద్ధం అని నిరూపించు కోవడంతో పాటు, జాబితాలో ఇచ్చిన అనేక ప్రతిపాదనలు తర్కంద్వారా, అనుభవంచేతా పడగొట్టబడ్డాయి. ఇప్పుడు చరిత్రను ఆర్థిక వ్యాఖ్యానంతో మాత్రమే వివరించటాన్ని ఎవరూ ఒప్పుకోరు. శ్రామికులు మరింత మరింతగా నిరుపేదలు అయిపోతునట్టు ఎవరూ ఒప్పుకోరు. ఇవి ఇతర వాదాల పట్ల కూడా ఇది వాస్తవం.

"కారల్ మార్క్స్" చెప్పిన దాంట్లో ఇక మిగిలింది, అగ్నిశేషం మాత్రమే. అది చిన్న దయినా చాలా ముఖ్యమైంది. ఈ అవశేషంలో నా దృష్టిలో నాలుగంశాలు ఉన్నాయి.

I. తత్వశాస్త్రం కర్తవ్యం ప్రపంచాన్ని పునర్నిర్మించడం తప్ప, దాని మూలాన్ని వివరించడంలో కాలాన్ని వృధా చేయడం కాదు.
II. విభిన్న వర్గాల ప్రయోజనాల మధ్య సంఘర్షణ ఉంది.
III. వ్యక్తిగత ఆస్తిహక్కు దోపిడీ ద్వారా ఒక వర్గానికి శక్తిని అధికారాన్ని, మరో వర్గానికి దుఃఖాన్ని కల్గిస్తుంది.
IV. వ్యక్తిగత ఆస్తిని తీసివేయడం ద్వారా ఈ దుఃఖాన్ని తొలగించడం సమాజశ్రేయస్సు దృష్ట్యా అవసరం.

## IV. బుద్ధుడు, కార్ల్ మార్క్స్ పోలిక

మార్క్స్ వాదంలో సజీవంగా మిగిలిన అంశాలను తీసుకొని బుద్ధుడినీ, కార్ల్ మార్క్స్‌ను పోల్చి చూడవచ్చు.

మొదటి అంశం మీద బుద్ధుడు, కార్ల్ మార్క్స్ ఇద్దరూ పూర్తి ఏకీభావంతో నిలబడ తారు. ఈ సమ్మతి ఎంత దగ్గరగా ఉందో చెప్పటానికి బుద్ధునికి ఒక బ్రాహ్మణ పొత్తపాదునికి జరిగిన సంభాషణలోని ఒక భాగాన్ని ఉదహరిస్తాను :

"అప్పుడు, అదే పద్ధతిలో, పొత్తపాదుడు (బుద్ధుడిని) ఈ క్రింది ప్రశ్నలు అడిగాడు."

1. ప్రపంచం శాశ్వతం కాదా?
2. ప్రపంచం పరిమితమైనదా?
3. ప్రపంచం అపరిమితమైనదా?
4. ఆత్మ, శరీరం ఒక్కటేనా?
5. ఆత్మ, శరీరం వేర్వేరా?
6. సత్యాన్ని సాధించిన మనిషి, మరణానంతరం మళ్ళీ జీవిస్తాడా?
7. అతని మరణానంతరం అతనికి జీవన్మరణాలు రెండు లేకుండా పోతాయా?

ప్రతి ప్రశ్నకు ఆ భగవానుడు ఒకేరకమైన సమాధానం ఇచ్చాడు. అది ఇది :

"పొత్తపాదా! అది కూడా నేను అభిప్రాయం చెప్పని విషయం."

"అయితే సర్వోన్నతుడు (బుద్ధుడు) దానిమీద ఎందుకు అభిప్రాయం చెప్పలేదు?"

"(ఎందుకంటే) ఈ ప్రశ్నను లాభదృష్టితో చూడలేదు. దానికి ధర్మంతో పనిలేదు. ఇది సత్ప్రవచనాంశాలతో గాని, నిర్మలతో గాని, వ్యామోహక్షాళనం గాని, నిశ్చలత్వం లేక హృదయ శాంతి, లేక వాస్తవ జ్ఞానం లేక అంతర్దృష్టి లేక నిర్వాణం వీటిలో దేనితోనూ సంబంధం లేదు.

ఎందుకంటే 'ఈ ప్రశ్న ప్రయోజన రహితమైనది. దీనికి (ధమ్మంతో) పని లేదు. సమ్మ కౌవర్తనకీ, వైరాగ్యానికీ, మోహ క్షాళనానికీ గానీ, నిశ్చలతకీ, ప్రశాంత చిత్తతకి గానీ, వాస్తవ జ్ఞానానికి గానీ (అష్టాంగ మార్గానికి చెందిన ఉన్నత దశలలోని) అంతర్దృష్టికిగానీ, నిర్వాణానికి గానీ సంబంధం లేని ప్రశ్న ఇది. అందుకే దానిపై నేనే అభిప్రాయమూ ప్రకటించలేదు.'

రెండో అంశానికి సంబంధించి బుద్ధునికి కోసల రాజుకు మధ్య జరిగిన సంభాషణను ఉదహరిస్తాను:

"పైగా, రాజుల మధ్య మహోన్నతుల మధ్య, బ్రాహ్మణుల మధ్య, గృహస్థుల మధ్య,

తల్లికి, కొడుక్కి మధ్య, కొడుక్కి తండ్రికి మధ్య, అన్నకు చెల్లికి మధ్య, అక్కకు తమ్మునికి మధ్య, స్నేహితునికి స్నేహితునికి మధ్య అక్కడ నిరంతరం సంఘర్షణ జరుగుతున్నది".

ఇవి పసేనది మాటలైనపటికీ బుద్ధుడు ఆ మాటలు, అసలైన సమాజ రూపాన్ని రూపొందిస్తుండడాన్ని కాదనలేదు.

ఇక వర్గ సంఘర్షణకు సంబంధించి బుద్ధుని వైఖరి చూస్తే, ఆయన అష్టాంగ మార్గ సిద్ధాంతం వర్గ సంఘర్షణ ఉనికిని గుర్తిస్తుంది. దుఃఖానికి కారణం వర్గ సంఘర్షణే అని చెబుతుంది.

మూడో అంశానికి సంబంధించి బుద్ధునికి పొత్తపాదునికి జరిగిన సంభాషణను ఉదహరిస్తాను :

"సర్వోన్నతులు అప్పుడేమి నిర్ణయించారు?"

"దుఃఖమూ విషాదమూ ఉన్నాయని వివరించాను, పొత్తపాదా!"

"దుఃఖానికి మూలం ఏమిటో వివరించాను. దుఃఖానికి అంతమేదో వివరించాను. దుఃఖ నివారణకు చేరవలసిన పద్ధతేమిటో వివరించాను."

"మహానుభావులు అలా ఎందుకు సెలవిచ్చారు."

"పొత్తపాదా! ఎందుకంటే ఆ ప్రశ్నలు ప్రయోజనకరమైనవి, ధర్మానికి సంబంధించినవి. సరైన ప్రవర్తన, విమోచన, వ్యామోహం నుండి ప్రక్షాళన, శాంతి, హృదయ ప్రశాంతి, సరైన జ్ఞానం అష్టాంగమార్గ ఉన్నత దశలలోని అంతర్దృష్టికీ, నిర్వాణానికీ వీటికి సంబంధించినవి. అందువల్లనే అలా ప్రకటించాను, పొత్తపాదా!"

భాష వేరుగాని అర్థం ఒక్కటే. దుఃఖాన్ని దోపిడీగా చదువుకుంటే బుద్ధుడు మార్క్సుకు దూరంగా లేడు.

వ్యక్తిగత ఆస్తికి సంబంధించి బుద్ధునికి, ఆనందునికీ మధ్య జరిగిన ఈ సంభాషణ అద్భుతమైనది. ఒక ప్రశ్నకు బదులుగా బుద్ధుడు ఆనందునితో ఇలా అన్నాడు :

"సంపద వల్ల అత్యాశ కలుగుతుంది ఆనందా, అది ఏరూపంలో ఉన్నా, దాన్ని ఈ రకంగానే అర్థం చేసుకోవాలి. ఎవరిదగ్గరైనా, దేని దగ్గరైనా ఏరకమైన కలిమీ లేకపోతే, వారి వద్ద స్వంతమనేది లేనేలేకపోతే అక్కడ అత్యాశ కనిపిస్తుందా?"

"దేవా! కనిపించదు."

"ఎందుకుంటుంది ఆనందా! అత్యాశకు ఆధారం, మూలం, కారణం సంపదే కదా!"

"లోభమే సంపదను కలిగి వుండడానికి మూలం. అది ఏరకమైనదైనా ఈ విధంగానే అర్థం చేసుకోవాలి. దేని విషయంలోనైనా, ఏదో ఒకరకం ప్రలోభం లేకపోతే స్వంతమనేది వుంటుందా?"

"దేవా! ఉండదు."

"ఎందుకుంటుంది ఆనందా! స్వంత సంపదకు ఆధారమూ, మూలమూ, కారణమూ సంపదే కదా!"

నాలుగో అంశానికి నిదర్శనం అవసరం. భిక్షు సంఘ నియమాలే ఈ విషయంలో ఉత్తమ సాక్ష్యంగా పనికివస్తాయి.

భిక్షు నియమాల ప్రకారం, సొంత ఆస్తి అంటూ ఈ క్రింది ఎనిమిది వస్తువులనే కలిగుండాలి, ఇంకేదీ ఉండకూడదు. ఆ ఎనిమిది వస్తువులు ఇవి:

1,2,3. రోజూ ధరించడానికి మూడు తుండుగుడ్డలు.

4. నడుముకు చుట్టుకునే గుడ్డ.
5. భిక్షాపాత్ర.
6. క్షవరపు కత్తి
7. సూది
8. కమండలం.

అంతేకాక భిక్షువు ఎప్పుడుగాని బంగారు, వెండి స్వీకరించరాదు. ఎందుకంటే, వాటితో అతను ఈ ఎనిమిది వస్తువులే కాక ఇంకేవో కొనే అవకాశం వుంది.

ఈ నియమాలు రష్యాలోని కమ్యూనిజంలో కనిపించే నియమాలకన్నా చాలా తీవ్రమైనవి.

## V. సాధనాలు

ఇప్పుడు సాధనాలు చూద్దాం. కమ్యూనిజాన్ని సాధించడానికి బుద్ధుడు ప్రతిపాదించిన సాధనాలు చాలా నిర్దిష్టమైనవి. వీటిని మూడు భాగాలుగా విభజించవచ్చు.

మొదటిభాగం పంచశీలను అనుసరించడం.

సిద్దార్థుడిని బుద్ధుని చేసిన జ్ఞానోదయం ఓ కొత్త మత ప్రవచనానికి కారణమైంది. అందులో అతనిని వెంటాడే సమస్యకు పరిష్కారసూచన ఉంది.

ప్రపంచం దుఃఖంతోనూ, విషాదంతోను నిండిందనే వాస్తవమే నవీన గీతకు పునాది. ఇది కేవలం గుర్తు పెట్టుకోవలసిన వాస్తవం మాత్రమే కాదు, ముక్తికి సాధనమైన ఓ పథకంలోనైనా మొట్టమొదటిదిగా, ముఖ్యమైందిగా గుర్తించ వలసింది కూడా. ఈ సత్యాన్ని గురించి బుద్ధుడు తన నవీన గీతకు ప్రారంభాంశంగా చేశాడు.

బుద్ధుని నవీన బోధకు పునాది, ప్రపంచమంతా దుఃఖమయమూ బాధామయమూ అనే వాస్తవమే. ఇది కేవలం గుర్తించవలసిన వాస్తవమేమీ కాదు, ముక్తి సాధనలో ప్రథమమూ ప్రధానమూ అయిన ప్రారంభించాడు. వాస్తవం. ఈ వాస్తవాన్ని గుర్తించడంతోనే బుద్ధుడు తన బోధనలను ఆ దుఃఖాన్ని, బాధను తొలగించడమే బుద్ధుని బోధల లక్ష్యమూ, ఉద్దేశ్యమూ. తన బోధనలు ప్రయోజనం సాధించాలంటే అది జరగాలి. ఈ దుఃఖానికి కారణాలను ప్రశ్నించుకుని బుద్ధుడు రెండింటిని పేర్కొన్నాడు.

మనిషి దుఃఖానికి బాధకు ఒక కారణం అతని దుష్ప్రవర్తన. దీనిని నిర్మూలించడానికి పంచశీలను అనుసరించమన్నాడు బుద్ధుడు.

పంచశీలలో క్రింది అంశాలున్నాయి:

1. సజీవంగా ఉన్న దేనినైనా నాశనం చెయ్యడాన్ని గాని, నాశనం కావడానికి దోహదం చెయ్యడంగాని చేయకపోవడం.
2. దొంగతనాన్ని అంటే ఇతరుల సంపదను మోసంచేసిగాని, హింస ద్వారాగాని పొందడాన్ని, ఉంచుకోవడాన్ని – చేయక పోవడం.
3. అసత్యాన్ని చెప్పకుండా వుండడం.
4. మోహం నుంచి దూరంగా వుండడం.
5. మత్తుపానీయాల నుంచి దూరంగా వుండడం.

ప్రపంచ దుఃఖానికి, బాధకు బుద్ధుని దృష్టిలో ఒక మనిషి ఇంకో మనిషిని సమానంగా చూడకపోవడం కూడా కొంత కారణం. ఈ అసమానతను ఎలా నిర్మూలించడం? దీనికి బుద్ధుడు అష్టాంగ మార్గాన్ని చెప్పాడు. ఇందులోని అంశాలివి :

1. సరైన ఆలోచనలు – మూఢ నమ్మకాలకు దూరంగా ఉండడం.
2. సరైన ధ్యేయాలు – మేధావుల, గంభీర వ్యక్తిత్వం ఉన్నవారి ఉన్నత, యోగ్య లక్ష్యాలను కలిగుండడం.
3. సరైన భాషణ – దయ, నిర్మొహమాటం, సత్యసంధతగల మాటతీరు.
4. సరైన ప్రవర్తన – శాంతి, నిజాయితీ, స్వచ్ఛత గల ప్రవర్తన.
5. సరైన జీవనం – ఏ జీవికీ హాని చెయ్యని జీవనం.
6. సరైన జాగ్రత్త – చురుకైన మనసుతో జాగ్రత్తపడటం.
7. సరైన చింతన – జీవితంలో లోతైన రహస్యాల మీద ఉన్నతమైన ఆలోచన కలిగుండడం.
8. తక్కిన ఏడింటిని సరిగ్గా పాటించడం.

ఉన్నతమైన అష్టాంగ మార్గం భూమిమీద ధర్మసామ్రాజ్యాన్ని స్థాపించడానికి, తద్వారా, సమాజంలో విషాదాన్ని దుఃఖాన్ని నిర్మూలించడానికి ఉద్దేశింపబడింది.

బుద్ధుని బోధనలోని మూడో భాగం నిర్వాణ సిద్ధాంతం. ఉన్నతమైన అష్టాంగ

మార్గంలో నిర్వాణ సిద్ధాంతం అంతర్భాగం. నిర్వాణం లేకుండా అష్టాంగ మార్గం ఫలవంతం కాదు.

అష్టాంగ మార్గం ఫలవంతం కావడంలో గల కష్టాలను చెబుతుంది, నిర్వాణసిద్ధాంతం. ఈ కష్టాలలో ఏది ముఖ్యమైనది. బుద్ధుడు వాటిని పది ఆసనాలు, సంకెలలు, ఆటంకాలు అన్నాడు.

మొదటి ఆటంకం ఆత్మభ్రాంతి. మనిషి నిలువెల్లా తనను తాను ఆవరించి ఉన్నంత కాలం, తన మనసుకు సంతృప్తినిస్తాయని అనిపించే పనికిమాలిన వస్తువుల వెంటబడుతూ ఉన్నంతకాలం, అతనికి మహోన్నత మార్గం సిద్ధించదు. అపరిమితమైన ఈ సమస్తంలో తానొక గడ్డిపోచ అన్న వాస్తవాన్ని గ్రహించి కండ్లు తెరిచినప్పుడు, తాత్కాలికమైన అతని వ్యక్తిత్వం ఎంత అశాశ్వతమో తెలుసుకోవడం మొదలు బెట్టినప్పుడు – అప్పుడు మాత్రమే మనిషి ఈ సన్న దారిలోనైనా ప్రవేశించగలడు.

రెండోది సందేహం, అనిశ్చితత్వం. మనిషి విశిష్టమైన సృష్టిమర్మం తెలుసుకోగలిగినప్పుడు, వ్యక్తిత్వం యొక్క అశాశ్వతత్వాన్ని తెలుసు కోగలిగినప్పుడు అతడు చేసే పనుల్లో సందేహం, అనిశ్చితత్వం ఉండవు. చెయ్యాలా వద్దా? నా వ్యక్తిత్వం అశాశ్వతమే కదా? ఏదైనా చేయడం ఎందుకు? అనే ప్రశ్నలు మనిషిని సందిగ్ధంలో, స్తబ్దతలో పడేస్తాయి. కానీ జీవితంలో అది పనికిరాదు. అతడు గురువును అనుసరించడానికి, సత్యాన్ని ఒప్పుకోడానికి, పోరాటంలోకి ప్రవేశించ టానికి మానసికంగా సిద్ధం కావాలి. లేకపోతే అతనికి పురోగతి లేదు.

మూడోది కర్మకాండల సార్థకత మీద ఆధారపడడం. మనిషి బాహ్యకర్మలు, పౌరోహిత్య అధికారాలు, పవిత్ర కర్మలు సహాయకారి కాగలవన్న నమ్మకానికి చెందిన కర్మకాండ నుండి బయటపడకుంటే, అతడు తీసుకునే మంచి నిర్ణయాలు సైతం అవెంత గట్టివైనా అతనిని ఎటైనా తీసుకుపోతాయి. ఈ అడ్డంకిని అధిగమించి రాగలిగినప్పుడు మాత్రమే మనుషులు ప్రధాన మార్గంలోకి వచ్చినట్లు చెప్పడానికి వీలవుతుంది. వాళ్ళకు ఇప్పుడో అప్పుడో విజయం లభిస్తుంది.

నాలుగోది శరీర వ్యామోహాలు.

అయిదోది ఇతరుల పట్ల దుర్బుద్ధి.

ఆరోది భవిష్యత్ భౌతిక జీవితంపట్ల కోరికల్ని అణచుకోవడం.

ఏడోది భవిష్యత్తులో ఆధ్యాత్మిక ప్రపంచం పట్ల కోరిక.

ఎనిమిదోది గర్వం.

తొమ్మిదోది స్వాతిశయం.

ఇవి మనుషులు అధిగమించడానికి కష్టసాధ్యమైన అవరోధాలు. ముఖ్యంగా మేధావులు తమ కంటే తక్కువ సమర్థులపై, తక్కువ పవిత్రులపై చూపే నిరసనలో వ్యక్తమయ్యే అవరోధాలు.

పదోది అజ్ఞానం. అన్ని కష్టాలనూ జయించినా ఇది మాత్రం అలాగే అజేయంగా నిలిచి ఉంటుంది. వివేకవంతుల్లో, సజ్జనుల్లో కూడా మాంసంలో ముల్లులా మిగిలే ఈ అవరోధం మనిషికి అంతిమ శత్రువు, బద్ధ శత్రువు. మహోన్నత అష్టాంగ మార్గసాధనలో ఈ అడ్డంకుల్ని అధిగమించడానికి నిర్వాణం ఉపయోగపడుతుంది.

అష్టాంగ మార్గ సిద్ధాంతం ఒక వ్యక్తి ఎలాంటి మానసిక స్వభావాన్ని జాగ్రత్తగా అలవరచుకోవాలో చెబుతుంది. నిర్వాణ సిద్ధాంతం అష్టాంగ మార్గాన్ని అనుసరించడానికి వ్యక్తి అధిగమించాల్సిన అడ్డంకుల్ని చెబుతుంది.

బుద్ధుని నవబోధలోని నాలుగోభాగం పారమిత సిద్ధాంతం. పారమిత సిద్ధాంతం వ్యక్తి నిత్యజీవితంలో అనుసరించవలసిన పది సద్గుణాలను చెబుతుంది.

1) పన్న (ప్రజ్ఞ) 2) శీల 3) నెఖ్ఖాయ (నిష్కామ) 4) దాన 5)వీర్య 6)ఖాంతి(కాంతి) 7) మక్క(సత్యం) 8)అదిత్థాన (అధిష్ఠాన) 9)మెత్త(మైత్రి) 10)ఉపెక్ష(ఉపేక్ష)

మోహాంధకారం లేక అవిద్య అనే చీకటిని తొలగించే కాంతి, పన్న లేక వివేకం. ఇందులో వ్యక్తి తనకన్నా మించిన వారిని ప్రశ్నించి సందేహాలను నివృత్తి చేసుకోవాలి. మనసు ఎదగడానికి భిన్న కళల్ని, శాస్త్రాలను అభ్యసించాలి. వివేకవంతుల సాంగత్యంలో వుండాలి.

శీల నైతికాంశం. చెడు చెయ్యరాదు, మంచిని చెయ్యాలనే కోరిక, తప్పు చేయడం అవమానకరం, చెడు చేస్తే శిక్షపడుతుంది అన్న భయంతో దానిని విడనాడడం శీల. శీల అంటే చెడు చెయ్యడానికి భయపడటం.

ప్రాపంచిక సుఖాలను త్యజించడమే నెఖ్కామ.

ప్రతిఫలాపేక్ష రహితంగా సంపదను, రక్తమాంసాలను ప్రాణాన్ని సైతం ఇతరుల క్షేమం కోసం త్యాగం చెయ్యడం దాన.

సరైన ప్రయత్నమే వీర్యం. చెయ్యాలనుకున్న దానిని నీ శక్తితో, నీ అలోచనతో వెనక్కి తిరిగి చూడకుండా చెయ్యడం వీర్య.

సారాంశం – అసహ్యించుకునే వాడిని అసహ్యించుకునేవాడు శాంతింప జెయ్యలేడు. అది సహనంతోనే సాధ్యమౌతుంది.

మక్కా అంటే సత్యం. బుద్ధుడు కావాలనుకున్నవాడు అబద్ధమాడడు. అతని వాక్కు సత్యం. సత్యం తప్ప మరేమీ కాదు.

అదిత్థాన అంటే గమ్యం చేరాలనే ఖచ్చితమైన నిర్ణయం.

మెత్త అంటే సకల జీవులపట్ల సహన భావాన్ని కలిగి ఉండడం. శత్రువుపట్ల, మిత్రుని పట్ల, మనిషిపట్ల, జంతువుపట్ల సహానుభావాన్ని కలిగుండడం.

ఉపేఖ్ఖ అంటే నిర్లక్ష్యం – నిర్లిప్తత. ఇది ఇష్టాయిష్టాలు లేని మానసిక స్థితి. ఫలితాన్ని చూసి చలించకుండా, దానిని పొందడానికి ప్రయత్నం చేస్తుండడం.

ఈ ధర్మాలను వ్యక్తి తన శక్తికొలదీ ఆచరించాలి. అందుకే అవి పారమితులన బడ్డాయి. అంటే పరిణత దశలు అని అర్థం.

ప్రపంచంలోని దుఃఖాన్ని విషాదాన్ని నిర్మూలించడానికి బుద్ధుడు తన జ్ఞానం ద్వారా బోధించిన బోధలివి.

మనిషి తన నైతిక వైఖరిని మార్చుకుని అష్టాంగ మార్గాన్ని స్వచ్ఛందంగా అనుసరించేట్టు పరివర్తన చెందజేయడమే బుద్ధుడు అనుసరించిన సాధన (మార్గం).

మనిషి నైతిక మార్గంలో పయనించడానికి తన నైతిక వాంఛలను మార్చడం అన్నది బుద్ధుడు స్వీకరించినవిధానం అన్న విషయం స్పష్టమైంది.

కమ్యూనిస్టులు అనుసరించిన సాధనాలు కూడా అంతే స్పష్టమూ, సూక్ష్మమూ, పదునూ కలిగినవి. అవి 1) హింస 2) నిరంకుశత్వం.

కమ్యూనిజాన్ని స్థాపించడానికి రెండే విధానాలున్నాయని కమ్యూనిస్టులు చెబుతారు. అవి మొదటిది – హింస. ప్రస్తుతం అమలులో ఉన్న వ్యవస్థని నిర్మూలించడానికి ఇది తప్ప మరేదీ సరిపోదు. రెండోది – శ్రామిక నియంతృత్వం. నూతన వ్యవస్థను కొనసాగించాలనడానికి మరేదీ దానితో సమానంకాదు.

బుద్ధునికి కార్ల్ మార్క్సుకు మధ్యగల సామ్యభేదాలు ఇప్పుడు స్పష్టమైనాయి. ఇద్దరి మధ్య గమనంలో భేదమూ, గమ్యంలో ఐక్యత కనిపిస్తున్నాయి.

## VI. సాధనాల మదింపు

ఇద్దరి సాధనాలను మదింపు చేద్దాం. ఎవరి విధానం గొప్పదో, ఎవరి విధానం ఎక్కువ కాలం నిలుస్తుందో అడగాలి. రెండువైపులా అపార్థాలున్నాయి. ముందు వాటిని తొలగించాల్సిన అవసరముంది.

హింసనే తీసుకోండి. హింసను తలచు కోగానే వణికిపోయేవాళ్ళున్నారు. అయితే అది సెంటిమెంటు మాత్రమే. హింసను మొత్తంగా తిరస్కరించడం సాధ్యం కాదు. కమ్యూనిస్ట్ దేశాలు కాని దేశాల్లో కూడా హంతకులను ఉరి తీస్తున్నారు. ఉరి హింసలోకి రాదా?

కమ్యూనిస్టేతర దేశాలు కమ్యూనిస్టేతర దేశాలమీదికి యుద్ధానికి పోతాయి. మిలియన్ల మంది ప్రజల్ని చంపేస్తాయి. ఇది హింస కాదా? ఒక పౌరుని చంపిన కారణం చేత ఒక హంతకుడిని చంపగలిగినప్పుడు, శత్రుదేశానికి చెందినందువల్ల ఓ సైనికుడిని చంపగలిగినప్పుడు, తన యాజమాన్యం వల్ల తక్కిన మానవులకు దుఃఖాన్ని కలిగిస్తున్న ఆస్తిపరుని ఎందుకు చంపకూడదు? వ్యక్తిగత ఆస్తి పరమ పవిత్ర మనుకుంటే తప్ప, ఆస్తి యజమానికి మినహాయింపు ఇవ్వడానికి హేతువేదీ లేదు.

బుద్ధుడు హింసకు వ్యతిరేకి. అయితే ఆయన న్యాయాన్ని సమర్థిస్తాడు, న్యాయంకోసం అవసరమైతే బలప్రయోగం చెయ్యడాన్ని ఆయన సమర్థిస్తాడు. వైశాలి సర్వ సైన్యాధ్యక్షుడైన సింహసేనాపతితో ఆయన సంభాషించినప్పుడు ఇది ద్యోతకమౌతుంది. బుద్ధుడు అహింసను బోధిస్తున్నాడని తెలిసి సింహసేనాపతి పోయి ఇలా అడిగాడు :

"భగవానుడు అహింసను బోధిస్తున్నారు. ఒక నేరస్థుని శిక్షనుండి తప్పించాలని భగవానుడు బోధిస్తారా? మన భార్యలను, పిల్లల్ని, సంపదను రక్షించుకోడానికి యుద్ధానికి పూనుకోరాదని భగవానుడు బోధిస్తారా? అహింస పేరు జెప్పి మనం సంస్థల చేతిలో బాధపడాలా?"

"సత్యం కోసం న్యాయం కోసం కూడా యుద్ధం చెయ్యడాన్ని తథాగతులు నిషేధిస్తారా?"

బుద్ధుడు బదులిచ్చాడు : "నా బోధనల్ని నువ్వు తప్పుగా అర్థం చేసుకున్నావు. దోషి శిక్షింపబడాలి. అమాయకుడు శిక్షింపబడ కూడదు. నేరస్థుని శిక్షించడం న్యాయమూర్తి తప్పుకాదు. శిక్షకు కారణం నేరస్థుని నేరం. న్యాయమూర్తి శిక్షవేసి చట్టాన్ని అమలుపరుస్తాడు అంతే. అతడు అహింసకేమీ కళంకం తేలేదు. న్యాయంకోసం, భద్రత కోసం పోరాడే వ్యక్తి హింసావాది కాదు. శాంతిని పరిరక్షించే అన్ని మార్గాలూ విఫలమైతే, అప్పుడు హింసకు బాధ్యత, యుద్ధాన్ని ప్రారంభించిన వాడిదే. ఎవరైనాసరే దుష్టశక్తులకు లొంగిపోరాదు. యుద్ధం జరగవచ్చు. అది స్వార్థ ప్రయోజనాల కోసం జరగరాదు.

హింసకు వ్యతిరేకంగా ఇతర వాదన లున్నాయి. గమ్యమే గమనాన్ని సమర్థిస్తుంది అన్నది మతితప్పిన సిద్ధాంతం అని వాదించే వాళ్ళను, గమనాన్ని గమ్యంకాక పోతే ఇంకేది సమర్థిస్తుంది?

ప్రొఫెసర్ జాన్ దెవే వానిని సరిగ్గానే ప్రశ్నించాడు. గమనాన్ని సమర్థించేది గమ్య మొక్కటే.

బహుశా, బుద్ధుడు గమ్యమే గమనాన్ని సమర్థిస్తుంది అని అంగీకరించే ఉంటాడు. అది కాకపోతే మరేమిటి? గమ్యం హింసను సమర్థిస్తే, హింస గమ్యానికి సరైన మార్గం అవుతుందని ఆయన చెప్పివుంటాడు. గమ్యానికి బల ప్రయోగమే శరణ్యమైతే బుద్ధుడు ఆస్తిపరులను కూడా అందులోంచి మినహాయించి ఉండడు. అయితే గమ్యం కోసం ఆయన చెప్పే విధానం భిన్నమైందిగా మనం చూస్తాం. ప్రొఫెసర్ దెవే పేర్కొన్నట్లు, హింస బలప్రయోగానికి మరోపేరు తప్ప మరేమీ కాదు. సృజనాత్మక అవసరాలకు బలప్రయోగం అవసరమే అయినప్పటికీ, బలాన్ని ఒక శక్తిగా వాడడానికి, బలాన్ని హింసగా వాడుకోడానికి మధ్య భేదాన్ని పాటించాలి. ఒక గమ్యాన్ని సాధించడం కోసం అనేక ఇతర గమ్యాలను నిర్మూలించవలసి వస్తుంది. కానీ ఇవి నిర్మూలించదగిన ఆ ఒక్క గమ్యంలో అంతర్భాగాలే. బల ప్రయోగాన్ని చెడును నిర్మూలించడంలో సాధ్యమైనన్ని ఎక్కువ గమ్యాలను రక్షించేటట్లు చెయ్యాలి. బుద్ధుని అహింస, జైన మత స్థాపకుడైన మహావీరుని శుద్ధ అహింస వంటిది కాదు. అతడు బలాన్ని శక్తిగానే అనుమతించి ఉంటాడు. కమ్యూనిస్టులు అహింసను పరమ సిద్ధాంతంగా చెబుతారు. బుద్ధుడు దానిని పూర్తిగా వ్యతిరేకించాడు."

నియంతృత్వాన్ని బుద్ధుడు సమర్థించడు. అతడు ప్రజాస్వామిక వాదిగా పుట్టాడు. ప్రజా స్వామికవాదిగా మరణించాడు. ఆయన కాలంలో 14 రాచరిక రాజ్యాలు, 4 రిపబ్లిక్కులు ఉండేవి. ఆయన శాక్య తెగకు చెందినవాడు. శాక్య సామ్రాజ్యం రిపబ్లిక్కు. ఆయన రెండో నివాసం వైశాలి. దానిని ఆయన అపారంగా ప్రేమించాడు. ఎందుకంటే అది రిపబ్లిక్కు. మహాపరినిర్వాణానికి ముందు ఆయన వర్షవాసం వైశాలిలోనే చేశాడు. వర్షవాసం పూర్తయినాక ఆయన అక్కణ్నుంచి మరోచోటికి పోవాలని నిర్ణయించుకున్నాడు. అలా కొంతదూరం వెళ్ళినాక ఆయన ఒకసారి వెనక్కి తిరిగి వైశాలిని చూసి ఆనందునితో అన్నాడు. "తథాగతుడు వైశాలిని చూడడం ఇదే ఆఖరుసారి" ఆ రిపబ్లిక్ మీద ఆయన కంత మక్కువ ఉండేది.

ఆయన ఆసాంతం సమతావాది. బుద్ధునితో సహా భిక్షువులందరూ అతుకులు వేసిన అంగీలు ధరించారు. పాలక సంపన్న వర్గాలు ఈ సంఘంలో చేరకుండా నివారించడం కోసం ఈ నియమం పెట్టబడింది. కొంతకాలం తర్వాత జీవకుడనే వైద్యుడు, అతుకులు లేని ఒకే బట్టతో తయారు చేసిన అంగీని వేసుకునేట్లు బుద్ధుని ఒప్పించాడు. బుద్ధుడు ఆ నియమాన్ని సడలించి దానిని అందరికీ వర్తింపజేశాడు.

భిక్షుక సంఘంలో చేరిన బుద్ధుని తల్లి మహా ప్రజాపతి గౌతమి, ఒకసారి ఆయనకు జలుబు చేసినట్లు తెలుసుకొంది. ఆయనకొక తల రుమాలు కుట్టడం మొదలుబెట్టింది. కుట్టడం పూర్తయిన తర్వాత బుద్ధుని దగ్గరికి తీసుకెళ్ళి తీసుకోమంది. ఆయన దానిని తిరస్కరించాడు. తిరస్కరిస్తూ అది బహుమాన మైతే మొత్తం సంఘానికి చెందుతుంది తప్ప, సంఘంలో ఒక వ్యక్తికి కాదు అన్నాడు. ఆమె ఎంతో ప్రాధేయపడింది. ఆయన ఒప్పుకోలేదు.

భిక్షుక సంఘానికి ఎంతో ప్రజాస్వామికమైన రాజ్యాంగముంది. ఆయన ఆ భిక్షువులలో ఒకడు. మహా అయితే ఆయన మంత్రివర్గ సభ్యులలో ప్రధానమంత్రి వంటివాడు. ఆయన ఎప్పుడూ నిరంకుశుడు కాదు. ఆయన మరణానికి ముందు సంఘాన్ని అజమాయిషీ చెయ్యడానికి ఎవరినైనా నియమించమని రెండు పర్యాయాలు ఆడిగితే, ఆయన ధర్మమే సంఘానికి ఉన్నతాధికారి అనిచెప్పి, ఆ కోరికను తిరస్కరించాడు. తాము నిరంకుశాధికారిగా ఉండడానికి, మరో నిరంకుశాధికారిని నియమించడానికి ఆయన ఒప్పుకోలేదు.

లక్ష్యాన్ని సాధించే సాధనాల విలువల మాటేమిటి? ఎవరి పద్ధతులు ఉన్నతమైనవి, ఎవరివి శాశ్వతంగా నిలుస్తాయి?

తమ విలువైన లక్ష్యాలను సాధించడంలో ఇతరుల విలువైన లక్ష్యాలను నాశనం చెయ్యలే దని కమ్యూనిస్టులు చెప్పగలరా? వాళ్ళు వ్యక్తిగత ఆస్తిని ధ్వంసం చేశారు. అది విలువైన లక్ష్యం అనుకొని, దానిని సాధించే క్రమంలో ఇతర విలువైన లక్ష్యాలను నాశనం చెయ్యలేదని వాళ్ళు చెప్పగలరా? ఈ లక్ష్యాన్ని సాధించడంలో వాళ్ళు ఎంత మందిని చంపేశారు? మానవ జీవితానికి విలువలేదా? యజమానిని చంపకుండా, ఆస్తిని స్వాధీనం చేసుకోలేరా?

నియంతృత్వాన్నే తీసుకోండి. దాని లక్ష్యం విప్లవాన్ని శాశ్వతం చెయ్యడం. ఇది విలువైన లక్ష్యం. అయితే దీనిని సాధించే క్రమంలో ఇతర విలువైన లక్ష్యాలను నాశనం చెయ్యలేదని వాళ్లు చెప్పగలరా? నియంతృత్వం స్వేచ్ఛా రాహిత్యంగా, పార్లమెంటరీ ప్రభుత్వం లేనిదిగా చెప్పబడింది. ఈ రెండు వివరణలూ స్పష్టంగా లేవు. పార్లమెంటరీ ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా స్వేచ్ఛ లేదు. ఎందుకంటే చట్టం అంటేనే స్వేచ్ఛా రాహిత్యం. నిరంకుశాధికారానికి పార్లమెంటరీ ప్రభుత్వానికీ మధ్య ఉండే భేదం ఇదే. పార్లమెంటరీ ప్రభుత్వంలో, స్వతంత్రం మీద ప్రభుత్వం రుద్దిన నిషేధాలను, ఆటంకాలను విమర్శించే హక్కు ప్రతి పౌరునికీ ఉంటుంది.

పార్లమెంటరీ ప్రభుత్వంలో నీకు ఒక బాధ్యత ఉంది, ఒక హక్కు ఉంది. చట్టాన్ని సమ్మతించడం బాధ్యత, దానిని విమర్శించడం హక్కు. నిరంకుశత్వంలో చట్టాన్ని శిరసావహించే బాధ్యత తప్ప దానిని విమర్శించే హక్కు ఉండదు.

## VII ఎవరి సాధనాలు శక్తిమంతం?

ఇప్పుడు మనం ఎవరి సాధనాలు ఎక్కువ శాశ్వతంగా ఉంటాయో దాన్ని పరిశీలించాలి. బలప్రయోగాన్ని ఉపయోగించే ప్రభుత్వమూ, నైతిక ప్రవృత్తిగల ప్రభుత్వమూ ఈ రెంటిలో ఒకదాన్ని ఎన్నుకోవాలి.

బర్క్ చెప్పినట్లు బలప్రయోగమనేది శాశ్వతమైన మార్గం కాదు. అమెరికాతో సామరస్యం అనే అంశంపైన మాట్లాడుతూ ఆయన ఒక స్మరణీయమైన హెచ్చరిక చేశాడు:

"అయ్యా! మొట్టమొదట కేవలం బల ప్రయోగమనేది తాత్కాలికమే అని చెప్పడానికి నాకు అనుమతివ్వండి. ఆ క్షణానికి అది అణిచి వేయవచ్చు. కాని అణచివేసే అవసరాన్ని మాత్రం అది తొలగింపలేదు. ఏ జాతి, ఏ దేశం మాటి మాటికి జయింపబడవలసి ఉంటుందో అది పాలింపబడదు."

నా తరువాతి అభ్యంతరం అనిశ్చితత్వం. బలప్రయోగం యొక్క ఫలితం ఎల్లకాలమూ భయోత్పాతం కలిగింపజాలదు. సైనిక శక్తి అనేది విజయం కాదు. నీవు విజయం సాధించ లేకపోతే నీకు ప్రత్యామ్నాయం వుండదు. ఎందుకంటే సామరస్యం అపజయం పాలైతే బలప్రయోగం మిగుల్తుంది. బలప్రయోగం అపజయం పాలైతే మళ్ళీ సామరస్యం అనేది అసంభవం. అధికారమూ, శక్తి అనేవి ఒక్కొక్కసారి మనం కరుణతో సంపాదించవచ్చు; హింస ఒకసారి అపజయం పాలైతే, నీరు గారిపోతే అధికారమూ, శక్తి అనేవి అడుక్కుంటే మాత్రం రావు.

బలప్రయోగానికి మరో అభ్యంతరం ఏదంటే దేనికైతే నీవు సంరక్షించుకోడానికి ప్రయత్నిస్తావో దానినే బలప్రయోగం వల్ల నాశనం చేసుకుంటావు. దేనికోసం నీవు పోరాడుతావో అది నీవు సంపాదింపదగినది. అయితే బలప్రయోగం వలన అది నలిగిపోయి క్రుంగిపోయి పోరాటం వలన సగం నాశనమైన దానినే పొందుతున్నావు."

భిక్షుగణాన్ని ఉద్దేశించి చేసిన ధర్మ ప్రవచనంలో బుద్ధుడు ధర్మ పరిపాలనకు బలప్రయోగంతో కూడిన పరిపాలనకు గల భేదాన్ని చూపాడు. సోదర భిక్షువులను సంబోధిస్తూ ఆయన ఇలా అన్నాడు :

2. "సోదరులారా! చాలా కాలానికి పూర్వం దృఢనేమి అనే చక్రవర్తి ఉండేవాడు.

అతడు ధర్మపాలకుడు, భూమి నలు దిక్కులకు అధిపతి, విజేత, ప్రజా సంరక్షకుడు. ఆయనకు దివ్యమైన ఒక చక్రముండేది. నాలుగు సముద్రాల పొలిమేరలుగా గల భూమిపైన అతడు ఆధిపత్యాన్ని సాగిస్తూ జీవిస్తూ ఉండేవాడు. ఈ ఆధిపత్యం సాహసం వల్ల కాదు, ఖడ్గంతో కాదు, కేవలం ధర్మంతోనే అతనికి సిద్ధించింది."

3. "సోదరులారా! చాలా వందల ఏళ్ళ తర్వాత, వేల ఏళ్ళ తర్వాత ఆ దృఢనేమి ఒకర్ని పిలిచి ఇలా ఆదేశించాడు. "అయ్యా! నువ్వు పోయి ఆ ధర్మచక్రం ఏదైనా కొంచెం కృంగి ఉన్నదా? లేక నిజస్థానం నుంచి కొంత జారిపడి ఉన్నదా? చూచిరా. చూచి నాకు తెలియజెయ్యి" అన్నాడు.

చాలా సంవత్సరాల తర్వాత ధర్మచక్రం కృంగిపోయిన సంగతి చూచి అతడు దృఢనేమి వద్దకు వెళ్ళి "అయ్యా! వాస్తవంగా ఆ దివ్యచక్రం కృంగిపోయి నిజస్థానం నుండి భ్రష్టమై ఉంది" అని చెప్తాడు. భిక్షుక సోదరులారా, అప్పుడు దృఢనేమి తన పెద్ద కుమారుని పిలిచి ఇలా అన్నాడు: సౌమ్యుడా! దివ్యచక్రం కృంగి కొంత నిజస్థానం నుండి జారి ఉన్నది అని చెప్తున్నారు. చక్రవర్తి యొక్క దివ్యచక్రం కృంగిపోతే లేక స్థానభ్రష్టం అయితే ఆ చక్రవర్తి చాలాకాలం జీవించడు. నేను మానుషానందాలన్నీ అనుభవించాను. దివ్యానందాలను అన్వేషించాల్సిన సమయం వచ్చింది. ప్రియపుత్రుడా! సాగర వలయితమైన ఈ భూమిపైన ఆధిపత్యం స్వీకరించు. నేను గడ్డాన్ని, శిరోముండనం చేసుకుని, పీతాంబరాలు ధరించి, గృహస్థ జీవనంనుండి గృహరహిత జీవనానికి వెళ్తున్నాను.

అలా సోదరులారా! దృఢనేమి తన కుమారుని సింహాసనం మీద ప్రతిష్ఠని చేసి శిరస్సు, గడ్డం, ముండనం చేయించుకొని కాషాయంబరాలను ధరించి ఇంటిని వదిలి గృహరహిత దశను చేరుకున్నాడు. ఆ రాజర్షి వెళ్ళిన పదవ దినం ఆ దివ్యచక్రం అంతర్ధానమైంది.

4. అప్పుడొకానొక వ్యక్తి రాజు దగ్గరికివెళ్ళి దివ్యచక్రం అంతర్ధానమైందని చెప్పాడు.

అప్పుడా రాజు దుఃఖించి వ్యధను పొంది రాజర్షి సన్నిధికిపోయి దివ్యచక్రం అంతర్ధానం గురించి తెలిపాడు. అభిషిక్తుడైన ఆ రాజు ఇలా చెప్పగా, ఆ రాజర్షి ఇలా బదులు చెప్పాడు : "ప్రియ కుమారా! దివ్య చక్రాంతర్ధానాన్ని గురించి చింతింపకు. దానిని గురించిన క్లేశం వద్దు. ఎందుకంటే ఆ దివ్యచక్రమనేది తండ్రి నుండి సంక్రమించిన వారసత్వం కాదు. అది దివ్యచక్రం. కుమారా! నీవు చక్రవర్తుల ఆర్యధర్మ ప్రవర్తనను స్వీకరించు. (ప్రపంచ వాస్తవ సార్వభౌములు నియమించుకున్న ఉత్తమాదర్శానికి అనుగుణంగా వ్యవహరించు) పూర్ణిమా పర్వదినాన స్నానం చేసి ఉన్నత స్థానంలో పండుగకు చేసిన పదార్థాన్ని ఎత్తైన వేదిక మీద పెట్టు. అప్పుడు నీకు మళ్ళీ ఆ దివ్యచక్రం సాక్షాత్కరిస్తుంది. ఆ చక్రం యొక్క నేమికి వెయ్యి ఆకులు ఉంటాయి. నాభి (కుండ) ఇంకా ఇతర సమగ్ర భాగాలతో దివ్యచక్రం నీకు కనబడుతుంది.

5. "తండ్రీ! చక్రవర్తుల ఆర్య ధర్మ లక్షణమేమి?" అని కుమారుడడిగాడు.

"ప్రియకుమారా! సత్యధర్మాల పైన ఆధారపడి వాటిని గౌరవిస్తూ పూజిస్తూ ఆ ధర్మానికి ధ్వజంగా, ధర్మానికి ఉపలక్షణంగా నువ్వు జీవిస్తూ ఉండాలి. ఆ ధర్మమే నీకు యజమానిగా ఉండాలి. అదే నీకు సదవగాహన, రక్షణ కలిగించాలి. ప్రజారక్షణం, సైన్యరక్షణం, రాజవంశ రక్షణం, సామంతుల రక్షణం, బ్రాహ్మణుల రక్షణం, గృహస్థుల రక్షణం, నగరవాసుల, జానపదుల రక్షణం, మతధర్మ రక్షణ, పశుపక్షుల రక్షణ – వీటినన్నిటినీ ఆ ధర్మమే నీకు కలిగించాలి. నీ రాజ్యంలో సర్వత్రా చెడు అనేది ఉండకూడదు. రాజ్యంలో ఎవరు పేదలో వారికి ధనమివ్వాలి.

ఎప్పుడైతే నీ రాజ్యంలో విషయోన్మాదం వల్ల కలిగే అజాగ్రత్తను త్యజించి ప్రజలు ధార్మిక జీవములవుతారో, క్షమ, సానుభూతి, ఆత్మ నిగ్రహం, ఆత్మరక్షణ కలిగి ప్రజలు తరచుగా నీ వద్దకు వచ్చి మంచిచెడ్డలను గురించి ప్రశ్నిస్తూ ఉంటారో, ఏది కర్తవ్యమో, ఏది కర్తవ్యం కాదో, ఏ విధమైన కర్మం సుఖం కలిగిస్తుందో, ఏది దుఃఖహేతువో వాటినన్నిటినీ గురించి వాళ్ళ చెప్పినదానిని విని, నీవు చెడును పరిత్యజించి మంచిని వాళ్ళు పరిగ్రహించేటట్టు చెయ్యాలి. ప్రియనందనా! ఇది సార్వభౌముల ఆర్య ధర్మ ప్రవర్తన."

"తండ్రీ అలాగే"నని అభిషిక్తుడైన రాజు బదులు చెప్పి, చక్రవర్తుల ఆర్య ధర్మ పరిపాలనను కొనసాగించాడు. అతడట్లు ప్రవర్తించగా పూర్ణిమా పర్వదినాన తలస్నానం చేసి ఉన్నత వేదికవైపు చూడగా దివ్యచక్రం వెయ్యి ఆకులతో, నాభి (కుండ)తో, నేమితో సర్వాంగ సుందరంగా సాక్షాత్కరించింది. అలాంటి సందర్భాల్లో ఏ రాజుకు పూర్తిగా ధర్మచక్రం కనిపిస్తుందో అతడు చక్రవర్తి సమ్రాట్ కాగలడు, "నేను కూడా అలాంటి సార్వభౌముడనౌతాను" అని అనుకున్నాడు.

6. "తర్వాత సోదరులారా! ఆ రాజు సింహాసనం మంచి లేచి తన రాచరికపు దుస్తులను విప్పి, వామహస్తంతో జలకుండికను

ధరించి, దక్షిణ హస్తంతో నీటిని దివ్యచక్రం మీద ప్రోక్షిస్తూ ఇలా అన్నాడు. "ఓ చక్రమా! నీవు తిరుగుతూ ముందుకు వెళ్ళి రాజ్యాలను జయించు."

"అప్పుడు ఆ దివ్య చక్రం కదలి ప్రాగ్దిశగా వెళ్ళింది. దానివెంట చక్రవర్తి చతురంగ బలంతో వెళ్ళాడు. ఎక్కడెక్కడ ఆ చక్రం ఆగి పోతుందో ఆ ప్రదేశంలోరాజు కూడా ఆగుతాడు. అతనితో అతని చతురంగ బలం కూడా ఆగుతుంది. అప్పుడు ఆ తూర్పు ప్రాంతంలోని శత్రువర్గానికి చెందిన రాజులందరూ చక్రవర్తిని సమీపించి "మహారాజా! ఇదంతా మీదే. ఓ బలసంపన్నుడా! మాకు ధర్మాన్ని ఉపదేశించండి" అన్నారు.

అప్పుడు చక్రవర్తి ఇలా అన్నాడు. "మీరు ఏ ప్రాణినీ చంపకూడదు. మీకు ఇవ్వబడని దానిని మీరు తీసుకోకూడదు. మీరు దుష్కామానికి లోబడకూడదు. అసత్యమాడ కూడదు. మత్తు పానీయాలను సేవించకూడదు. మీకున్న వాటిని ఈ రీతిగా అనుభవిస్తూ ప్రవర్తించండి."

7. అప్పుడు సోదరులారా! ఆ దివ్యచక్రం తూర్పు సముద్రంలో మునిగి లేచి మరలా దక్షిణాభిముఖంగా తిరుగుతూ వెళ్ళింది. (అక్కడ కూడా తూర్పుదిక్కున జరిగినట్లే జరిగింది). అలా దివ్యచక్రం దక్షిణ సముద్రంలో మునిగి పశ్చిమాభిముఖంగా పరిభ్రమిస్తూ వెళ్ళింది. ఉత్తరాభిముఖంగా వెళ్ళింది. అన్నిచోట్ల అలాగే జరిగింది.

సాగరముద్రితమైన సమస్తధరణిని దివ్య చక్రం ఇలా జయంచి రాజధానికి వచ్చి నిలిచింది. రాజాంతఃపుర ప్రవేశ ద్వారంలో న్యాయమండపం ముందు దానిని నెలకొల్పారా అనేటట్టు, రాజాంతఃపుర యవనికలను ప్రకాశింప చేస్తూ నిలబడింది.

8. ఇలాగే రెండో రాజు, మూడో రాజు, నాలుగో రాజు, అయిదో రాజు, ఆరో రాజు, ఏడో రాజు పరిపాలించారు. ఇలా అనేక సంవత్సరాలు జరిగిపోయిన తర్వాత ఏడవ రాజు గొప్ప విజేత, ఒక వ్యక్తినిలా ఆదేశించాడు:

"అయ్యా! దివ్యచక్రం కృంగి స్థానభ్రష్టమై ఉంటే చూచి నాకు తెలియజేయి."

అలాగేనని అతడు జవాబిచ్చాడు.

అతడు ఇలా చాలా సంవత్సరాల తర్వాత దివ్యచక్రం క్రుంగిపోయి స్థానభ్రంశమై ఉండడం చూచి గొప్ప విజేత అయిన ఆ రాజు దగ్గరికి పోయి చెప్పాడు. ఆ రాజుకూడా (పూర్వం దృఢనేమి ప్రవర్తించినట్లే) ప్రవర్తించాడు. రాజు వెళ్ళిపోయిన ఏడో రోజు దివ్యచక్రం అంతర్ధానమైంది.

తర్వాత ఒక వ్యక్తి రాజుకు ఈ సంగతి తెలిపాడు. రాజు ధర్మచక్రం అంతర్హితం అయినందుకు విచారించి దుఃఖించాడు. కాని అతను రాజర్షి వద్దకు పోయి ఆర్యధర్మాన్ని గురించి అడిగి తెలుసుకోలేదు. తన అభిప్రాయాలను అనుసరించి ప్రజాపాలన చేశాడు. ఈ పరిపాలన పూర్వ పరిపాలన కంటే భిన్నంగా ఉండడం వల్ల ప్రజలు పూర్వ పరిపాలనలోలాగా అభ్యున్నతిని పొందలేదు. పూర్వపు రాజులందరూ చక్రవర్తి ధర్మాన్ని ఆర్యధర్మాన్ని పరిపాలించిన వారే.

తర్వాత సోదరులారా! మంత్రులు, రాజోద్యోగులు, ఆర్థిక శాఖోద్యోగులు, రక్షక భటులు, ద్వారపాలకులు, ధర్మసూత్రాల కనుగుణంగా జీవించిన వాళ్ళందరూ రాజు సన్నిధికి వచ్చి ఇలా అన్నారు : "రాజా! పూర్వ రాజుల పరిపాలనకు భిన్నంగా అంటే చక్రవర్తుల ఆర్యధర్మానికి భిన్నంగా మీ సొంత భావాలను అనుసరించిన మీ పరిపాలనలో ప్రజలు అభ్యుదయం పొందడం లేదు. మీ రాజ్యంలో మంత్రులు, రాజోద్యోగులు, ఆర్థికోద్యోగులు, రక్షకభటులు, సంరక్షకులు, ధర్మసూక్తుల కనుగుణంగా జీవించేవారు. మేము, ఇతరులు ఆర్యధర్మాన్ని అనుసరిస్తున్నాం. రాజా! ఆ ధర్మాన్ని గురించి మమ్మల్ని ప్రశ్నిస్తే మేము దానిని వివరించగలం."

9. తర్వాత రాజు వాళ్లందరినీ కూర్చోమని చెప్పి ఆర్యధర్మాన్ని గురించి ప్రశ్నించాడు. వాళ్ళు అతనికి వివరించారు. వారిని ఆలకించిన రాజు తగిన ఆలనాపాలనా ఇవ్వనారంభించాడు. అసహాయులైన అనాథలకు మాత్రం ధనమివ్వ లేదు. అందువల్ల పేదరికం సర్వత్రా వ్యాపించింది.

ఎప్పుడైతే దారిద్ర్యం సర్వవ్యాపకమైందో అప్పుడొక వ్యక్తి తనకు ఇతరుల ద్వారా ఇవ్వబడని దానిని తానే స్వయంగా తీసుకున్నాడు. ప్రజలు ఈ పనిని దొంగతనం అన్నారు. అతనిని పట్టుకున్నారు. రాజు దగ్గరికి తీసుకొచ్చి "రాజా! ఇతడు తనకివ్వని దానిని తీసుకొని దొంగతనం చేశాడు" అన్నారు.

రాజు "ఇది నిజమా? నీకివ్వబడని దానిని తీసుకొని వారన్నట్లు దొంగతనం చేశావా?" అని అడిగాడు.

అతడు "రాజా! అవును సత్యమే." అన్నాడు.

'ఎందుకని'

"నేను బతకడానికి ఏ ఉపాధీ లేదు" అన్నాడు. రాజు అతనికి ధనమిచ్చి "ఈ ధనంతో నువ్వు జీవించి నీ తల్లిదండ్రులను బిడ్డలను, భార్యను పోషిస్తూ, ఏదైన ఒక వ్యాపారంలో నిమగ్నం కమ్ము" అన్నాడు.

అలాగేనని అతడు బదులిచ్చాడు.

10. ఇప్పుడు మరొక వ్యక్తి తనకివ్వబడని దానిని దొంగిలించాడు. ప్రజలు అతనిని బంధించి రాజు ఎదుటకి తీసుకొచ్చారు. "రాజా, తనకు ఇవ్వనిదానిని ఇతడు దొంగతనం చేశాడని చెప్పారు. అప్పడు రాజు (ఇంతకు ముందు వ్యక్తితో మాట్లాడినట్లే మాట్లాడి, ధనమిచ్చాడు)

11. అప్పుడు సోదరులారా! దొంగతనం చేసిన వారికందరికీ రాజు ధనమిస్తున్నాడనే వార్త లోకంలో బాగా వ్యాపించింది. దీనిని విని ప్రజలనుకున్నారు "మనకు ఇవ్వబడని దానిని దొంగిలిద్దాము" అని.

అలా చేసిన ఒక వ్యక్తిని ప్రజలు పట్టుకొని రాజు దగ్గరికి తీసుకురాగా రాజు అతనిని దొంగతనం చెయ్యడానికి గల కారణాన్ని (ఇంతకు ముందువలె) అడిగాడు.

అతడు "రాజా! తన శరీర పోషణకు ఏ ఆధారము లేదు" అన్నాడు.

ఇలా ధనమిస్తూ పోతే దొంగతనం చెయ్యడం అధికమౌతున్నదని భావించి, రాజు అతనికి శిరశ్ఛేదం విధించాలనుకున్నాడు.

"చూడండి. ఈ మనిషికి చేతులు విరిచి వెనక్కికట్టి గట్టిగా ముడివేసి తలగొరిగి భేరీ ధ్వానంతో ప్రతి వీధిలోనూ, దారి కూడలిలోనూ ఊరేగించి దక్షిణ ద్వారం ద్వారా పట్టణం దక్షిణ దిశకు తీసుకుపోయి అతని తలను నరికెయ్య" మని ఆజ్ఞాపించాడు. ప్రజలు రాజాజ్ఞను నిర్వహించారు.

12. ఇప్పుడు సోదరులారా! దొంగతనం వల్ల మరణశిక్ష వస్తుందని ప్రజలు విని "మన మందరమూ కత్తులు కటారాలు సిద్ధం చేసుకొని మనకు ఇవ్వబడని దానిని మనమే తీసుకొని సొంతదారులకు శిరశ్ఛేదం మనమే చేద్దాం" అనుకున్నారు.

ఆ విధంగా వాళ్ళు పదునైన కత్తులు సంపాదించుకొని పల్లెలమీద పట్నాల మీదపడి బందిపోటులుగా తయారైనారు. దోచుకోవడం మాత్రమే గాక ప్రజల తలలు నరికేశారు.

13. ఇలా వికలాంగులు, దారిద్ర్య పీడితులకు ఏదీ లభించని కారణంగా సర్వత్రా పేదరికం వ్యాపించింది. పేదరికం సర్వత్రా వ్యాపించడం వల్ల దొంగతనాలు పెరిగాయి. దీనివల్ల హింస క్రౌర్యం పెరిగాయి. దీనివల్ల సామాన్య జనజీవితం నాశనమైపోయింది. హత్యలు పెరగడం వల్ల మానవుల ఆయుః ప్రమాణం తగ్గిపోయి మానవ జీవితంలోని శోభ నశించింది. తర్వాత కొంతమంది వ్యక్తులు తమ జీవిత ఉత్తరార్ధంలో దొంగతనం చెయ్యడం ప్రారంభించారు.

వాళ్ళను రాజు ప్రశ్నించాడు.

"రాజా! మేము దొంగతనం చెయ్యలేదు, వాళ్ళు కావాలని అసత్యం చెబుతున్నారు" అన్నారు వారు.

14. ఇలా నిర్భాగ్యులైన వాళ్ళకు ఏమీ ఇవ్వని కారణంగా పేదరికం మొదలుకొని సమస్త పాపచర్యలూ సంక్రమించాయి. అసత్యమనేది సర్వసాధారణమైపోయింది. అప్పుడు రాజు దగ్గరికి పోయి ఒక వ్యక్తి దొంగతనం చేసిన వారిని గురించి చెప్పి దుర్భాషలాడాడు.

15. అందువల్ల సోదరులారా! నిర్భాగ్యులకు ఏమీ ఇవ్వని కారణంగా పేదరికం... దొంగతనం... హింస... హత్యలు... అబద్ధాలు... దుర్భాషణ... పెరిగిపోయాయి.

16. అసత్యంవల్ల వ్యభిచారం వ్యాపించింది.

17. ఇలా నిర్భాగ్యులైన వాళ్ళకు ఏమీ ఇవ్వని కారణంగా పేదరికం... దొంగతనం... హింస... హత్యలు... అబద్ధాలు... దుర్భాషణ... అవినీతి... పెరిగిపోయాయి.

18. ఇలా ఆ ప్రజలలో మూడు దుష్ప్రవృత్తులు- లోభం, విశృంఖల కామ ప్రవృత్తి వ్యాపించాయి.

ఈ పాపాచరణం ఇలా వ్యాపించి తల్లిదండ్రుల పట్ల భక్తిరాహిత్యం, మహాత్ముల పట్ల భక్తి శ్రద్ధ లోపం, జాతికి గర్వ కారణమైన వారిపట్ల అగౌరవం పెరిగాయి.

19. సోదరులారా! ఇలాంటి ప్రజానీకానికి కలిగిన సంతతి ఆయుః ప్రమాణం పదేళ్ళకే పరిమితమౌతుంది. ఇటువంటి ఆయుః ప్రమాణం గల వారిలో కన్యలు అయిదేళ్ళకే వివాహయోగ్యులౌతారు. ఇలాంటి వాళ్ళలో రుచుల పరిజ్ఞానం అంతరిస్తుంది, అంటే నెయ్యి, వెన్న, నూనె, చక్కెర, ఉప్పు మొదలైన వాటి రుచులను గురించిన పరిజ్ఞానం నశిస్తుంది. ఇలాంటి వాళ్ళకు కుద్రువ అనే ధాన్యం ముఖ్యాహార ధాన్యం అవుతుంది. మనకేహిదు అన్నము శాకము ఎలా ఉత్తమాహారమో అలాగే వాళ్ళకు కుద్రస ధాన్యం ఉత్తమాహారంగా ఉంటుంది. ఇలాంటి వాళ్ళలో ప్రవర్తనకు సంబంధించిన పది నైతిక రీతులు (అంటే పది పారమితులు) నశించిపోతాయి. దీనికి బదులుగా పది అవినీతి రీతులు అధికంగా విస్తరిస్తాయి. అలాంటి మనుషుల్లో నైతిక ప్రతినిధుల సంగతి అటుంచి, నీతి అనడానికే ఏ భాషాపదమూ ఉండదు. అలాంటి వ్యక్తుల్లో మాతా పితృభక్తి, ధార్మిక శక్తి, జాతి నాయక గౌరవం అంతరించిపోతాయి. నేటిలాగా మర్యాదలు జరగవు.

20. ఇలాంటి వారికి తల్లి, చెల్లెలు, అత్త, గురుపత్ని, మేనత్త, పిన్నమ్మ లేక పెద్దమ్మ తేడా లేదు. (వీళ్ళలో వావి వరసలు లేని ప్రవృత్తి వ్యాపిస్తుంది). మేకలు, గొర్రెలు, పక్షులు, పందులు, కుక్కలు, నక్కలు లాగే ప్రపంచం విశృంఖల వ్యభిచారంలో పడిపోతుంది.

ఇలాంటి వ్యక్తులలో తీక్షణమైన పరస్పరవైర భావమే సహజ లక్షణంగా మిగిలిపోతుంది. తీక్షణమైన దుర్భావం, హత్యలను పురికొల్పే ఆవేశాత్మకమైన ఆలోచనలు పెరుగుతాయి. తల్లి తన బిడ్డలపట్ల ఇలాంటి ప్రవృత్తితో వ్యవహరిస్తుంది. బిడ్డలు తండ్రి పట్ల, సోదరుని పట్ల ఇలా ప్రవర్తిస్తారు. సోదరుడు సోదరి పట్ల, సోదరి సోదరుని పట్ల ఇలాగే ప్రవర్తిస్తారు. క్రీడాకారులు తమ క్రీడల్ని తిలకించినట్లు ఈ వ్యక్తులు తమ చేష్టల్ని అనందంగా తిలకిస్తారు."

నైతిక పతనం సంభవించి పశుత్వం దాని స్థానాన్ని ఆక్రమించినప్పుడు కలిగే సమాజం యొక్క ఒక అందమైన చిత్రణ ఇది కావచ్చు. ధార్మిక రాజ్యానికి పరిరక్షకులుగా ఉండడానికి ప్రతి వ్యక్తి తప్పక నైతిక శిక్షణ పొందాలని బుద్ధుని అభిమతం.

## VIII రాజ్యం – అంతర్ధానం

శాశ్వత నియంతృత్వమే తమ రాజ్య సిద్ధాంతం కావడం, తమ రాజకీయ తత్త్వ శాస్త్రంలో బలహీనత అని కమ్యూనిస్టులు ఒప్పుకుంటారు. చివరికి రాజ్యమే లేకుండా పోతుందనే వాదనను ఆశ్రయిస్తారు. కమ్యూనిస్టులు సమాధానం చెప్పవలసిన ప్రశ్నలు రెండున్నాయి. రాజ్యం ఎప్పుడు లేకుండా పోతుంది? అది లుప్తమైపోయినప్పుడు దాని స్థానంలోకి ఏది వస్తుంది? మొదటి ప్రశ్నకు వాళ్ళు ఫలానా కాలం అని చెప్పలేరు. నియంతృత్వం ఒక పరిమిత కాలానికి మంచిది కావచ్చు, ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసం కూడా కొంతకాలం దాకా అది ఆహ్వానించ దగిందే. తన పని తాను నిర్వహించిన తర్వాత, ప్రజాస్వామ్యానికి ప్రతిబంధకంగా ఉన్న అడ్డంకుల్ని తొలగించిన తర్వాత ప్రజాస్వామ్య మార్గాన్ని సురక్షితం చేసిన తర్వాత నిరంకుశత్వాన్ని ఎందుకు సడలించకూడదు? అశోకుడు ఇందుకు ఉదాహరణగా నిలవలేదా? ఆయన కళింగులకు వ్యతిరేకంగా హింసను ప్రయోగించాడు. ఆ తర్వాత హింసను పూర్తిగా వదులుకున్నాడు. నేటి మన విజేతలు పరాజితులను నిరాయుధులుగా చెయ్యడమే గాక తాము కూడా నిరాయుధులైతేనే ప్రపంచ మంతటా శాంతి నెలకొంటుంది.

కమ్యూనిస్టులు జవాబు చెప్పలేదు. రాజ్యం ఎప్పుడు లేకుండా పోతుంది అన్న ప్రశ్న కన్నా రాజ్యం లుప్తమైపోయినప్పుడు దాని స్థానంలోకి ఏది వస్తుంది? అన్న ముఖ్యమైన ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం లేదు. రాజ్యం స్థానంలో అరాచకం వస్తుందా? అలా అయితే, కమ్యూనిస్ట్ రాజ్య నిర్మాణం నిష్ప్రయోజనకరమైన ప్రయత్నమౌతుంది. బల ప్రయోగంతో తప్ప అది నిలబడలేనప్పుడు, దానిని కాపాడే బలాన్ని ఉపసంహరించుకుంటే అది అరాచకంగా మారిపోయేటప్పుడు కమ్యూనిస్ట్ రాజ్యం ఏ విధంగా మంచిది?

బలాన్ని ఉపసంహరించిన తర్వాత కమ్యూనిస్ట్ రాజ్యాన్ని కాపాడగలిగేది, నిలబెట్ట గలిగేది మతమొక్కటే. కానీ కమ్యూనిస్టుల దృష్టిలో మతం నిషిద్ధం. మతం పట్ల వాళ్ళకెంత అసహ్యమంటే, మతాలలో కమ్యూనిజానికి సహాయపడే మతాలేవి? సహాయపడని మతాలేవి? అని పరిశీలించి చూడలేనంత. వాళ్ళు క్రైస్తవ మతంతో బాటు బౌద్ధమతాన్ని కూడా అసహ్యించుకుంటారు. ఆ రెండు మతాల మధ్య భేదాన్ని చూడరు. క్రైస్తవ మతంమీద కమ్యూనిస్టులు చేసే ఆరోపణలు రెండు. మొదటిది క్రైస్తవ మతం ప్రజలకు పరలోక సిద్ధాంతాన్ని చూపించి ఈ ప్రపంచంలో దారిద్ర్యంతో బాధపడేట్టు చేసింది అన్నది. బౌద్ధ మతానికి సంబంధించినంత వరకు, ఈ వ్యాసంలో ఇంతకుముందు ఉదహరించిన విషయాలను పరిశీలిస్తే, బౌద్ధమతం మీద అలాంటి ఆరోపణ చెయ్యడానికి వీలులేదు.

కమ్యూనిస్టులు క్రైస్తవ మతంమీద చేసిన రెండో ఆరోపణను బౌద్ధమతం మీద చెయ్య లేదు. అది మతం మత్తు మందు అన్న ఆరోపణ. ఇది బైబిల్లోని కొండమీది ప్రసంగం ఆధారంగా చేసిన ఆరోపణ. కొండమీది ప్రపంగం (SERMON ON MOUNT) దారిద్ర్యాన్ని బలహీనతను ఉన్నతంగా చేస్తుంది. ఇది పేదలకు బలహీనులకు స్వర్గం లభిస్తుందనే హామీ నిస్తుంది. బుద్ధుని బోధనలలో అటువంటిదేదీ కనిపించదు. బుద్ధుని బోధనలు సంపాదన సంపాదించడాన్ని గురించి చెబుతాయి. తన శిష్యులలో ఒకరైన అనాథ పిండికునికి ఆయన చేసిన ధర్మబోధను ఉదహరిస్తాను.

ఒకనాడు అనాథ పిండకుడు సర్వోన్నతులు బసచేసిన చోటుకి వచ్చాడు. వచ్చి ఆయనకు నమస్కరించి ఒక ప్రక్కన కూర్చుని ఇలా అడిగాడు: "మహానుభావా! గృహస్తు పొందదగినవి, ఆమోదింపదగినవి, ఆనందదాయకమైనవి అయినా సంపాదించడం కష్టమైనవి ఏవి?"

ఈ ప్రశ్న విని ఆయన ఇలా చెప్పాడు: "వాటిలో మొదట పొందదగింది న్యాయసమ్మత మైన సంపద".

'రెండోది మీ బంధువులు సైతం న్యాయ సమ్మతంగా సంపదను పొందేట్టు చూడడం',

'మూడోది పడిపోయే వయసు దాకా దీర్ఘకాలం జీవించడం.' →

సంస్మరించుకుందాం

# కామ్రేడ్స్ విశ్వమోహనరెడ్డి, మరియమ్మలకు జోహార్లు

**పీడిత** ప్రజాఉద్యమ నాయకుడు, ప్రజారచయిత కామ్రేడ్ విశ్వమోహనరెడ్డి, రైతుకూలీ ఉద్యమ నాయకురాలు కా॥ మరియమ్మలను 2000 సం॥ ఏప్రిల్ 11న రాజ్యం హత్యగావించింది.

కడప జిల్లాలో సంపన్న కుటుంబంలో పుట్టిన **కా॥ వివిఎంఆర్** చిన్నవయసులోనే పీడితవర్గ రాజకీయాలను స్వీకరించారు. జీవితంలో కష్టాల్ని, శ్రమజీవులపై గ్రామీణ ఫ్యూడల్ పెత్తందార్లు సాగించే నికృష్ట శ్రమదోపిడీ, క్రౌర్యాలను స్వయంగా చూశాడు; వాటికి గురయ్యాడు. ఎమర్జన్సీ నిర్బంధ కాలంలో రిక్షా కార్మికునిగా, హోటల్ సర్వర్‌గా, వివిధ పనులు చేసుకుంటూ ఆయారంగాల ప్రజలను సంఘటితపరిచాడు. విలక్షణమైన రచయితగా ఎన్నో నవలలు రాశాడు. ప్రచారార్భాటాలకు దూరంగా అలజడి జీవితంగా, ఆందోళన ఊపిరిగా, పోరాటం లక్ష్యంగా జీవించాడు. ప్రజాశత్రువుల పట్ల నిర్దాక్షిణ్యమైన ద్వేషం, పీడిత ప్రజలపట్ల అంతులేని ఔదార్యం ప్రదర్శించాడు. పల్నాడు, వినుకొండ, దొనకొండ ఏరియాలలో విస్తృతంగా ప్రజాపోరాటాలు నిర్మించాడు. అక్రమ నిర్బంధాలు, అరెస్టులు, కేసులు, జైలుశిక్షలు అనుభవించాడు. లెనిన్‌నగర్, టి.ఎన్.నగర్‌ల ఏర్పాటుకు నాయకత్వం వహించాడు. గ్రామీణ పేదలను కదిలించి విస్తృతంగా భూపోరాటాలు నిర్వహించాడు. పోలియోతో చిన్నవయసులోనే అంగవికలురాలైన ఇందిరగారిని కోరి ఆదర్శ వివాహం చేసుకున్నారు. త్యాగధనుడు కా॥ విశ్వమోహనరెడ్డికి విప్లవ జోహార్లు.

**కా॥ మరియమ్మ** అట్టడుగు దళిత శ్రామిక కుటుంబంలో పుట్టి, గృహిణిగా, క్రైస్తవ భక్తురాలిగా వుంటూ, ఉద్యమాలలో పాల్గొంటూ క్రమంగా చైతన్యవంతురాలై రైతుకూలీ సంఘం కార్యకర్తగా, నాయకురాలిగా ఎదిగింది. సంఘ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న క్రమంలో రౌడీగూండాల దాడులు, పోలీసు నిర్బంధం, కేసులతో పాటుగా కుటుంబపు ఆటుపోట్లను, దోపిడీశక్తుల నీచమైన ప్రచారాలను తట్టుకొని నిలిచింది. శారీరక, మానసిక చిత్రహింసలెన్నింటినో భరించింది. ప్రజల ఆశయం కోసం నిలిచి పోరాడి పోలీసు తుపాకి గుళ్ళకు నేలకొరిగింది. కామ్రేడ్ మరియమ్మకు జోహార్లు. ✸

---

➡ ఓ సంసారీ! ఈ ప్రపంచంలో కోరదగినవి, ఆనందదాయకమైన, ఆమోదయోగ్యమైనవి అయిన ఈ నాలుగు సంపాదించాలంటే నాలుగు నియమాలున్నాయి. అవి విశ్వాసం, సత్ప్రవర్తన, దాతృత్వం, జ్ఞానం–వీటి అనుగ్రహం.

హత్య, దొంగతనం, వ్యభిచారం, అబద్ధం చెప్పడం, త్రాగుడు నుంచి సత్ప్రవర్తనానుగ్రహం మనిషిని నివారిస్తుంది.

లోభ బుద్ధి లేకపోవడం, ఉదారత్వం, దానం చెయ్యడంలో ఉత్సాహం చూపడం, బహుమతులివ్వడంలో నిమగ్నం కావడం ఇవి గృహస్థులో ఉండే దాతృత్వం అవుతుంది.

అత్యాశ, లోభం, దుష్ట బుద్ధి, సోమరితనం, మైకం, పరధ్యానం, తొందర, సందేహం ఇవి ఉంటే మనిషి తప్పుడు పనులు చేస్తాడని, చెయ్యవలసిన పనుల్ని విస్మరిస్తాడని, అలా చెయ్యడం ద్వారా సంతోషాన్ని గౌరవాన్ని పోగొట్టుకుంటాడని గ్రహించడం జ్ఞానానుగ్రహం.

అత్యాశ, లోభం, దుష్ట బుద్ధి, సోమరితనం, మైకం, పరధ్యానం, తొందర, సందేహం ఇవి మెదడుకు అంటిన మాలిన్యాలు. ఈ మాలిన్యాలు అంటని గృహస్థ గొప్ప జ్ఞానాన్ని, ఉన్నతమైన జ్ఞానాన్ని, స్వచ్ఛమైన దర్శనాన్ని, సమ్యక్ జ్ఞానాన్ని పొందుతాడు.

అలా సంపదను న్యాయంగా, చట్టబద్ధంగా సంపాదించడం, గొప్ప శ్రమచేసి సంపాదన చెయ్యడం, భుజ బలంతో సమకూర్చడం, చెమట చిందించి సంపాదించడం ఒక వరం. గృహస్థ తాను సుఖపడతాడు, సంతోషపడతాడు. తనను తాను ఆనందంలో నింపుకుంటాడు. తల్లిదండ్రులను, భార్యాబిడ్డలను, సేవకులను, శ్రామికులను, స్నేహితులను, సహచరులను సుఖసంతోషాలతో నింపుతాడు.

భౌతిక బలాన్ని ఉపసంహరించిన తర్వాత కమ్యూనిజాన్ని నిలుపుకోడానికి బౌద్ధమతం ఏకైక సాధనమన్నవాస్తవం పట్ల రష్యన్లు ఆసక్తి కనబరుస్తున్నట్లు లేదు.

రష్యన్లు తమ కమ్యూనిజం పట్ల గర్వపడుతుంటారు. అయితే బుద్ధుడు బౌద్ధసంఘ స్థాయిలో నియంతృత్వం లేని కమ్యూనిజాన్ని స్థాపించడం అద్భుతాల్లోకెల్లా అద్భుతమని వాళ్ళు మరచిపోయారు. ఇది అతి చిన్న స్థాయిలోని కమ్యూనిజం కావచ్చు కానీ ఈ కమ్యూనిజంలో నియంతృత్వం ఉండదు. లెనిన్ సాధించడంలో విఫలమైన అద్భుతం ఇది.

బుద్ధుడి పద్ధతి విభిన్నమైంది. ఆయన పద్ధతి, మనిషి ఆలోచనను మార్చడం. ప్రవృత్తిని సంస్కరించడం. దానివల్ల మనిషి ఏమి చేసినా ఐచ్ఛికంగా, వత్తిడి లేకుండా చేస్తాడు. మనిషి ప్రవృత్తిని సంస్కరించడానికి ఆయన అనుసరించిన ప్రధాన విధానం ధమ్మ (ధర్మం), నిరంతర ధర్మబోధన. మనుషులు చెయ్యడానికి ఇష్టపడని వాటిని అవి వాళ్ళకు మంచిని చేసేవే అయినా చెయ్యమని బలవంతం చెయ్యకపోవటం బుద్ధుని మార్గం. ఆయన మార్గం మనిషి ప్రవృత్తిని సంస్కరించడం. దాని ద్వారా వాళ్ళు ఐచ్ఛికంగా పనిచేస్తారు.

రష్యాలో కమ్యూనిస్ట్ నియంతృత్వం గొప్ప విజయాలను సాధించినట్లు చెబుతారు. దాన్ని కాదనడంలేదు. అందుకే వెనకబడిన దేశాలకన్నిటికీ రష్యన్ నియంతృత్వం మంచిదే అంటాను నేను. అయితే నియంతృత్వం శాశ్వతంగా ఉండాలని వాదించడం మాత్రం మంచిది కాదు. సంఘం కేవలం ఆర్థిక విలువల్నే కోరుకోదు. అది ఆధ్యాత్మిక విలువల్ని నిలుపుకోవాలని కూడా కోరుకుంటుంది. శాశ్వత నియంతృత్వం, ఆధ్యాత్మిక విలువలమీద దృష్టి నిలపలేదు. దృష్టిని నిలపాలని అనుకున్నట్లు కూడా లేదు. రాజకీయ ఆర్థిక శాస్త్రాన్ని కార్లైల్ పందుల తత్వశాస్త్రం అన్నాడు. కార్లైల్ వాదం సరైంది కాదనుకోండి. మనిషికి భౌతిక సౌకర్యాలు కావాలి కదా! అయితే కార్లైల్‌వాదం ఎంత తప్పో, కమ్యూనిస్ట్ సిద్ధాంతం కూడా అంతే తప్పు. ఎందుకంటే, మనుషులు పందులకన్నా మెరుగు కాదన్నది వాళ్ళ సిద్ధాంత లక్ష్యం అయినట్లు కనిపిస్తుంది. మనుషులు భౌతికంగా వాళ్ళ సిద్ధాంత లక్ష్యం అయినట్లు కనిపిస్తుంది. మనుషులు భౌతికంగా అభివృద్ధి చెందాలి, ఆధ్యాత్మికంగానూ ఎదగాలి. సమాజం కొత్త పునాది కోసం ప్రయత్నించడం–ఫ్రెంచి విప్లవంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మూడు మాటల్లో చెప్పబడింది. ఈ నినాదం ఉన్నందువల్లే ప్రజలు ఫ్రెంచి విప్లవానికి ఆహ్వానం పలికారు. అది సమానత్వం తీసుకురాలేకపోయింది. రష్యన్ విప్లవం సమానత్వ సాధనను ఉద్దేశించింది. కాబట్టి మనం దానిని ఆహ్వానిద్దాం. అయితే సమానత్వాన్ని సాధించడంలో స్వేచ్ఛ సౌభ్రాతృత్వాలను త్యాగం చెయ్యాలన్న దాన్ని సమ్మతించలేం. స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం లేకుండా సమానత్వానికి విలువలేదు. బుద్ధుని మార్గంలో మాత్రమే ఈ మూడూ నిలబడగలవు, మనగలవు. కమ్యూనిజం ఒక్కటి మాత్రం ఇవ్వగలదు, అన్నిటినీ ఇవ్వజాలదు. ✸

# కర్ణాటక- బ్యాడగి మిర్చి యార్డు కార్యాలయ దగ్ధం ఘటన

# రైతులపై అక్రమ కేసుల రద్దుకై వాస్తవ సేకరణ కమిటీ డిమాండ్

**కర్ణాటక** రాష్ట్రంలో 1956లో ప్రారంభమైన బ్యాడగీ ఎండు మిర్చి వ్యాపార కేంద్రం, ఆసియా ఖండంలోనే అతిపెద్ద ప్రభుత్వ వ్యాపార కేంద్రాలలో ఒకటి.

అలాంటి బ్యాడగి వ్యాపార కేంద్రంలో ఊహించని విధంగా, ఏనాడు జరగని విధంగా మార్కెట్ కమిటీ కార్యాలయం పై 11-3-2024న దాడి జరిగింది. ఈ దాడిలో కార్యాలయంలోని రికార్డులు కాలిపోయాయి. కార్యాలయ సామాగ్రి ధ్వంసం అయింది. సిబ్బంది వాహనాలు తగలబడిపోయాయి. మంటలు ఆర్పివేయడానికి వచ్చిన అగ్నిమాపక వాహనం కూడా తగలబడింది. ఈ దాడిలో కోట్లాది రూపాయల నష్టం జరిగింది. మోటారు సైకిళ్ళు, చెత్త ఊడ్చే వాహనం కూడా దగ్ధమయ్యాయి. చాలామంది రైతులని ఈ నేపథ్యంలో అరెస్టు చేశారు.

**ఈ ఘటనపై వెంటనే స్పందించిన ఏఐకేఎంకేఎస్ అనుబంధ కర్ణాటక రాజ్య రైతు సంఘం (కె.ఆర్.ఆర్.ఎస్) వాస్తవ సేకరణ కమిటీని నియమించింది.** కె.ఆర్.ఆర్.ఎస్ కర్ణాటక రాజ్యాధ్యక్షులు ఆర్ మాధవరెడ్డి నేతృత్వంలో ఈ కమిటీ 2024 మార్చి 15వ తేదీన బ్యాడగి పట్టడానికి వెళ్లి పరిశీలించింది.

ఈ వాస్తవ సేకరణ కమిటీలో ఆర్ మాధవరెడ్డి, న్యాయవాదులు చాగనూరు మల్లికార్జున రెడ్డి, వీరేంద్ర పాటిల్, బళ్లారి జిల్లా కురుగోడు తాలూకా రైతుసంఘ కార్యదర్శి సురేంద్ర, హసిరు సేన నాయకులు ఓంకార గౌడ, శ్రీనివాసులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీకి దావణ గేరె రైతు నాయకులు రవి స్వామి, ఎం ఎన్ నాయక్‌లు సహాయకులుగా పనిచేశారు.

ఈ కమిటీ అల్లర్లు జరిగిన స్థలాన్ని, మార్కెట్ యార్డును క్షుణ్ణంగా పరిశీలించి వివిధ సెక్షన్లకు సంబంధించిన వారందరినీ కలిసి చర్చించింది. అనంతరం కమిటీ తన పరిశీలన, అభిప్రాయాలను తెలియపరిచింది.

ధరలు తగ్గించినందుకు రైతులు సహజంగా తమ న్యాయమైన ఆగ్రహాన్ని వ్యాపారస్తులపై ప్రదర్శిస్తారు. కానీ ఇక్కడ ఒక్క వ్యాపారి కూడా దాడికి గురికాలేదు. ఏ ఒక్క అంగడి కానీ, కొనుగోలు చేసిన సరుకు కానీ తగలబడలేదు.

దాదాపుగా 1000 మంది పైన కేసులు నమోదు చేసిన బ్యాడగి పోలీసులు, స్థానికులను ఎవరినీ అరెస్టు చేయలేదు. సిసి కెమెరాలు వీడియోలు, చూసి కాకుండా దొరికిన వాళ్ళను దొరికినట్లు అరెస్టులు చేశారు. అరెస్టు కాబడిన వారు మెజారిటీ అమాయక రైతులే. రైతుల ముసుగులో మిరప వ్యాపారుల దళారీ మాఫియా పకడ్బందీగా రైతుల కోపాన్ని మార్కెట్ యార్డు కార్యాలయం పైకి మళ్లించిన దాని ఫలితమే ఈ అల్లర్లు. నిజంగా రైతులు అల్లర్లకు పూనుకొని ఉంటే,ఎక్కడికక్కడ దాడికి దిగే వారు. ఎన్నుకోబడ్డ వాటిపైనే దాడి చేసేవారు కాదు. కేవలం మార్కెట్ యార్డు కార్యాలయ పాలకవర్గం పైనే వ్యూహాత్మకంగా జరిగిన దాడి ఇది. ముందుగానే సిద్ధం చేసుకున్న పెట్రోల్, డీజిల్ వాడి ఏపీఎంసీ పాలక భవనాన్ని మిర్చి మాఫియా తగలబెట్టింది. తెలివిగా మాఫియా అక్కడి నుంచి తప్పించుకొని అమాయకుల రైతుల అరెస్టుకు కారణమైంది. దాడికి కారకులెవరో తెలిసినా కూడా అధికారులు కానీ, వ్యాపారస్తులు కానీ స్థానికులు కానీ నోరు విప్పడం లేదు.

ఈ పరిశీలనల తర్వాత వాస్తవ సేకరణ కమిటీ ఈ విధంగా డిమాండ్ చేసింది

- ❖ బ్యాడగీలో మూడు రాష్ట్రాల అమాయక రైతులపై పెట్టిన కేసులను రద్దు చేయాలి. అసలు నేరస్థులను గుర్తించేలా న్యాయ విచారణకు ఆదేశించాలి.
- ❖ అన్ని మార్కెట్ యార్డులలోనూ, ప్రైవేట్ మార్కెట్లలోనూ రైతులను మోసం చేస్తున్న ప్రైవేటు మాఫియాలను అరికట్టాలి. రైతుల కష్టార్జితాన్ని రైతులకు దక్కేలా చర్యలు చేపట్టాలి.
- ❖ ప్రతి పంచాయతీ, కనీసం ప్రతి మండలానికి కొన్ని కోల్డు స్టోరేజీ గోడౌన్ల నిర్మాణం చేపట్టి, రైతులు పండించిన పంటలకు ధర ఉన్నప్పుడే అమ్ముకునే ఉచిత అవకాశాలు కల్పించాలి.
- ❖ కర్ణాటక అసెంబ్లీలో ప్రత్యేకంగా తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను అసెంబ్లీలోనే బిల్లు పెట్టి రద్దు చేయాలి.
- ❖ మార్కెట్ యార్డు కమిటీలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.
- ❖ ఈ-మార్కెట్‌పై నిరంతర నిఘా ఉంచాలి. రైతులకు సరైన అవగాహన కల్పించాలి.
- ❖ వేలాది మంది రైతులు ఒకే రకం పంటల వైపు పరుగులు తీయకుండా ప్రభుత్వమే శాస్త్రీయ పంటల విధానం రూపొందించాలి.
- ❖ గిట్టుబాటు ధర, ఆహార భద్రత కల్పించే జవాబుదారీతనం నుంచి ప్రభుత్వాలు తప్పుకోరాదు. వ్యవసాయ ఉత్పత్తులపై జిఎస్టి విధించరాదు.
- ❖ వ్యవసాయంలోకి కార్పొరేట్ కంపెనీల ధన దాహపు చొరబాటును అరికట్టాలి.
- ❖ కనీసంగానైనా డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను పెరిగిన ఖర్చులు జీఎస్టీల నేపథ్యంలో పునర్ నిర్వచించి అమలు చేయాలి.

ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా, రైతుల కళ్ళల్లో కన్నీళ్లే వస్తున్నాయి. లక్షల రూపాయలు సాగు ఖర్చులు పెట్టి, అప్పులు చేసి పండించిన పంటలపై, ఒక క్వింటాలుకి పదివేల రూపాయల ధర కోల్పోతే, 10 క్వింటాళ్లు అమ్మిన రైతుకే లక్ష రూపాయల చొప్పున మోసం జరిగితే, కోట్లాదిమంది రైతుల నుంచి ప్రతి సంవత్సరం అన్ని పంటలలో ఎంత దోపిడీ జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

ఈ ప్రభుత్వాలు బ్యాంకు ఖాతాల్లో ఎన్నికల ముందు ఎంగిలి మెతుకుల బిచ్చాన్ని విదిలిస్తున్నాయి. ప్రొఫెసర్ నంజుండ స్వామిగారు చెప్పినట్టు రైతులు ఎప్పటికీ, ఎవరికీ బాకీదారులు కాదు... సర్కారే అసలు బాకీదారు'. వాళ్లకు చెందాల్సిన గిట్టుబాటుధరల సొమ్ము ఇన్నేళ్లుగా ఎన్ని లక్షల కోట్లు ఎవరెవరి ఆస్తులుగా మారేందుకు ప్రభుత్వాలు సహకరిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. కనుక అసలు తప్పు ప్రభుత్వ విధానాల్లోనే ఉంది మూల కారణాలను మార్చుకోకుండా ఇలాంటి ఘటనలను పూర్తిగా నివారించలేమని బ్యాడగి వాస్తవసేకరణ కమిటీ అభిప్రాయపడింది. ✸

**Janasakti (Communist Revolutionaries' Monthly)    RNI No. 8315/63 VJ-077/2022-24**

No.of pages : 28    Date of publication : 1st & 2nd of Every Month    Posting date : 5th or 6th of Every Month

# గాజాలో మానవ హననాన్ని ఆపేందుకు ఇజ్రాయెల్‌కు ప్రపంచ ఇంధన సరఫరాను నిరోధించాలి

## పాలస్తీనాలోని వివిధ గ్రూపుల, సంఘాల, పర్యావరణ సంస్థల పిలుపు

**పాలస్తీనా** ప్రజల సామూహిక హననాన్ని, ఇజ్రాయెల్ జాత్యహంకార విధానాన్ని, స్థానిక పాలస్తీనీయులను తుడిచిపెట్టటాన్ని ఇజ్రాయెల్ ఆపేంతవరకూ, ఇజ్రాయెల్‌కు ప్రపంచ దేశాలు ఇంధన వనరుల సరఫరాను సంపూర్ణంగా నిరోధించాలని పాలస్తీనా సంస్థలు పిలుపునిచ్చాయి.

2024 జనవరి 26 శుక్రవారంనాడు, అంతర్జాతీయ న్యాయస్థానం – ఇజ్రాయిల్ మానవ హననంపై దక్షిణాఫ్రికా నమోదు చేసిన కేసును స్వీకరిస్తున్నట్లుగా చారిత్రక ప్రకటన చేసింది. సంవత్సరాల తరబడి ఐక్యరాజ్యసమితి విభాగాలు సాగించిన దశాబ్దాల కాలపు నిర్లక్ష్యం, వెనక్కు లాగటాల తర్వాత, ఈ కేసును విచారణకు స్వీకరించటం – పాలస్తీనా ప్రజల నిర్మూలన అనే ఇజ్రాయిల్ ప్రకటిత లక్ష్యాన్ని ప్రపంచానికి సుస్పష్టంగా వెల్లడిచేసింది.

అయినప్పటికీ, ఇజ్రాయిల్ సాగిస్తున్న మానవహననం దండించ బడకుండా కొనసాగుతూనే వుంది; బాంబుల వర్షాన్ని భయోత్పాతంతో మనం చూస్తూనే వున్నాం; దృఢంగా నిలిచిన గాజా ప్రజలపై హత్యలు, మృత్యువు వర్షిస్తూనే వున్నాయి. 30 వేల మందికి పైగా పాలస్తీనా ప్రజానీకం హతులయ్యారు; యావత్ గాజా స్ట్రిప్ కూడా శిథిలాలమయంగా మారిపోయింది; ఆ ప్రాంత జనాభా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ మారణ హోమాన్ని ఆపేందుకు అత్యవసర చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

చట్టభీతి, శిక్షల భయమేమీ లేకుండా ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న ఈ చర్యలకు స్పందనగా, పాలస్తీనా సంస్థల ప్రతినిధులమైన మేము – ప్రపంచ దేశాల నుండి ఇజ్రాయిల్‌కు ఇంధన వనరుల సరఫరాను సంపూర్ణంగా నిరోధించాలని పిలుపు నిస్తున్నాము. ఈ మారణకాండను ఆపేంతవరకు జాత్యహంకార విధానాన్ని విడనాడేంతవరకూ, స్థానిక ప్రజలను తుడిచిపెట్టే చర్యలు నిలిపి వేసేంతవరకూ ఇజ్రాయిల్‌కు ఇంధన సరఫరాను నిలిపివేయాలని పిలుపునిస్తున్నాము.

ఇంధన సరఫరాలే ఇజ్రాయిల్ యుద్ధ యంత్రాంగానికి కీలకమైనవి. వాటి యుద్ధ ట్యాంకుల నిర్వహణకు, సాయుధ సైన్యాల తరలింపుకు, ఓడలకు, సైనిక బుల్‌డోజర్లకు, గాజాపై మృత్యు విధ్వంసాన్ని వర్షించే ప్రత్యేక ఇజ్రాయిల్ జెట్ యుద్ధవిమానాలకు–ఇంధనం ఎంతో అవసరం. ఇప్పటికే ప్రపంచవ్యాపితంగా భారీ స్పందన వ్యక్తమౌతున్న – ఇజ్రాయిల్ సాయుధీకరణను ఆపాలనే పాలస్తీనా కార్మికసంఘాల పిలుపు – ఇజ్రాయిల్‌కు ఇంధన సరఫరాను నిరోధించాలనే డిమాండ్‌తో మరింత సమగ్రమౌతుంది.

చమురు, సహజవాయువు, లోహ ఉత్పత్తి దేశాల్లోని అన్ని ట్రేడ్ యూనియన్లు, కార్మిక సంస్థలు, రవాణా, నౌకాశ్రయాల్లో కార్మికులు.... ఇజ్రాయిల్ యుద్ధ యంత్రానికి ఆహారమందించటాన్ని అడ్డుకోవాలని; గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండకు మద్దతునిస్తున్న దేశాలకు ఎగుమతిని అడ్డుకోవాలని పాలస్తీనా జనరల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (పిజిఎఫ్‌టియు) గతంలో ఇచ్చిన పిలుపులోని డిమాండ్లు కూడా ప్రస్తుత పిలుపుతో కలిసి వుంటాయి.

ఈ కృషిపై ఆధారపడి, ఈనాడు మేము కార్మికులకు, పర్యావరణ కార్యకర్తలకు, మానవ హక్కుల సమూహాలకు, పౌరసమాజానికి, దేశాలకు – తక్షణం ఈ చర్యలు తీసుకోవాలని అత్యవసర పిలుపునిస్తున్నాము.

1. ఇజ్రాయిల్‌కు సరఫరా చేసే అన్ని శక్తి వనరులను ఆపివేయాలి.
2. ఇజ్రాయిల్ నుండి అన్ని ఇంధన వనరుల దిగుమతులను ఆపివేయాలి.
3. ఇజ్రాయిల్ ఇంధన కార్పొరేషన్ల సేకరణ కేంద్రాల నుండి, వాటితో భాగస్వామ్య ఒప్పందాలనుండి విడగొట్టుకోవాలి.
4. మానవహననం సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు మద్దతుగానున్న వివిధ ప్రపంచ దేశాలైన అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ మరియు ఇతర సామ్రాజ్యవాద దేశాలకు – మధ్యప్రాచ్య దేశాలనుండి అన్ని ఇంధన వనరుల ఎగుమతులను ఆపివేయాలి.

కార్మిక సంఘాలు ఇచ్చిన ఇంధన వనరుల సరఫరాపై నిషేధం, ఇంకా ఇతర ప్రాచుర్యం పొందిన డిమాండ్లు వలసవాద వ్యతిరేక చరిత్రలో పశ్చిమాసియాలోనూ, మరిన్ని బయట ప్రాంతాలలోనూ వత్తిడి పెంచే అంశాలుగా గణనీయమైన పాత్ర నిర్వహించాయి. అంతర్జాతీయ చట్టం అమలులో నూతన పద్ధతులను ఈ డిమాండ్లు ముందుకు తెస్తూ, ఇజ్రాయిల్ యంత్రాంగం తన మరణాన్ని కొనితెచ్చుకునే విధంగా ఒత్తిడి తెస్తున్నాయి.

ప్రపంచవ్యాపిత మిత్రులారా, మద్దతుదారులారా, పర్యావరణవాదులారా, చైతన్యశీలురైన ప్రజలారా, ఇజ్రాయిల్ సామూహిక హననం సాగించటానికి తోడ్పతున్న ఇంధన వనరుల సరఫరాను నిరోధించటంలో సందేహాలకు తావులేకుండా కదలాలని మేము పిలుపునిస్తున్నాం. మీమీ పని ప్రదేశాలలో, నౌకాశ్రయాలలో అన్ని చమురు కంపెనీల బయట ఇజ్రాయిల్‌కు ఇంధనం జేరవేసే మార్గాలు అన్నింటినీ విచ్ఛిన్నం చేయమని పిలుపునిస్తున్నాం.

కర్తవ్యం అమలుకు కదలాల్సిన సమయమిది! గాజా కోసం చారిత్రాత్మక సమీకరణలు నిర్వహిద్దాం. మానవహననాన్ని అంతమొందించేందుకు, ఒక స్వతంత్ర పాలస్తీనా ఉద్యమాన్ని ముందుకు కొనసాగిద్దాం.

**2024 ఫిబ్రవరి 26**

**అరబ్ గ్రూప్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ నేచర్ డిస్‌రప్ట్ పవర్.**

**పిఎస్**

**పాలస్తీనియన్ ఎన్విరాన్‌మెంటల్ ఎన్‌జిఓస్ నెట్‌వర్క్**

**(పెన్‌గాన్)**

**పాలస్తీనియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పబ్లిక్ డిప్లొమా**

**(పిఐపిడి)** ✡

Printed, Published and Owned by S. Seshamma

32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010

Printed at SVR Offset Printers & Binders, D.No. 24-29-128B, Garimallavari Street, Gulabithota, Vijayawada-3

Editor : S. Seshamma, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010